అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 16-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 207 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50

ప్రజలకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు
వారి దశను మార్చేందుకు

ప్రపంచపు అతి భారీ మోటార్లతో, దానిని మించిన వజ్రసంకల్పంతో సాధ్యపడిన

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్



భారతదేశంలో త్రాగునీరు, సాగునీరు కోసం దశాబ్దాలుగా పరితపిస్తున్న ప్రాంతాల్లో మరో మార్గంలేక ప్రజలు నిరంతరం ఇతర ప్రాంతాలకు వలసపోయేవారు. **తెలంగాణ ఆవిర్భావంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయినవి.**

గౌరవనీయ తెలంగాణ ముఖ్యమంత్రి, **శ్రీ కె. చంద్రశేఖర్ రావు** గారి అపూర్వ నాయకత్వాన భీమ, కల్వకుర్తి, కోయిల్సాగర్ లాంటి అనేక సాగునీటి ప్రాజెక్టులు ప్రారంభించబడినవి. క్రమేణా ప్రజల వలసలు ఆగినవి.


ఈ సమయంలో తెలంగాణ యవనికపై ఒక అద్భుత ఘట్టానికి తెరతీయబడింది. తరతరాలుగా నిరాదరణకు గురై, తడారిన గొంతులతో, నెర్రులిచ్చిన భూములతో కళావిహీనంగా మారిన ప్రాంతాల్లో **శ్రీశైలం నుండి కృష్ణా జలాలను ఎత్తిపోసి,** జలసిరి అందించేందుకు, తెలంగాణ ప్రజల భవిష్యత్తును సమూలంగా మార్చేసేందుకు 50,000 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టాత్మకమైన **పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్** ఆవిష్కరించబడింది.

మొదటి దశ

70 మండలాల్లోని 1226 గ్రామాలకు తాగునీటి సౌకర్యం

రెండవ దశ

6 జిల్లాల్లోని 19 నియోజకవర్గాలలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు



ప్రాజెక్ట్ విశిష్టతలు

- 5 లిఫ్ట్ దశలు
- 6 రిజర్వాయర్లు
- 672 మీటర్ల ఎత్తుగల లిఫ్ట్
- 61.57 కి.మీ. పొడవు సొరంగం
- 915.47 కి.మీ. ప్రాథమిక కాలువ
- ఒక్కొక్కటి 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 31 బాహుబలి పంపులు మరియు ఒక్కొక్కటి 75 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 3 పంపులు

జల వనరులు

- రోజుకు 1.5 TMC నీరు లిఫ్ట్ చేయబడుతుంది
- 67.52 TMC నిలవ సామర్థ్యాన్ని కలిగివుంది
- పరిశ్రమల వినియోగానికి 0.33 టీఎంసీలు

లబ్ధిపొందే ప్రాంతాలు

- 1226 గ్రామాలు తాగునీరు పొందుతాయి
- 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు
- నాగర్ కర్నూలు, మహబూబ్‌నగర్, నారాయణ్‌పేట్, రంగారెడ్డి, వికారాబాద్ మరియు నల్గొండ జిల్లాలకు సాగునీరు అందుతుంది.
- తాగునీరు: జంట నగరాలకు కలిపి 7.15 టీఎంసీలు



ఈ సంబరానికి కేంద్ర బిందువు నీరే
ఈ మహోత్సవం జరిగేది నేడే

నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ
తెలంగాణ ప్రభుత్వం.

జారీ చేయువారు: స్పెషల్ కమీషనర్, సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం.

అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 16-9-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 207 Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar 12 పేజీలు వెల : 6.50

మణిపూర్ హింసాకాండలో 175 మంది మృతి : పోలీసుల నివేదిక

మార్చురీలో 96 మృతదేహాలు



ఇంఫాల్ : మణిపూర్ హింసాకాండలో ఇప్పటివరకూ 175 మంది మరణించగా, 1,108 మంది గాయపడినట్టు పోలీసులు తెలిపారు. సుమారు 33 మంది అదృశ్యమైనట్టు పేర్కొన్నారు. రాష్ట్రంలో హింసాత్మక ఘటనలపై కొన్ని కీలక గణాంకాలను పోలీసులు విడుదల చేశారు. 175 ...11లో

వైద్యరంగంలో దేశానికే ఆదర్శం

9 మెడికల్ కాలేజీలను ప్రారంభించిన సీఎం

ఏటా 10 వేల మంది వైద్యుల తయారీ : సీఎం కేసీఆర్



ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తూ వైద్యాన్ని పేదలకు అతి చేరువలోకి తెస్తూ, తెలంగాణ రాష్ట్రం ప్రతి యేటా పదివేల మంది వైద్యులను తయారుచేసే స్థాయికి చేరుకుని భారత దేశ వైద్య రంగ చరిత్రలోనే విప్లవాన్ని సృష్టిస్తున్నదనీ, దేశానికే ఆదర్శంగా రాష్ట్ర వైద్యరంగం పురోగమించడం తెలంగాణకు గర్వ కారణమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు తెలిపారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీఎం కేసీఆర్ చేతుల మీదుగా తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రగతి భవన్ నుంచి వర్చువల్ పద్ధతిలో శుక్రవారం ప్రారంభించారు. కరీంనగర్, కామారెడ్డి, ఖమ్మం, జయశంకర్ భూపాలపల్లి, కుమరంభీం ఆసిఫాబాద్, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగాం జిల్లాల్లో ఈ తొమ్మిది మెడికల్ కాలేజీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ గతంలో ఐదు కాలేజీలుంటే.. ఇప్పుడు 26 మెడికల్ కాలేజీలకు చేరుకున్నామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మొత్తం 34 ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ఉండేటట్టుగా రాష్ట్ర క్యాబినెట్ ఆమోదించిందని గుర్తు చేశారు.

2014లో 2,850 ఎంబీబీఎస్ సీట్లుండగా నేడు అది 8,515 సీట్లకు పెరిగాయని తెలిపారు. నీట్‌కు పోను 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకు దక్కాలని విడుదల చేసిన జీవోపై వివాదం చెలరేగినా మంత్రి, వైద్యశాఖ సిబ్బంది పటిష్టమైన న్యాయపోరాటం చేసి హైకోర్టులో కూడా విజయం సాధించటాన్ని అభినందించారు. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే, రోగ నిరోధక శక్తి కలిగి వుండాలంటే తెల్ల కణాలు రక్తంలో ఏ విధంగా పనిచేస్తయో , తెలంగాణ ఉత్పత్తి చేసే తెల్లకోటు డాక్టర్లు రాష్ట్రానికే కాకుండా దేశ ఆరోగ్య వ్యవస్థకు కూడా అదే పద్ధతిలో పని చేస్తారని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని ఆయన తెలిపారు. కరోనా లాంటి వైరస్‌లు భవిష్యత్తులో వస్తే ఎక్కడైతే వైద్యారోగ్య వ్యవస్థ పకడ్బందీగా, పటిష్టంగా ఉంటుందో అక్కడ తక్కువ ప్రాణ నష్టం ఉంటుందనీ, ఎక్కడైతే ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తాయో ...11లో

పార్లమెంటులో మహిళా, బీసీ బిల్లులు పెట్టాలి

- మోడీకి కేసీఆర్ లేఖ
- బీఆర్ఎస్ పార్లమెంటరీపార్టీ సమావేశంలో నిర్ణయం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

చట్ట సభల్లో 33 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు, 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుల్ని పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం డిమాండ్ చేసింది. దీనిపై ప్రధాని నరేంద్రమోడీకి సీఎం కే చంద్రశేఖరరావు లేఖ రాయాలని నిర్ణయించారు. శుక్రవారం ప్రగతిభవన్‌లో బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సంయుక్త సమావేశం ఆపార్టీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన జరిగింది. పై అంశాలపై సమావేశంలో ఏకగ్రీవ ...11లో



వీరతెలంగాణ సాయుధ పోరాటం అజరామరం

చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ


- సీట్లు, పొత్తుల కోసం కమ్యూనిస్టు పార్టీ పనిచేయదు
- బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి నడుస్తాం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం చారిత్రాత్మకం. అది ప్రజాపోరాటాలకు నిరంతర స్ఫూర్తి. ఈ దేశ భవిష్యత్తుకు మార్గదర్శి. అలాంటి పోరాటాన్ని బీజేపీ వక్రీకరిస్తున్నదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. జిల్లా కేంద్రమైన సిద్దిపేట పట్టణంలోని శివమ్స్ గార్డెన్‌లో శుక్రవారం నిర్వహించిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు తెలంగాణ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తెలంగాణలో రైతాంగ సాయుధ పోరాటంలో మొట్టమొదటి అమరుడు దొడ్డి కొమరయ్య అని తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని, పీడిత ప్రజల పోరాటాలను హిందు ముస్లిమ్‌ల మధ్య పోరాటంగా బీజేపీ నాయకులు చెప్పడం సిగ్గుచేటన్నారు. ముస్లిం మైనార్టీలను అణగదొక్కడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. మునుగోడు ఎన్నికల్లో బీజేపీని ఓడగొట్టడం కోసమే బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకున్నామని, కమ్యూనిస్టులతోనే అక్కడ బీజేపీ ఓడిపోయిందని తెలిపారు. తెలంగాణలో బీజేపీని అడ్డుకోవడమే సీపీఐ(ఎం) లక్ష్యమన్నారు. సీట్ల కోసం, పొత్తుల కోసం కమ్యూనిస్టు పార్టీ వెంపర్లాడదని, ప్రజల కోసమే పనిచేస్తుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే అన్న ప్రచారంతో బీఆర్ఎస్‌కు మైనార్టీ వర్గాలు దూరమయ్యే పరిస్థితి ఉంటుందని, ముస్లింల ఓట్లు పడకపోతే బీఆర్ఎస్ పార్టీ ఓడిపోతుందన్నారు. కవితకు మళ్ళీ ఈడీ నోటీసులు ...11లో

నేడు సీడబ్ల్యూసీ సమావేశం

18 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌లో...



సీడబ్ల్యూసీ ఏర్పాట్లను సమీక్షిస్తున్న కెసి వేణుగోపాల్, రేవంత్‌రెడ్డి తదితరులు

- ప్రధాని అభ్యర్థిగా రాహూల్‌గాంధీ
- ఇండియా కూటమికి ప్రతిపాదన?
- ఐదు రాష్ట్రాల ఎన్నికలు, జమిలి, పార్టీ బలోపేతంపై చర్చ
- విజయభేరి సభలో ఆరు హామీలు విడుదల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అత్యున్నత కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశానికి టీపీసీసీ సర్వం సిద్ధంచేసింది.18 ఏండ్ల తర్వాత హైదరాబాద్‌లో జరుగుతున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి భారీ ఏర్పాట్లుచేసింది. 2005లో రాష్ట్రంలో ఏఐసీసీ ప్లీనరీ, సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. అంతకు ముందు 1995లో తిరుపతిలో సీడబ్ల్యూసీ నిర్వహించారు. ఆ తర్వాత ఇన్నేండ్లకు హైదరాబాద్‌లో సమావేశం నిర్వహిస్తున్నది. శుక్ర, శనివారం రెండు రోజులపాటు హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్ సీడబ్ల్యూసీ సమావేశానికి వేదిక కానుంది. దేశం నలుమూలల నుంచి 90 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. విస్తృత సమావేశానికి పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, ఐదు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరవుతున్నారు. త్వరలో ఎన్నికలు జరిగే తెలంగాణ, రాజస్థాన్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో అనుసరించాల్సిన వ్యూహం, ఇండియా కూటమి బలోపేతం, పెరుగుతున్న మతోన్మాదం, జమిలి ఎన్నికలతోపాటు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌గాంధీ పేరుపై ప్రాథమికంగా చర్చించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. సీడబ్ల్యూసీ సమావేశంలో ఆ తీర్మానాన్ని చేసి ఇండియా కూటమి సమావేశంలో ప్రతిపాదించనున్నట్టు తెలిసింది. కాగా ఇప్పటికే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలనే ధృడ సంకల్పంతో ఉన్న కాంగ్రెస్ హై కమాండ్.. తెలంగాణపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. అందుకు అనుగుణంగా సీడబ్ల్యూసీలో కీలక నిర్ణయాలు చేసే అవకాశంఉంది. అగ్ర నాయకత్వం రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోనే ...11లో

అభిప్రాయాలు చెప్పడమే నేరమా?

జర్నలిస్టులపై కేసు ఎలా పెడతారు?

- ఎఫ్ఐఆర్‌ను ఎందుకు కొట్టివేయకూడదు?
- ఎడిటర్స్ గిల్డ్ కేసులో చీఫ్ జస్టిస్ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింసకు సంబంధించి పక్షపాతంగా మీడియా కవరేజి జరిగిందన్న అంశంపై ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా (ఇజిఐ) ఇచ్చిన నివేదిక తప్పు కావచ్చు లేదా నిజం కావచ్చు, కానీ తన అభిప్రాయాలను చెప్పడం భావ ప్రకటనా స్వేచ్ఛ కదా! అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. నలుగురు జర్నలిస్టులపై మణిపూర్ పోలీసులు దాఖలు చేసిన కేసులో వారిపై బలవంతపు చర్యలు తీసుకోకుండా సుప్రీం కోర్టు రెండు వారాల పాటు రక్షణ కల్పించింది. ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియాకు చెందిన జర్నలిస్టులు నేరానికి పాల్పడ్డారంటూ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని, కానీ అందులో తనకు నేరమనేది కనిపించడం లేదని చీఫ్ జస్టిస్ వ్యాఖ్యానించారు. అసలు ఆ జర్నలిస్టులు చేసిన నేరమేమిటని ఆయన ప్రశ్నించారు. తమ అభిప్రాయాలను చెప్పడాన్నే నేరంగా ఎలా పరిగణిస్తారు? అని ఫిర్యాదుదారులను ప్రశ్నించారు. తొలుత ఎఫ్ఐఆర్‌లను ఢిల్లీకి మార్చాలని సూచించిన కోర్టు, ఆ ...10లో

విద్యార్థులకు 'దసరా కానుక'

అక్టోబర్ 24 నుంచి 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం'

- సర్కారు బడుల్లో 1 నుంచి 10వ తరగతి పిల్లలకు అమలు
- మరో చారిత్రక నిర్ణయం : సీఎం కేసీఆర్
- ముఖ్యమంత్రికి సబిత కృతజ్ఞతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వ దసరా కానుక ప్రకటించింది. సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలిచిన సీఎం కేసీఆర్ సర్కారు మరో వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ, విద్యార్థుల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు విద్యార్థుల సంక్షేమం దిశగా మరో చారిత్రక నిర్ణయం తీసుకున్నది. దసరా కానుకగా వచ్చేనెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు "ముఖ్యమంత్రి అల్పాహార పథకం" అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా విద్యార్థులకు చక్కని బోధనతోపాటు మంచి పోషకాహారం అందించే దిశగా ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయనుంది. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతోపాటు వారికి చదువు పట్ల ఏకాగ్రతను పెంచే దిశగా చర్యలు చేపట్టింది. ఉదయాన్నే వ్యవసాయ పనులు, కూలీపనులు చేసుకోవడానికి వెళ్లే విద్యార్థుల తల్లిదండ్రులు పడే ఇబ్బందులను అర్థం చేసుకున్న సీఎం కేసీఆర్ మానవీయ ఆలోచనకు అద్దంపట్టే దిశగా ఈ అల్పాహారం పథకాన్ని ...10లో



శరవేగంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు

ఇంజినీరింగ్ అద్భుతంగా పేర్కొంటున్న నిపుణులు

- ఆసియాలోనే అతిపెద్ద పంపుహౌజ్
- కాళేశ్వరాన్ని మించిన బాహుబలి మోటర్లు
- వెట్‌రన్‌కు నేడు శ్రీకారం
- 80 శాతం ప్రాజెక్టు పూర్తి : ఉన్నతాధికారులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పాలమూరు-రంగారెడ్డి సాగునీటి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయి. మూడు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలను తీర్చనున్న ఈ ప్రాజెక్టు పనులు, దాదాపు 89 శాతం పూర్తయ్యాయని సాగునీటి శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇది ఓ ఇంజినీరింగ్ అద్భుతం అని కూడా పేర్కొంటున్నారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్స్ నుంచి రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు పాలమూరు-రంగారెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. తద్వారా ...10లో

మా సమస్యలు పరిష్కరించండి

- రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల ఆందోళనలు
- నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు




నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీని ప్రభుత్వంలో విలీన ప్రక్రియ పూర్తికాకముందే కార్మికుల వేతన ఒప్పందాలు, డిఏ బకాయిలు, బాండ్ డబ్బులపై స్పష్టత ఇవ్వాలని ఆర్టీసీ కార్మికులు డిమాండ్ చేశారు. టీఎస్ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, యూనిట్ల వద్ద కార్మికులు డిమాండ్లతో కూడిన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. ఈ ఆందోళనల్లో పాల్గొన్న కార్మికులకు జేఏసీ చైర్మెన్ కే రాజిరెడ్డి, కన్వీనర్ వీఎస్ రావు, కో కన్వీనర్ యాదయ్య ఉద్యమాభివందనాలు తెలిపారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనానికి గవర్నర్ ఆమోదం తెలపడాన్ని స్వాగతిస్తున్నామనీ, అయితే దానికంటేముందు పరిష్కారం కావల్సిన సమస్యలు అనేకం ఉన్నాయని ఈ సందర్భంగా వారు వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో ప్రస్తావించారు. 2017, 2021 వేతన ఒప్పందాలు వెంటనే ప్రకటించాలనీ, 2013 వేతన ఒప్పందం బకాయిలుకు ఇచ్చిన బాండ్స్ డబ్బులు ఇవ్వాలనీ, సీసీఎస్‌కు యాజమాన్యం చెల్లించాల్సిన రూ.1,078 కోట్లు చెల్లించాలనీ, 2023 జులై డిఏ వెంటనే ప్రకటించి, 170 నెలల బకాయిలు కూడా చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్టుల బకాయి సొమ్ములు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా విలీన ప్రక్రియ పూర్తయితే ఆర్టీసీ కార్మికులు ఆర్థికంగా చాలా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించక పోతే "చలో ఇందిరా పార్క్" ఆందోళన నిర్వహిస్తామనీ, కార్మికులు దాన్ని కూడా జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఆందోళనల్లో ఖమ్మం రీజియన్‌లో పాటి అప్పారావు (ఈయూ), సుధాకర్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), ప్రధాన కార్యాలయం వద్ద గంగాధర్, సోమన్న, వరంగల్‌లో రాంచందర్, ...11లో

సైద్ధాంతికవేత్త కామ్రేడ్ కన్నయ్య బెనర్జీ కన్నుమూత

సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సంతాపం • సీఐటీయూ, ఏఐకేఎస్‌ల నివాళి



న్యూఢిల్లీ : స్వాతంత్ర్య ఉద్యమ నేత, ప్రముఖ కార్మిక సంఘ నేత, సైద్ధాంతికవేత్త, సీపీఐ(ఎం) మాజీ కేంద్ర కమిటీ సభ్యులైన కామ్రేడ్ కన్నయ్య లాల్ బెనర్జీ శుక్రవారం తెల్లవారు జామున కోల్‌కతాలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన వయస్సు 97సంవత్సరాలు. గత కొద్ది కాలంగా వృద్ధాప్య సంబంధిత అనారోగ్యాలకు ఆయన చికిత్స తీసుకుంటున్నారు. విద్యార్థుల పరిశోధన నిమిత్తం ఆయన శరీరాన్ని మెడికల్ కాలేజీకి అందచేశారు.

తూర్పు పాకిస్తాన్‌లోని ఢాకాలో రాణి మండల్‌లోని బిక్రమ్‌పూర్‌లో 1926 అక్టోబరు 10న ఆయన జన్మించారు. అందరూ ఆయన్ని కన్నయ్య దా అని ఆప్యాయంగా పిలుచుకునేవారు. 1939లో ఢాకాలో సుభాష్ చంద్రబోస్ ప్రసంగించిన సమావేశానికి హాజరైన విషయాన్ని ఆయన గుర్తు చేసుకునేవారు. ప్రజా ఉద్యమాల్లో ఆయన చాలా చురుకుగా పాల్గొనేవారు. రాజకీయ కార్యకలాపాల్లో క్రియాశీలంగా పాల్గొంటున్నందుకు ఆయనను ఇంటి నుండి వెళ్ళగొట్టారు. అలాగే కూచ్‌బీహార్‌లోని కాలేజీ నుండి కూడా ఇలాగే బహిష్కరించారు. అయితే ప్రజల నుండి వచ్చిన ఒత్తిడితో తర్వాత ఆయన్ని మళ్లీ కళాశాలలోకి తీసుకున్నారు. దేశ విభజన తర్వాత భారత్‌కు ఆయన కుటుంబం వచ్చేసింది.

పొలిట్‌బ్యూరో సంతాపం

విద్యార్థిగా ఉన్నపుడే స్వాతంత్ర్య ఉద్యమంలో చేరిన కన్నయ్య ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరారు. రైల్వే ఉద్యోగిగా చేసిన ఆయన తన జీవితాంతం రైల్వేలో కార్మిక ఉద్యమం అభివృద్ధికి కృషి చేశారు. సిఐటియు ...10లో

గ్రామాధ్యక్షురాలిగా గెలిచి రెండేండ్లు

జరగని ప్రమాణస్వీకారం : దళితురాలికి బాసటగా సీపీఐ(ఎం), వీసీకే, టీఎన్‌యూఈఎఫ్

చెన్నై : తమిళనాడులో ఎన్నికల్లో గెలిచిన ఒక దళిత మహిళ వివక్షను ఎదుర్కొంటున్నది. ఎన్నికల్లో గెలిచి రెండేండ్లు గడుస్తున్నప్పటికీ.. ఇప్పటికీ ఆమె ప్రమాణస్వీకారానికి నోచుకోక అన్యాయానికి గురవుతున్నది. 2021 అక్టోబర్‌లో తిరుపత్తూరు జిల్లాలోని నాయకనేరి పంచాయతీ అధ్యక్షురాలిగాడదళిత మహిళ ఎన్నికైంది. ఇందుకు సంబంధించిన ఎన్నికల సర్టిఫికేట్‌ను సైతం ఆమె ఎన్నికల అధికారుల నుంచి అందుకున్నది. ఇది జరిగి దాదాపు రెండేళ్ల దాటినా జిల్లా యంత్రాంగం మాత్రం ఆమెతో ఇంకా ప్రమాణ స్వీకారం చేయించలేదు. ఇది ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని అణగదొక్కే చర్యలో భాగమనీ, పెత్తందారీ కులమైన వన్నియార్ సామాజిక వర్గం ప్రాబల్యం ఉన్న పంచాయతీలో ప్రమాణం చేయడానికి ఆమెకు అనుమతి లభించటం లేదని దళిత సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం ...10లో



దేశానికి కావాల్సింది... ప్రశ్నలే!

కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ రాజస్థాన్‌లోని బర్మర్‌లో నిర్వహించిన ర్యాలీలో చెలరేగిపోయాడు. 'సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడే వారి నాలుక కోసేయాలి. కండ్లు పీకేయాలని' అన్నాడు. సనాతనకు వ్యతిరేకంగా మాట్లాడే వారికి దేశాన్ని పాలించే అర్హత లేదని కూడా చెప్పుకొచ్చారు. ఎందుకింత విద్వేషపు అలజడులు రేకెత్తిస్తున్నారు? ఎందుకింత ప్రజల భావోద్వేగాలతో ఆడుకుంటున్నారు? ఎందుకిలా ఉన్మాద చర్యలను ప్రేరేపిస్తున్నారు? తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సనాతనపై చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పలేని బీజేపీ-ఆరెస్సెస్ పరివారం 'చంపేస్తాం..నరికేస్తాం' అంటూ ఊగిపోతోంది. హింసను ప్రోత్సహిస్తోంది. దేశాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. భిన్నాభిప్రాయాలు చెప్పగలిగేదే ప్రజాస్వామ్యం. దాన్ని అమలు చేయాల్సింది కేంద్రంలో ఉన్న అధికారపక్షం. కానీ మాట్లాడే స్వేచ్ఛే లేదంటే మరి రాజ్యాంగంలో పొందుపరిచిన భావ ప్రకటనా హక్కు ఉన్నట్టా...లేనట్టా? సనాతన ధర్మం చర్చ అలా ఉంచితే ఇక్కడ 'పరివారం' వ్యవహరిస్తున్న తీరు గమనించాల్సిన అంశం. ప్రశ్నించే ప్రతి ఒక్కరినీ ఇలా బెదిరింపులకు గురిచేయడం, హింసను ప్రేరేపించే విధంగా మాట్లాడటం వారు చెప్పే ఆధ్యాత్మికత కూడా అంగీకరించదు కదా..! ఇది రాక్షసత్వమే తప్ప మరోటి కాదు. అయితే ఉదయనిధి స్టాలిన్ తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నాడు. ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఎక్కడ సదస్సు, సభలు జరిగినా తనదైన శైలిలో బీజేపీపై ప్రశ్నలు సంధిస్తూనే ఉన్నాడు. ఇలాంటి వ్యక్తులే కావాలి నేడు దేశానికి. ఆయన ధైర్యంగా మాట్లాడటమే కాదు నిలబడ్డాడు. ఆయనకు విశాల ప్రజామోదం కూడా లభిస్తోంది. అయితే దీన్ని సహించలేని శక్తులు చేస్తున్న రాద్ధాంతమే విస్మయాన్ని కలిగిస్తోంది.

అయోధ్యకు చెందిన ఓ స్వామీజీ ఉదయనిధి తలపై రూ.10కోట్ల రివార్డు ప్రకటించిన విషయం తెలిసిందే. అతని తలనరికి తన చేతిలో పెట్టాలని, ఆ పని ఎవరూ చేయడానికి ముందుకు రాకపోతే..తానే చేస్తానంటూ బెదిరించాడు. వెంటనే స్పందించిన స్టాలిన్ 'మీ ప్రాంతంలో కులవివక్ష, అంటరానితనం లేకుండా చేస్తే నేనే రూ.20 కోట్లు ఇస్తానని' సవాల్ విసిరాడు. దీన్ని బట్టి దేశంలో కులం స్థానాన్ని అర్థం చేసుకోవచ్చు. అక్రమ మైనింగ్ కోసం ఒక జాతి నిర్మూలనకే పథకం వేసిన నాయకులు సనాతనను నిర్మూలించాలనగానే ఎక్కడలేని విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు. ఎక్కడపడితే అక్కడ విషాన్ని చిమ్ముతున్నారు. మూడునెలలుగా మతం మంటల్లో కాలిపోతున్న మణిపూర్‌పై ఒక్కరంటే ఒక్కరూ కూడా స్పందించలేదు. అంతెందుకు ప్రధానే నోరువిప్పలేదు. బాధితుల్ని ఓదార్చేందుకు రాష్ట్రాన్ని సందర్శించారా? శాంతి, భద్రతలను పర్యవేక్షించారా? కానీ ఉదయనిధి వ్యాఖ్యలపై ఏకంగా కేంద్ర మంత్రి వర్గ సమావేశంలో ఊటంకించి సనాతన గురించి ఎవరు మాట్లాడినా సహించ కూడదనే సందేశాన్ని ఇచ్చారు. అంటే వీరి అధికారమంతా సనాతన పెంచిపోషించమేనన్నమాట. ప్రజల బాగోగులకంటే కూడా కుల, మతాల్నే రక్షించాలన్న మాట. వీరి విభజనవాదానికి అవి రక్షణ కవచాలన్నమాట.

అయితే సనాతన పేరుతో చేస్తున్న రాద్ధాంతం, విధ్వంసాన్ని ఉదయనిధి ఖండిస్తూనే ఉన్నాడు. ఉదయనిధే కాదు, ప్రతి పౌరుడూ ఖండించాలి. మోడీ పాలనలో దేశం తిరోగమనంలోకి వెళ్తోంది. ధరాభారం జనాన్ని అవస్థలు పెడుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం ఆందోళనకు గురిచేస్తోంది. విభజన రాజకీయం కంటిమీద కునుకే లేకుండా చేస్తోంది. ప్రయివేటీకరణ, ఉత్పాదకత, ప్రభుత్వరంగ సంస్థల నిర్వీర్యం, అభద్రతా భావం ఇలా సమాజాన్ని పట్టిపీడించే సమస్యలు ఇప్పుడు కోకొల్లలు. వీటి నుంచి దృష్టిమరలించడానికి ఎత్తుకున్న రాగం 'భారత్', పాడుతున్న పాట 'జమిలి'. సనాతన అంటేనే ఆధిపత్యమని అర్థమైన తర్వాత దాన్నుంచి ఎలా బయటపడాలన్న అంశంపై నేడు చర్చ అవసరం. అందుకు ఉదయనిధి స్టాలిన్‌లు ఊరికొకరు కావాలి. ధైర్యంగా మాట్లాడాలి. అవసరమైన ప్రతిచోటా పోరాడాలి. పరివారం ప్రేరేపిస్తున్న హిందూత్వను అడ్డుకుని దేశాన్ని లౌకికతత్వంవైపు నడిపించాలి. 'ప్రశ్నిస్తే శత్రువుగా మిగిలిపోతావేమో... అయినా పర్వాలేదు కానీ బానిసగా మాత్రం జీవించకు' అన్న స్ఫూర్తే ఇప్పుడు దేశానికి రక్ష.

సంపాదకీయం

భారత స్వాతంత్ర్యోద్యమంతో ఆర్ఎస్ఎస్‌కు అణువంత సంబంధం కూడా లేదు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని భారత యువత, తమ విలువైన యవ్వన జీవితాన్ని వృథా చేసుకోవద్దని, ఆనాటి ఆర్ఎస్ఎస్ అధినేత గోల్వాల్కర్, బహిరంగంగానే ప్రకటించారు. వీరి సైద్ధాంతిక గురువు వినాయక్ దామోదర్ సావర్కర్, తనను జైలునుంచి విడుదల చేస్తే, బ్రిటిష్ పాలకులకే ఉపయోగమని వేడుకుని బయటపడ్డారు. స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగుతున్న కాలంలో కాంగ్రెసు నాయకులు ప్రాంతీయ ప్రభుత్వాలకు రాజీనామా చేసి నిరసన తెలిపారు. కానీ సావర్కర్ బ్రిటిష్ పాలకులకు సంఘీభావం తెలిపారు. ఇలాంటి ఆర్ఎస్ఎస్, వీరి రాజకీయ విభాగమైన బీజేపీలు ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడుతున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో రాజుల పాలనలో ఉన్న రాజ్యాలు ఇండియా లేదా పాకిస్తాన్‌లో విలీనం కావడానికీ, లేదా స్వతంత్ర దేశాలుగా కొనసాగడానికీ స్వేచ్ఛనిచ్చారు. బ్రిటిష్ పాలకులతో జరిగిన ఒప్పందం అది. రైతాంగ పోరాటం ఉధృతమైంది. నిజాం రాజు నిలువలేని పరిస్థితి ఏర్పడింది. ఏమాత్రం ఆలస్యం జరిగినా నిజాం రాచరికం కుప్పగూలి ఎర్రజెండా అధీనంలోకి వచ్చే పరిస్థితి ఏర్పడ్డది. అదే జరిగితే పరిణామాలు ఎట్లా ఉంటాయో నెహ్రూ-పటేల్‌కు తెలుసు. ఇలాంటి పరిస్థితులలోనే 1948 సెప్టెంబరు 13న యూనియన్ సైన్యాలు తెలంగాణలో అడుగుపెట్టాయి. నిజాం రాజు పెద్దగా ప్రతిఘటించలేదు. ఐదవరోజుకల్లా నిజాం రాజు, హైదరాబాద్ రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి అంగీకరించాడు. ఇదీ చరిత్ర.

ఈ కట్టుకథలు ఇంకెన్నాళ్లు?




ఎస్. వీరయ్య

విలీన దినోత్సవం రోజు రాష్ట్రానికి అమిత్ షా వస్తున్నారు. పైగా దీనిని విమోచన దినోత్సవం అంటున్నారు. నిజాం పాలనలో ఉన్న హైదరాబాద్ రాజ్యం స్వతంత్ర భారతదేశంలో విలీనమైన ఘట్టం గురించి వీరికి మాట్లాడే అర్హత ఉన్నదా? వాస్తవంగా ఏం జరిగింది?

1946లో ప్రారంభమైన తెలంగాణ సాయుధరైతాంగ పోరాటం జరుగుతున్న కాలంలోనే భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. తర్వాత సంవత్సరానికి హైదరాబాద్ రాజ్యం కూడా భారతదేశంలో విలీనం అయ్యింది. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో, పుచ్చలపల్లి సుందరయ్య నాయకత్వంలో సాగిన ఈ పోరాటం ద్వారా పేదలకు పది లక్షల ఎకరాల భూమి పంచారు. ఈ పోరాట ఫలితంగానే హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో విలీనం కాక తప్పని పరిస్థితి ఏర్పడింది. అంతిమంగా, ఈ పోరాట ఫలితంగా భూమి సమస్య దేశం ఎజెండా మీదకు వచ్చింది. భూసంస్కరణల ఆవశ్యకత గుర్తించక తప్పని పరిస్థితి ఏర్పడింది. కులమతాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సాగిన మహత్తర పోరాటమిది. వెట్టిచాకిరీని ప్రతిఘటించిన పోరాటం, మూడువేల గ్రామరాజ్యాలు ఏర్పాటు చేసి, మహిళలను నిర్ణయంలో భాగస్వాములను చేసింది. విడాకులతో సహా మహిళల హక్కులు గుర్తించారు. తెలుగు భాష అభివృద్ధి కోసం పోరాడారు. ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక రంగాలలో జరిగిన పోరాటమది. తెలంగాణ రైతాంగం పోరుబాటలో ఉండగా, ఆంధ్రప్రాంతంలోని సరిహద్దు జిల్లాల నుంచి ప్రజలు విరాళాలు పంపారు. కమ్యూనిస్టు కార్యకర్తలు స్వయంగా తెలంగాణకు తరలివచ్చి పోరాటంలో పాల్గొన్నారు. నాయకులకు, దళాలకు రక్షణ కల్పించారు. ఈ ప్రయత్నాలలో తీవ్ర నిర్బంధాలకు గురయ్యారు. భూమికోసం, భుక్తి కోసం, దోపిడీ నుంచి విముక్తి కోసం సాగిన ఈ మహోద్యమంలో ఆర్యసమాజ్ వెతికినా కనిపించదు. పైగా భూస్వాముల పంచన జేరింది. ఆర్ఎస్ఎస్ ఛాయలే కనిపించవు. ఎర్రజెండా నాయకత్వంలో సాగిన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఈ పోరాటం గురించి ఇప్పుడు ఆర్ఎస్ఎస్, దాని ముద్దుబిడ్డ బీజేపీ వక్రభాష్యం చెబుతున్నది.

బ్రిటిష్ ఇండియాలో స్వాతంత్ర్యోద్యమం జరుగుతున్న కాలంలోనే కాశ్మీరీ రైతాంగం కూడా రాజు హరిసింగ్ రాజ్యం మీద తిరుగుబాటు చేసారు. భూమికోసం, ప్రజాస్వామ్యం కోసం పోరాడారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో జమ్ముకాశ్మీర్ రాజు స్వతంత్ర రాజ్యంగానే ఉండాలనుకున్నాడు. కానీ పాకిస్థాన్ దాడి చేసింది. కాశ్మీర్ రైతాంగం ఒకవైపు రాజ్యంమీద పోరాడుతూనే, పాక్ సైన్యాలను కూడా ఎదిరించారు. కశ్మీరీలు ముస్లింలు. అయినా పాకిస్థాన్ లాంటి మతరాజ్యంలో చేరడానికి నిరాకరించారు. ప్రజాస్వామ్యం కోరుకున్నారు. ఇటు ప్రజల తిరుగుబాటు, అటు పాకిస్థాన్ దాడితో ఉక్కిరిబిక్కిరి అయిన రాజు హరిసింగ్, జమ్ము కాశ్మీర్‌ను ఇండియాలో విలీనం చేయడానికి నిర్ణయించుకున్నాడు. ఆమేరకు పాకిస్థాన్‌ను ఎదుర్కొనే బాధ్యత ఇండియా తీసుకున్నది. భారతదేశం సెక్యులర్ దేశంగా ఉంటుందన్న హామీతో ఇండియాలో కలవడానికి సిద్ధపడ్డారు. 1947 అక్టోబర్‌లో ఇండియన్ యూనియన్ ప్రభుత్వానికీ, జమ్ము కాశ్మీర్ రాజుకూ ఒప్పందం కుదిరింది. ఇలాంటి సమయంలో కూడా, ప్రజాపరిషత్, ఆర్ఎస్ఎస్, జమ్ముకాశ్మీర్ స్వతంత్ర రాజ్యంగానే ఉండాలని రాజుకు సూచించింది. అప్పుడు వీరికి అఖండ భారత్ గుర్తుకు రాలేదు. అసలు భారత స్వాతంత్ర్యోద్యమంతో ఆర్ఎస్ఎస్‌కు అణువంత సంబంధం కూడా లేదు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని భారత యువత, తమ విలువైన యవ్వన జీవితాన్ని వృథా చేసుకోవద్దని, ఆనాటి ఆర్ఎస్ఎస్ అధినేత గోల్వాల్కర్, బహిరంగంగానే ప్రకటించారు. వీరి సైద్ధాంతిక గురువు వినాయక్ దామోదర్ సావర్కర్, తనను జైలునుంచి విడుదల చేస్తే, బ్రిటిష్ పాలకులకే ఉపయోగమని వేడుకుని బయటపడ్డారు. స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగుతున్న కాలంలో కాంగ్రెసు నాయకులు ప్రాంతీయ ప్రభుత్వాలకు రాజీనామా చేసి నిరసన తెలిపారు. కానీ సావర్కర్ బ్రిటిష్ పాలకులకు సంఘీభావం తెలిపారు. ఇలాంటి ఆర్ఎస్ఎస్, వీరి రాజకీయ విభాగమైన బీజేపీలు ఇప్పుడు దేశభక్తి గురించి మాట్లాడుతున్నాయి. క్విట్ ఇండియా ఉద్యమ సమయంలో కూడా ఇక్కడ ఆర్ఎస్ఎస్‌తో తమకేమీ ప్రమాదం లేదనీ, స్వాతంత్ర్యం కోసం కమ్యూనిస్టులు ప్రజలను రెచ్చగొడుతున్నారని పోలీసు అధికారులు బ్రిటిష్ పాలకులకు రిపోర్టు పంపారు. బ్రిటిష్ వ్యతిరేక పోరాటంతోగానీ, భూస్వాములు, జమీందార్ల దోపిడీ వ్యతిరేక పోరాటంతో గానీ, రాచరికాల మీద సాగిన తిరుగుబాట్లతోగానీ ఏ సంబంధమూ లేని వీరు ఇప్పుడు భారతదేశం గురించీ, దేశభక్తి గురించీ, తెలంగాణ విలీనం గురించీ మాట్లాడుతున్నారు.



రైతాంగ సాయుధ పోరాటానికి మతం రంగు పులుముతున్నారు. ముస్లింలనుంచి హిందువులకు విమోచనగా ప్రచారం చేస్తున్నారు. ప్రజల మీద ప్రత్యక్షంగా దోపిడీ, దౌర్జన్యాలు సాగించిన జమీందార్లు, జాగీర్‌దార్లు హిందువులే. వీరికి అండగా నిలిచింది నిజాం ప్రభుత్వం. భూమి కోసం కేసు వేసిన బందగిని భూస్వామి హత్య చేయించాడు. భూస్వామికి అండగా నిలిచిన నిజాం పోలీసులు ముస్లింలు. హత్యకు గురైన రైతు, బందగి ముస్లిం. ఇక్కడ భూమిసమస్య తప్ప హిందూ ముస్లిం సమస్య లేదు. హైదరాబాద్ నగరంలో, నిజాం రాజ్యం మీద



పోరాటం తప్పదని కామ్రేడ్స్ అసోసియేషన్ ప్రారంభించినవారిలో ఆలం ఖుంద్మిరి, మఖ్దూం మొహియుద్దీన్, రాజ్‌బహదూర్ గౌర్ ముఖ్యులు. నిజాం నిరంకుశ పాలనను ఎండగడుతూ వార్తలు రాసిన ఉర్దూ పాత్రికేయుడు షోయబుల్లాఖాన్‌ను నరికి చంపిన దుర్మార్గులు రజాకార్లు. ఐలమ్మ పండించిన పంటను దోచుకుని రావాలని జమీందార్ రామచంద్రారెడ్డి, తన గూండాలను పంపాడు. ఐలమ్మకు అండగా భీమిరెడ్డి నర్సింహారెడ్డి నాయకత్వంలో ఒక బృందం రంగంలోకి దిగింది. గూండాలను తరిమి, ఐలమ్మకు పంట దక్కేటట్టు చేసింది. జమీందారు మీద సాధించిన ఈ విజయం వార్త అనేక గ్రామాలకు పాకింది. రైతాంగం ప్రదర్శనలు చేసారు. ఈ స్ఫూర్తితోనే దొడ్డి కొమురయ్య కూడా ప్రదర్శనలో పాల్గొన్నాడు. కానీ జమీందార్లకు మద్దతుగా నిజాం సైనికులు, రజాకార్లు దాడి చేసి దొడ్డి కొమురయ్యను పొట్టనబెట్టుకున్నారు. ఇక్కడ మతసమస్య ఎక్కుడున్నది? అసలు రజాకార్ సంస్థకు అధ్యక్షుడు ఖాసిం రజ్వీ కాగా, ఉపాధ్యక్షుడు విసునూరు దేశముఖ్ రామచంద్రారెడ్డి కదా! ఏ గ్రామం పోయినా, రజాకార్ మూకలకు అడ్డాలు ఈ దొరల గడీలే కదా! హైదరాబాద్ నగరంలో కార్మిక పోరాటాలు కూడా జరిగాయి. పోలీసు కాల్పులను ఎదిరిస్తూ నిజాం పోలీసులను తరిమికొట్టారు. మఖ్దూం మొహియుద్దీన్, రాజ్‌బహద్దూర్ గౌర్, కెఎల్ మహేంద్ర, అలీ అఖ్తర్, సత్యనారాయణరెడ్డి తదితర నాయకులే ఆనాటి పోరాటాల సారథులు. భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ నుంచి విముక్తి కోసం సాగిన ఈ మహత్తర రైతాంగ పోరాటానికి మతం రంగు పులమటం దుస్సాహసం.

ఇప్పుడు ఐలమ్మ పేరు చెప్పుకుంటున్న బీఆర్ఎస్ నేతలది కూడా, చెట్టుపేరు చెప్పి, కాయలు అమ్ముకునే ప్రయత్నమే. భూస్వామ్య వ్యతిరేక పోరాట వీరనారి ఐలమ్మ. ఆమె పేరు వాడుకుంటున్న బీఆర్ఎస్ పాలకులకు వ్యవసాయ కార్మికులు, కౌలురైతులంటే గిట్టదు. అసైన్డ్ భూములు నిర్దాక్షిణ్యంగా గుంజుకుంటున్నారు. రెవిన్యూ రికార్డుల నుంచి 'కాస్తు' కాలమ్ తొలగించి, దశాబ్దాలుగా దున్నుకుంటున్న పేదరైతులను భూములనుంచి దూరం చేసారు.

కాంగ్రెసు, సర్దార్ పటేల్ పాత్ర కూడా కొత్త తరాలకు తెలియాలి. 1947 అక్టోబరులో జమ్ముకాశ్మీర్ రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేస్తూ నెహ్రూ-పటేల్ ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నది. అప్పుడు సర్దార్ పటేల్ హోం మంత్రి. సరిగ్గా నెలరోజుల తర్వాత, ఇదే ఇండియన్ యూనియన్ ప్రభుత్వం, నవంబరు 1947లో, నిజాం రాజుతో యథాతథ ఒప్పందం చేసుకున్నది. అంటే, నిజాం రాజ్యాన్ని కూడా స్వతంత్రదేశంగా గుర్తించింది. ఒకరి సార్వభౌమాధికారాన్ని మరొకరు గౌరవించాలని సంతకాలు చేసింది. విలీనానికి అంగీకరించిన జమ్ము కాశ్మీర్ రాజ్యాన్ని కలుపుకున్నారు. స్వతంత్ర దేశంగానే ఉంటామని ప్రకటించిన నిజాంతో యథాతథ ఒప్పందం చేసుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో రాజుల పాలనలో ఉన్న రాజ్యాలు ఇండియా లేదా పాకిస్తాన్‌లో విలీనం కావడానికీ, లేదా స్వతంత్ర దేశాలుగా కొనసాగడానికీ స్వేచ్ఛనిచ్చారు. బ్రిటిష్ పాలకులతో జరిగిన ఒప్పందం అది. రైతాంగ పోరాటం ఉధృతమైంది. నిజాం రాజు నిలువలేని పరిస్థితి ఏర్పడింది. ఏమాత్రం ఆలస్యం జరిగినా నిజాం రాచరికం కుప్పగూలి ఎర్రజెండా అధీనంలోకి వచ్చే పరిస్థితి ఏర్పడ్డది. అదే జరిగితే పరిణామాలు ఎట్లా ఉంటాయో నెహ్రూ-పటేల్‌కు తెలుసు. ఇలాంటి పరిస్థితులలోనే 1948 సెప్టెంబరు 13న యూనియన్ సైన్యాలు తెలంగాణలో అడుగుపెట్టాయి. నిజాం రాజు పెద్దగా ప్రతిఘటించలేదు. ఐదవరోజుకల్లా నిజాం రాజు, హైదరాబాద్ రాజ్యాన్ని ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయడానికి అంగీకరించాడు. ఇదీ చరిత్ర. సర్దార్ పటేల్ సాహసంతో, నిజాం ప్రభుత్వాన్ని లొంగదీసుకున్నారని నమ్మబలుకుతున్నారు. అదే నిజమైతే నిరంకుశ నిజాం రాజును ఎందుకు జైలులో పెట్టలేదు? పైగా ఆ నరహంతకుడినే, తెలంగాణ ప్రజలనెత్తిన రాజప్రముఖ్ పేరుతో కూర్చోబెట్టారు. నరహంతకుడు, రజాకార్ నేత ఖాసీం రజ్వీని ఎందుకు ఉరితీయలేదు? సకల సౌకర్యాలతో పాకిస్థాన్‌కు ఎందుకు అప్పగించారు? అంతేనా? రాజు ఆస్తిని జప్తు చేయకపోగా, నిజాం కుటుంబానికి రాజభరణం పేరుతో పరిహారం ముట్టజెప్పారు. యూనియన్ సైన్యాలు రాచరికం నిరంకుశత్వాన్ని అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుతాయనీ, రైతాంగం హక్కులను గౌరవిస్తాయనీ నమ్మిన రైతులు మోసపోయారు. సైన్యం రైతాంగం మీద విరుచుకుపడ్డది. నిజాం పాలనలో, రైతాంగ తిరుగుబాటుతో భయపడి హైదరాబాద్ పారిపోయిన జమీందార్లు, యూనియన్ సైన్యాల అండతో ఖద్దరు బట్టలూ, తెల్లటోపీలతో, కాంగ్రెస్ అవతారంలో గ్రామాలలో అడుగుబెట్టారు. యూనియన్ సైన్యాల నిజరూపం రైతులకు అర్థమైంది.

ఈ మహత్తర పోరాట వారసులు కమ్యూనిస్టులు. ఇప్పటికీ ప్రజల కోసం పోరాడుతున్నది కమ్యూనిస్టులే కదా! ఇప్పుడు ప్రజల సమస్యలు పరిష్కరించటంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. అందుకే మతపరమైన విభజనతో, భావోద్వేగాలు రెచ్చగొట్టి, ప్రజల దృష్టి మరలించాలని ప్రయత్నిస్తున్నది. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులిమేది కూడా అందుకే. తెలంగాణ ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండాలి. ■

మతోన్మాద ముప్పు - వివేకానందుని హెచ్చరికలు



ఎస్.ఎన్. సాహూ

సెప్టెంబర్ 11, 2001న న్యూయార్క్‌లోని ట్విన్ టవర్లను ధ్వంసం చేసి, ఇతర ప్రాంతాల్లో దాడులు చేసిన కొంతమంది మతోన్మాదులు, అమెరికాపై చేసిన తీవ్రవాద దాడిని గుర్తుచేసుకుంటాం. భారతదేశ చరిత్రతో ముడిపడి ఉన్న సెప్టెంబర్ 11రోజు చాలా ఉన్నతమైంది, నిర్మాణాత్మకమైంది. ఇదే 1893 సెప్టెంబర్11న, స్వామీవివేకానంద చికాగోలోని ప్రపంచ మతాల పార్లమెంట్ (వరల్డ్ పార్లమెంట్ ఆఫ్ రెలిజియన్స్)లో ప్రసంగించాడు. ఇదే రోజు 1906లో మహాత్మాగాంధీ దక్షిణాఫ్రికాలో తన మొదటి సత్యాగ్రహాన్ని ప్రారంభించాడు.

అధిక సంఖ్యాక వాదం (మెజారిటేరియనిజం)లో వ్యక్తమైన మతోన్మాదం

సెప్టెంబర్ 11నాటి స్వామీ వివేకానందుని సంక్షిప్తమైన, లోతైన ప్రసంగం, అమెరికా ప్రజలను మంత్ర ముగ్ధులను చేయడం ద్వారా వారిని కదిలించింది. తరువాత ఆధ్యాత్మికత, వేదాంతంపై అనేక ఉపన్యాసాల ద్వారా ఆయన వారి మనసుల పైన చాలా ప్రభావం చూపించాడు. చారిత్రాత్మకమైన తన చికాగో ప్రసంగంలో, "పాక్షికత్వం (సెక్టేరియనిజం), మతదురభిమానం (బిగాట్రీ), దాని వారసత్వంగా వచ్చిన భయంకరమైన మతోన్మాదం, ఈ నేలను అమాయకుల రక్తంతో తడిపివేసాయని" ఆయన పేర్కొన్నాడు. అదే విధంగా, ప్రపంచ మతాల పార్లమెంట్ ప్రారంభానికి మోగిన గంట, మతోన్మాదానికి మృత్యుఘోష కావాలని ఆయన ఆశించాడు. వాస్తవానికి స్వామీ వివేకానందుని మాటలు చాలా కదిలించాయి. ఆయన ఆ మాటలు మాట్లాడిన 108 సంవత్సరాల తరువాత మతోన్మాదులు కొందరు అమెరికాపై దాడి చేశారు. దురదృష్టవశాత్తు, 2023లో ప్రపంచం, ముఖ్యంగా భారతదేశం ఇప్పుడు, అధికసంఖ్యాకవాదం రూపంలో ఉన్న పాక్షికత్వం, మత దురభిమానం, మతోన్మాదాల సమ్మేళనాన్ని, భారతదేశ ప్రభుత్వ యంత్రాంగాన్ని నియంత్రించే వారు ప్రేరేపించే విభజన ప్రక్రియను ఎదుర్కొంటోంది.

జాతి సంహారం, జాతి ప్రక్షాళన కోసం పిలుపు

ఇప్పుడు, మతం పేరుతో హింస, ద్వేషాన్ని నిర్దాక్షిణ్యంగా వ్యాప్తి చేస్తున్న క్రమాన్ని మనం ఎదుర్కొంటున్నాం. మైనార్టీల్ని, ముఖ్యంగా ముస్లింల్ని అంతమొందించాలని, ధర్మసన్సద్‌లు, మత పార్లమెంట్ల నుండి చాలా కాలంగా ప్రతిరోజూ పిలుపులు జారీ చేస్తున్నారు. వీటికి, ముస్లింల సమగ్ర సామాజిక, ఆర్థిక బహిష్కరణ కోసం కూడా అశుభకరమైన పిలుపులు తోడు అయ్యాయి. ఇటీవల కాలంలో ఇలాంటి పిలుపులు హర్యానా రాష్ట్రంలోని నూహ్‌లో ముస్లింలను హింసాత్మకంగా లక్ష్యంగా చేసుకొని, వారు పని చేస్తున్న ప్రాంతాల్ని వదిలివెళ్ళిపోవాలని ఆదేశిస్తూ, వారి ఇళ్ళను నేలమట్టం చేశారు. పంజాబ్, హర్యానా హైకోర్టు ఈ సమస్యను సుమోటోగా స్వీకరించి, ఇది "జాతి ప్రక్షాళన"లో చేస్తున్న కసరత్తా అని తన ఆర్డర్‌లో ప్రశ్నించింది. జాతి సంహారం, సామాజిక ఆర్థిక బహిష్కరణల కోసం ఇస్తున్న పిలుపుల్ని దృష్టిలో ఉంచుకొని, సుప్రీంకోర్టు రాష్ట్రాలకు జారీ చేసిన ఆజ్ఞల్ని కూడా పరిగణలోకి తీసుకోకుండా తిరస్కరించడం విస్మయం కలిగించే విషయం. ఇటీవలి కాలంలో ద్వేషపూరిత ప్రసంగాలకు అడ్డుకట్టవేయడంలో మహారాష్ట్ర ప్రభుత్వం చేతకానితనాన్ని ప్రదర్శించిందా ఏమిటని సుప్రీంకోర్టు ఆశ్చర్యపోయింది.


గతంలో ఎన్నడూలేని విధంగా, మణిపూర్ రాష్ట్రంలో జాతి ప్రాతిపదికన హింస, రక్తపాతం ఇంకా కొనసాగుతూనే ఉండడం విచారకరం. ఊహించని రీతిలో అక్కడి మహిళలు అనుభవించిన క్రూరత్వం, జాతి ప్రాతిపదికన వారిపై అనాగరికంగా జరిపిన లైంగిక హింస వీడియోలు, పాక్షికత్వం, మతదురభిమాన వ్యక్తీకరణలను బట్టబయలు చేశాయి. ఇలాంటివాటిపై స్వామీ వివేకానంద ధ్వజమెత్తారు, మతోన్మాదం భయంకరమైన వారసత్వం గురించి కూడా ఆయన హెచ్చరించారు. 11 సెప్టెంబర్ 1893న ఆయన మాట్లాడిన మాటలను నేడు భారతదేశంలో పరిగణలోకి తీసుకోకుండా తిరస్కరించబడుతున్న తీరు, ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో మతం ఆధారంగా వేధింపులకు గురవుతున్న వారికి ఆశ్రయం ఇవ్వడం చూసి ఆయన ఆవేదన చెందేవాడు.

ద్వేషంతో ప్రమాదంలో దేశం మనుగడ

ఇతరులకు వ్యతిరేకంగా ద్వేషభావాన్ని వ్యాప్తి చేయడం ద్వారా దేశం యొక్క జీవనాధారం ప్రమాదంలో పడుతుందని స్వామీజీ అంతకు పూర్వమే హెచ్చరించాడు. సమాజంలో ఏర్పడిన ద్వేష భావం, తోటి భారతీయులకు వ్యతిరేకంగా ధిక్కారాన్ని ప్రదర్శించి వారితో సంబంధాలు నిలిపివేయడంతో చరిత్రలో భారతదేశ క్షీణతను ఆయన గుర్తించాడు. 27 అక్టోబర్ 1894న అమెరికా నుండి తన శిష్యుడు అలసింగా పెరుమాళ్‌కు రాసిన లేఖలో, "ఏ మనిషి, ఏ దేశం, నా కొడుకు, ఎవ్వరూ ఇతరులను ద్వేషించి, బతుకలేరని" ఆయన సున్నితంగా పేర్కొన్నాడు." వారు, 'మ్లేచ్ఛులు' అనే పదం కనిపెట్టిన రోజు, ఇతరులతో సన్నిహిత సంబంధాలు నిలిచిపోయినప్పుడే భారతదేశ వినాశనం ఖాయం అయిందని" ఆయన అన్నాడు. "కంప్లీట్ వర్క్స్ ఆఫ్ స్వామీ వివేకానంద"లోని ఐదవ అధ్యాయంలో అందు బాటులో ఉంది. విశ్వాసం పేరుతో భారతీయులను విభజిస్తూ, అంతర్ విశ్వాసాలను, సామరస్యాన్ని విషపూరితం చేస్తున్న ద్వేషభావం, 2023 భారతదేశం ఉన్న ప్రస్తుత సందర్భంలో ఆయన రచనలోని విషయాలకు ప్రాధాన్యత ఉంది.

మతోన్మాదం వల్ల కలిగే ముప్పుపై ధ్వజమెత్తిన సుప్రీంకోర్టు

1893 సెప్టెంబర్ 11న "పాక్షికత్వం, మత దురభిమానం, భయంకర మతోన్మాద వారసత్వాలు, ఈ నేలను అమాయకుల రక్తంతో తడిపివేసాయని" స్వామీ వివేకానంద హెచ్చరిస్తూ మాట్లాడిన మాటలు మన స్వంత ప్రమాదంలో విస్మరించబడవచ్చు. అయిశత్ శిఫా వర్సెస్ కర్నాటక రాష్ట్రం మధ్య ఉన్న కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో (13 అక్టోబర్ 2022) మతోన్మాదం వల్ల కలిగే ప్రమాదం పైన ధ్వజమెత్తింది. ఏ పాఠశాలల్లో, ఏ కళాశాలలో ఎక్కడైనా ముస్లిం బాలికలు హిజాబ్ ధరించడాన్ని అనుమతించే సందర్భంలో కోర్ట్ ఎస్.బీ.చవాన్ కమిటీ నివేదిక 1999పై ఆధార పడింది. ఈ నివేదిక సామాజిక ఐక్యత, సామాజిక, మతసామరస్య సాధనంగా మతాల గురించిన విద్యను చాలా గట్టిగా సిఫార్సు చేసింది. కోర్టు ఆ పేరాను ఈ విధంగా ఉదహరించింది:



"మతోన్మాదం, ద్వేషభావం, హింస, అవినీతి, నిజాయితీలేనితనం, దోపిడీ, మాదకద్రవ్యాల వినియోగం లాంటి వాటికి వ్యతిరేకంగా చేసే పోరాటంలో దేశానికి విలువ ఆధారిత విద్య, సహాయకంగా ఉంటుంది. సూర్యుని వలె, విజ్ఞానం కూడా అందరికీ అందుబాటులో ఉండాలి. సంకుచిత మనస్తత్వం, అంధవిశ్వాసాలకు, పిడివాద సిద్ధాంతాలకు స్థానం ఉండకూడదు. ఈ లక్ష్యం కోసం ఒకవేళ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని మతాల ప్రాథమిక సిద్ధాంతాలను నేర్చుకుంటే, లౌకికవాదానికి మనుగడ ఉండదని చెప్పలేం."

భారతదేశ సమ్మిళిత దార్శనికత

వంద సంవత్సరాల క్రితం, స్వామీ వివేకానంద ఏ ఒక్క మతం పైనా ఆధారపడకుండా ఒక సమ్మిళిత పద్ధతిలో భారతదేశాన్ని నిర్వచించాడు. భారతదేశానికి ఒక వేదాంతి మెదడు, ఇస్లామిక్ శరీరం అవసరమని అన్నాడు. ఇలాంటి విధానం, ఏకరూపతను ప్రోత్సాహించి, బహుళ సాంస్కృతికవాదానికి అపాయం కలిగించే, సాంస్కృతిక జాతీయవాదానికి భిన్నంగా భారతదేశాన్ని అర్థం చేసుకోవడానికి బహుళ విశ్వాస మార్గాన్ని అనుసరించాలని నొక్కి చెపుతుంది. కానీ ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే విశ్వాసంపై ప్రమాణం చేస్తున్నవారు, తమ పవిత్ర పురుషునిగా చెప్పుకుంటున్న స్వామీ వివేకానంద దార్శనికతను నిరాకరిస్తున్నారు.

వంద సంవత్సరాల క్రితం, స్వామీ వివేకానంద ఏ ఒక్క మతం పైనా ఆధారపడకుండా ఒక సమ్మిళిత పద్ధతిలో భారతదేశాన్ని నిర్వచించాడు. భారతదేశానికి ఒక వేదాంతి మెదడు, ఇస్లామిక్ శరీరం అవసరమని అన్నాడు. ఇలాంటి విధానం, ఏకరూపతను ప్రోత్సాహించి, బహుళ సాంస్కృతికవాదానికి అపాయం కలిగించే, సాంస్కృతిక జాతీయవాదానికి భిన్నంగా భారతదేశాన్ని అర్థం చేసుకోవడానికి బహుళ విశ్వాస మార్గాన్ని అనుసరించాలని నొక్కి చెపుతుంది. కానీ ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే విశ్వాసంపై ప్రమాణం చేస్తున్నవారు, తమ పవిత్ర పురుషునిగా చెప్పుకుంటున్న స్వామీ వివేకానంద దార్శనికతను నిరాకరిస్తున్నారు.

వేదాంతంపై నెహ్రూ, అంబేద్కర్

స్వామీ వివేకానంద వేదాంత మార్గాన్ని ఆసక్తికరంగా మన మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తన సుప్రసిద్ధ రచన "బేసిక్ అప్రోచ్"లో ఉదహరించాడు. మానసిక బలహీనతకు కారణమైన ఆధునిక నాగరికత యొక్క అనేక సవాళ్ళకు, వేదాంత ధోరణి పరిష్కారాలను చూపుతుందని నెహ్రూ తన రచనలో పేర్కొన్నాడు. డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ హిందూ మతాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, సామాజిక అసమానతలపై ఆధారపడి ఏర్పడిన మతం, హిందూ మతం అని, "కుల నిర్మూలన" అనే రచనలో పేర్కొన్నాడు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంపై ఆధారపడి ఏర్పడిన మతం భారత దేశానికి అవసరమని, అలాంటి ఒక మతం, జీవనాధారాన్ని ఉపనిషత్తుల నుండి పొందుతుందని ఆయన అన్నాడు. వాస్తవానికి ఉపనిషత్తులు వేదాంతాన్ని ఏర్పాటు చేస్తాయి. ఆధునిక భారతదేశ నిర్మాతలైన ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ, బీ.ఆర్.అంబేద్కర్ ఇరువురూ, స్వామీ వివేకానంద, భారతదేశ దార్శనికతను ఆవిష్కృతం చేసే ఇస్లాం విలువలతో పాటు సూచించిన వేదాంత మార్గాన్ని గురించి నొక్కి చెప్పారు. భారతదేశ భావనను బెదిరించే మతోన్మాదాన్ని ఓడించాలంటే, 1893 సెప్టెంబర్ 11 నాడు స్వామీ వివేకానంద మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉండడం అత్యావశ్యకం.

("ద వైర్" సౌజన్యంతో)

అనువాదం: బోడపట్ల రవీందర్,9848412451

మెయిల్ @ నవతెలంగాణ

వీధికెక్కిన ఉద్యోగ భ్రాంతి నాటకం!

బొంకరా బొంకరా పోలిగా అంటే టంగుటూరి మిరియాలు తాటికాయంత అన్నాడంట వెనకటికి ఎవడో! ఈ మధ్య కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో నిరుద్యోగ దీక్ష చేపట్టారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న బీజేపీ ప్రభుత్వం దేశంలో కనీసం పదివేల ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న ఉద్యోగాలకే ఎసరు పెట్టే చర్యలకు పూనుకుంటోంది. మేకిన్ ఇండియా, స్టార్ట్ అఫ్ ఇండియా, స్టాండ్ అఫ్ ఇండియా అని పేర్లు చెప్పడమే తప్ప యువతకు కేంద్రం చేసింది శూన్యం. కేంద్ర ఉద్యోగ, ఉపాధి కల్పన సంస్థలు, శిక్షణ సంస్థలు నిధులు లేక, సరైన జీతాలు లేక వెలవెల పోతున్నాయన్న అన్న సంగతి కిషన్‌రెడ్డికి తెలియదా? మరి నిరుద్యోగ దీక్ష ఎందుకు చేపట్టినట్టు? బీజేపీ పాలనలో యువతకు కేవలం స్విగ్గిస్, జొమాటో, గో డాడీ కొరియర్ అండ్ కార్గో, అవుట్ సోర్సింగ్, సెక్యూరిటీ, టెలికాలర్స్, ఆఫీస్ బాయ్స్, డ్రైవర్, పెట్రోల్ పంపులో ఆపరేటర్ ఉద్యోగాలు తప్ప గవర్నమెంట్‌లో కొలువులు ఎండమావిగానే మిగిలాయి. 2024 లోక్‌సభ ఎన్నికలకు కొద్ది నెలలు మాత్రమే ఉన్న తరుణంలో గరిష్ఠ నిరుద్యోగ రేటు, పెరుగుతున్న ద్రవ్యోల్బణం మోడీ నేతత్వంలోని కేంద్రానికి సవాల్‌గా మారాయి. ద్రవ్యోల్బణాన్ని తగ్గించడం, జాబ్ మార్కెట్‌లోకి వస్తున్న కోట్లాది మంది యువతకు ఉద్యోగాలను కల్పించడం బీజేపీ సర్కార్‌కు ప్రధాన ఛాలెంజ్‌లుగా ఉన్నాయి. మరోవైపు నిరుద్యోగాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ ఎక్కువగా ఎత్తి చూపుతుంది. దీన్ని మోడీ ప్రభుత్వ వైఫల్యంగా ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు విమర్శిస్తున్నాయి. కేంద్రం అనుసరిస్తున్న అస్తవ్యస్త విధానాలు, ప్రయివేటీకరణ లక్ష్యంగా ప్రభుత్వ ఆస్తుల అమ్మకం, కార్పొరేట్ల ప్రయోజనాలకే ప్రాధాన్యతనివ్వడం వెరసి భారత్‌లో నిరుద్యోగం ఏటికేడూ పెరిగిపోతున్నది. కార్పొరేటు ఎగవేతదారులకు లబ్ది చేకూరే విధంగా పన్నెండు లక్షల కోట్లు బ్యాంకు రుణాలు రైటాఫ్ చేసారంటే ప్రభుత్వాలు ఎవరి ప్రయోజనం కోసం పనిచేస్తున్నాయి? వీటన్నింటిని పక్కనపెట్టి కొత్తగా నిరుద్యోగ దీక్ష చేపడితే వచ్చేదేముంది? ఉద్యోగాలు ఇవ్వాల్సిన బాధ్యతను విస్మరించిన పార్టీయే నిరుద్యోగ దీక్ష పేరుతో ముందుకు రావడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

-ముచ్చుకోట సురేష్‌బాబు

వరద ముప్పనకు శాశ్వత చర్యలు చేపట్టాలి...

హైదరాబాద్ నగరం చిన్నపాటి వర్షానికే జలమయమవుతోంది. రోడ్లపై వరద ప్రవహిస్తుండటంతో ట్రాఫిక్ జామ్ అవుతోంది. గంటల తరబడి వాహనదారులు సతమతమవుతున్నారు. కొన్ని చోట్ల వరద నీటిలో కార్లు, ద్విచక్ర వాహనాలు కొట్టుకుపోతున్నవి చూస్తూనే ఉన్నాం. అన్నిటికంటే ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్నది. నాలాల్లో పడి చిన్నారులు చనిపోవడం అత్యంత బాధాకారం. జనాభా పెరుగు తున్న కొద్దీ సౌకర్యాలు కూడా మెరుగు పర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. వర్షం వచ్చిన ప్రతిసారి అడపాదడపా చర్యలు తీసుకుంటున్నారే తప్ప శాశ్వత పరిష్కారం దిశగా పాలకులు ఆలోచించడం లేదు. చిన్నపాటి వర్షాలకే నగరం అతలాకుతలమై ప్రజలు బయటకు వెళ్లాలని పరిస్థితి ఉంటోంది.విద్యుత్ స్తంభాలు విరగడం, చెట్లు కూలడం వంటి ఘటనలతో కాలనీల ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. ఇండ్లలోకి కూడా వర్షపు నీరు వచ్చి చేరుతోంది. ఇలాంటి వరద పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని నాటి నీటిపారుదల రంగ నిపుణులు 1997, 2000 సంవత్సరాలలో చెరువుల పరిస్థితిని అధ్యయనం చేశారు. 30 చెరువులను అభివృద్ధి చేయడంపై ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. అందుకను గుణంగా సఫిల్‌గూడ, సరూర్ నగర్, లంగర్ హౌజ్ చెరువులను అభివృద్ధి చేయడంతో వరద వల్ల వాటికి ఎలాంటి ముప్పు ఏర్పడటం లేదు. హైదరాబాద్‌లో దాదాపు 400 చెరువులు పై నుంచి కింది వరకు అనుసంధానించబడి ఉన్నాయి. నీరు ఒక చెరువు నుండి మరొక చెరువుకు ప్రవహించాలి. నీటి ప్రవాహ మార్గంలో అభివృద్ధి చేయబడిన నిర్మాణాలు ఒక చెరువు నుంచి మరొక చెరువుకు చేరకుండా అంతరాయంగా ఉంటున్నవి. ముందు చెరువులను అభివృద్ధి పరచాలి. అలాగే ఆకస్మిక వరదల్ని అరికట్టడానికి ఫీడర్ ఛానెల్‌లు, కాలువల్ని అభివృద్ధి చేయడం పరిష్కార మార్గం. ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

- దండంరాజు రాంచందర్ రావు, 9849592958

పాఠశాలల క్రీడా పోటీలు ప్రారంభం

నవ తెలంగాణ - ఎర్రుపాలెం

మండల పరిధిలోని మామునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు శుక్రవారం అండర్ 17 బాల బాలికల మండల స్థాయి పాఠశాలలో క్రీడాపోటీలను ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పీటీసి శీలం కవిత, మండల విద్యాశాఖ అధికారి ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు జగదీష్ ప్రారంభించారు. తొలుత జాతీయ జెండాను ఎంపీపీ దేవరకొండ శిరీష, క్రీడల జెండాను జడ్పీటిసి శీలం కవిత ఆవిష్కరించారు. అనంతరం వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులచే గౌరవ వందనం ఏర్పాటు చేశారు. ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ క్రీడా పోటీలకు 600 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఆర్గనైజ్ సెక్రె టరీ వ్యాయామ ఉపాధ్యాయుడు జమ్మలయ్య తెలిపారు. కార్య క్రమంలో రాజులదేవరపాడు గ్రామ పంచాయతీ సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మర్రి భూమయ్య, పుల్లమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు బొగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, చిన్ని, గూడూరు సత్యనారాయణరెడ్డి, నరాల సాంబశివారెడ్డి, మారుబత్తుల నాగేశ్వరరావు, భీమా వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థు లు తదితరులు పాల్గొన్నారు.



సొసైటీ ద్వారా రైతులకు నూతన రుణాలు

నవతెలంగాణ - ఎర్రుపాలెం

మండల పరిధిలోని అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు నూతన సభ్యులు 23 మంది రైతులకు 23,00,000 లక్షల రూపాయల నూతన రుణాలను సొసైటీ చైర్మన్ అనుమోలు సాంబశివరావు, డిసిసిబి బ్యాంక్ మేనేజర్ మగినం వీరభద్రరావు శుక్రవారం అందించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం డిసిసిబి బ్యాంకు నందు రుణ మాఫీ పొందిన 32 మంది సొసైటీ సభ్యులైన రైతులకు 17,42,500 రూపాయలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి, భాను ప్రియ, సెక్రటరీ మారాబత్తుల మోహనరావు, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ రేగులచెలక

నవతెలంగాణ- ఖమ్మం

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ -2023 క్రింద గ్రామ పారిశుద్యం, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఓడిఎఫ్ సుస్థిరత, ఓడిఎఫ్ ప్లస్ అమలులో రేగులచెలక గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డును గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాల చేతుల మీదగా అందుకున్నారు. శుక్రవారం ఖమ్మంలోని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌ని క్యాంపు కార్యాలయంలో డిఆర్డీఓ విద్యాచందన, డిపిఓ అప్పారావు, రేగులచెలక గ్రామ పంచాయతీ సర్పంచ్ కొర్లపాటి రామారావు, ఉప సర్పంచ్ నున్నా వెంకటేశ్వర్లు, ఏఎంసి చైర్మెన్ నున్నా శ్రీనివాస్‌రావు, పంచాయతీ కార్యదర్శి సంగీత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి అవార్డు గ్రహీతలను, అధికారులను శాలువలతో సత్కరించి, అభినందించారు.

ప్రభుత్వ పథకాలను పంచుకుంటున్నారు

నవతెలంగాణ – బోనకల్

దళిత బంధు, గృహలక్ష్మి పథకాలను అధికార పార్టీ, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు పంచుకుంటున్నాయని వైఎస్ఆర్ టిపి మండల అధ్యక్షుడు ఇరుగు జానేసు విమర్శించారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లోకి వచ్చి ఓట్లు ఎలా అడుగుతారని కేవలం వాళ్ల పార్టీలకు సంబంధించిన వారితోటే ఓటు వేయించుకోవాలన్నారు. గృహలక్ష్మి పథకం లబ్దిదారులను గ్రామసభల ద్వారా ఎంపిక చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తమ పార్టీలోకి వస్తేనే దళిత బంధువు ఇస్తామని చెప్పి అధికార పార్టీ నాయకులు మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

17న సంగీత విభావరి

నవ తెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలో ఈనెల 17న ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో గానమాధురి సినీ మధురగీతాలను జూబ్లీక్లబ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహిస్తున్నామని కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కె అంజద్ భాషా తెలిపారు. కార్యక్రమానికి గాయకులు ఎస్వీ రమణ, జనార్దన్, ఎండీ జాఫర్, ప్రకాశ్, శివలీల, నాగస్వర్ణశ్రీ, కృష్ణశబరి, సింధుభైరవి మన ముందుకు వచ్చి ఆలపిస్తారని తెలిపారు .



ఇస్రో శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావుకు సన్మానం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని నిర్మల్ హృదయ్‌లో ఇస్రో శాస్త్రవేత్త వల్లూరు ఉమా మహేశ్వరరావును పాఠశాల కరస్పాండెంట్ వంగ సాంబశివరెడ్డి ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్త తమ పాఠశాల విద్యార్థి కావటం తమకు గర్వకారణమని, ఉమా మహేశ్వరరావు మరిన్ని విజయాలు సాధించి ఉన్నతమైన పదవికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని ఏ.పద్మజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయని శ్రావణి, పాఠశాల డైరెక్టర్ బి.సుధాకర్ రెడ్డి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

17న బాల్ బ్యాట్మెంటన్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 17వ తేదీన జిల్లాస్థాయి బాల బాలికల జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు బాల్ బ్యాట్మెంటన్ జిల్లా అధ్యక్షులు వేజెల్ల సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి అమరేసి లింగయ్య శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా జట్ల ఎంపిక ప్రారంభమవుతుందని వారు తెలిపారు. 2 జనవరి 2008 తర్వాత పుట్టిన వారు మాత్రమే ఈ పోటీలకు అర్హులని వారు తెలిపారు. జిల్లా జట్టులో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 2 తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోనే నిజామాబాద్ జిల్లాలో 42వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ పోటీలలో పాల్గొనవలసి ఉంటుందని వారు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వచ్చేటప్పుడు తమ పుట్టిన తేదీ సర్టిఫికెట్ తీసుకొని రావాలని వారు కోరారు.

ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై అవగాహన సదస్సు

నవతెలంగాణ - బోనకల్

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఆయుష్మాన్ భవ కార్యక్రమంపై ఆశా కార్యకర్తలకు మండల కేంద్రంలోని రైతు వేదిక నందు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సును బోనకల్, చింతకాని మండలాలకు చెందిన ఆశా వర్కర్లకు నిర్వహించారు. జిల్లా కేంద్రం నుంచి విమల డిపిహెచ్ఎన్ఓ మరియ రాణి, రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు క్షేత్రస్థాయిలో పూర్తిగా వివరించవలసిన బాధ్యత ప్రధానంగా ఆశా కార్యకర్తల పైనే ఉందన్నారు. మండల విద్యాధికారి వేముల స్రవంతి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు గ్రామీణ స్థాయిలో ప్రజలందరితో మంచి సంబంధాలు కలిగి ఉంటారన్నారు. ఆ విధంగా ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అవసరమైన వైద్య సలహాలు ఇస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటూ ఉండాలని కోరారు. సదస్సులో సిహెచ్ఓ పెద్దినేని శ్రీనివాస్ రావు, సూపర్వైజర్ మంద దానయ్య, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు సరికాదు : ఎమ్మెల్యే కందాళ

నవతెలంగాణ-కూసుమంచి

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు చర్యలు తగదన్నారు.

సైంటిస్ట్ ఉమా మహేశ్వరరావును సన్మానించిన మంత్రి

నవతెలంగాణ- ఖమ్మం

భారతదేశం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగంలో ఖమ్మానికి చెందిన ఇస్రో శాస్త్రవేత్త వల్లూరు ఉమామహేశ్వరరావు ఆపరేషన్ మేనేజర్‌గా పాల్గొనడం పట్ల రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఇలా దేశం గర్వించదగ్గ ప్రయోగంలో ఖమ్మం యువకుడు ఇస్రో చేపట్టిన చంద్రయాన్-3 ప్రయోగంలో భాగం కావడం తెలంగాణ రాష్ట్రానికే కాకుండా..యావత్ తెలుగు ప్రజలకే గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా వారికి శాలువా కప్పి సన్మానించారు. దేశం గర్వించే ప్రయోగంలో భాగస్వామ్యం కావడం పట్ల వారిని అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తపల్లి నీరజ తదితరులు పాల్గొన్నారు.



కదం తొక్కిన అంగన్‌వాడీలు

ఖమ్మంలో భారీ ప్రదర్శన సభ

నవతెలంగాణ-ఖమ్మం



అంగన్వాడీ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని గత ఐదు రోజులుగా చేస్తున్న సమ్మె పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి విడనాడి సమ్మెలో ఉన్న కార్మిక సంఘాల చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కారం చేయాలని లేకపోతే రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పి తీరుతారని కార్మిక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఖమ్మం నగరంలో పెవిలియన్ గ్రౌండ్‌లో సభ నిర్వహించి, అనంతరం భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కల్యాణం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు సింగు నరసింహారావు మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగులు తెలంగాణా రాష్ట్రంలో పేద ప్రజలకు సేవలందిస్తున్నారని, అయినా ఇతర రాష్ట్రాల కంటే తక్కువ సౌకర్యాలను తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీలకు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. పాలకులు పదేపదే తెలంగాణలోనే మెరుగైన జీతాలు ఇస్తున్నారని, గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప ఇతర రాష్ట్రాలతో పోల్చుకుంటే చాలా తక్కువ జీతాలు చెల్లిస్తున్నారని, ఇతర సౌకర్యాలు కూడా ఇతర రాష్ట్రాల కంటే తక్కువగా ఇస్తున్నారని పేర్కొన్నారు. వీరికి కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు చాలా రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేటికీ కల్పించలేదని, దీనివల్ల అంగన్వాడీ ఉద్యోగులు చాలా నష్టపోతున్నారని తెలిపారు. పక్కనే ఉన్న తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాల్లో అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారని వారు పేర్కొన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చారని, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం తదితర రాష్ట్రాల్లో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, పండగ బోనస్ తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారని తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లిస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి సౌకర్యాలు అంగన్వాడీ ఉద్యోగులకు కల్పించడం లేదని వారు పేర్కొన్నారు. చట్టబద్ధంగా సమ్మె చేస్తున్న అంగన్వాడి ఉద్యోగులపై సెంటర్లకి తాళాలు వేస్తామని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేయడం జిల్లా అధికారులకు తగదని ఇలాంటి చర్యలు మానుకోకపోతే రాజకీయ పార్టీలతో గ్రామాల్లో సెంటర్ల రక్షణ దళాలని ఏర్పాటు చేస్తామని వారు హెచ్చరించారు. సమ్మెలో ఉన్న సంఘాలతో వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కారం చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణువర్ధన్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష గాదె లక్ష్మీనారాయణ, అంగన్వాడీ యూనియన్ జేఏసీ నాయకులు సీతామహాలక్ష్మి, బి.కోటేశ్వరి, కే.సుధారాధ, నాగమణి, పాపారాణి, విజయకుమారి, యు.పద్మ, జి.రామ, లక్ష్మీమణి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి

కలెక్టర్ వి.పి.గౌతమ్

నవతెలంగాణ-ఖమ్మం

పర్యావరణ పరిరక్షణలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ వి.పి.గౌతమ్ పిలుపునిచ్చారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ జిల్లా కలెక్టర్ చాంబర్‌లో మట్టి గణనాథులనే నెలకొల్పుకోవాలని సందేశాన్నిస్తూ కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన అవగాహన గోడ పత్రికను కాలుష్య నియంత్రణ మండలి జిల్లా పర్యావరణ అధికారి బి.రవీందర్‌తో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలందరూ మట్టి గణపతులనే ప్రతిష్ఠించి, పిఓపి విగ్రహాలను తగ్గించాలని సూచించారు. తద్వారా జల వనరులు, చెరువులు కాలుష్యం కాకుండా నివారించగలుగుతామన్నారు. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి వారు మట్టి గణపతి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి సంవత్సరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయబడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఈ నెల 18న వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంలో ప్రధాన కూడళ్ల వద్ద మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు, కృత్రిమ రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలతో పర్యావరణానికి ముప్పు కలుగుతుందన్నారు. విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, పిఓపి ఉపయోగించడం వల్ల వృక్ష, జంతు జీవనంపై ప్రభావం పడుతుందన్నారు.



ప్రశాంతంగా టెట్ పరీక్షలు

జిల్లాలో శుక్రవారం ఉపాధ్యాయ అర్హత (టెట్) పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లుగా జరిగిన పరీక్షలకు ఉదయం 54, మధ్యాహ్నం 45 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసి, పరీక్షలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఉదయం సెషన్ పరీక్షకి 12,923 మంది అభ్యర్థులకుగాను 10,465 (80.98 శాతం) హాజరుకాగా, 2,458 (19.02 శాతం) మంది అభ్యర్థులు గైర్హాజరని, అలాగే మధ్యాహ్నం సెషన్ పరీక్షకు 10,480 మంది అభ్యర్థులకు గాను 9,528 (90.92) హాజరుకాగా, 952 మంది అభ్యర్థులు గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. తొలుత కలెక్టర్ ఆర్జేసి డిగ్రీ కళాశాల, రిక్కా బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష జరుగుతున్న సరళిని పరిశీలించారు.

కల్లుగీత సహకార సంఘం అధ్యక్షులుగా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-ముదిగొండ

మండల పరిధిలో మేడేపల్లి కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా పోలగాని వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా గుణగంటి సుగుణతో పాటు, మరో ముగ్గురు డైరెక్టర్లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సామినేని హరిప్రసాద్, గ్రామ సర్పంచ్ సామినేని రమేష్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షకార్యదర్శి వాచేపల్లి లక్ష్మారెడ్డి, గడ్డం వెంకటిగౌడ్, నాయకులు ఎర్ర వెంకన్న, పోట్ల ప్రసాద్, మీగడ శ్రీనివాస్ యాదవ్, బంక మల్లయ్య, తోట ధర్మారావు, పచ్చా సీతారామయ్య, నేలకొండపల్లి ఏఎంసి డైరెక్టర్ బత్తుల వీరారెడ్డి, మేడేపల్లి సొసైటీ చైర్మన్ సామినేని వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ పోటు ప్రసాద్ పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి : ఎస్ఐ

నవతెలంగాణ-ముదిగొండ

ఈనెల17 నుండి ప్రారంభం కానున్న వినాయక చవితి ఉత్సవాలకు అనుమతి తప్పనిసరిని ఎస్సై గజ్జెల నరేష్ పేర్కొన్నారు.శుక్రవారం ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేశారు.గ్రామాలలో గణేష్ ఉత్సవాలు నిర్వహించేవారు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకొని పోలీస్ శాఖ నుండి అనుమతి పొందాలని చెప్పారు.అనుమతి లేకుండా గణేష్ ఉత్సవాలు నిర్వహించరాదని ఎస్సై తెలిపారు.గ్రామాల్లో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు గణేష్ ఉత్సవ కమిటీ నిబంధనాలను పాటించాలన్నారు.

ఆర్థిక సహాయం అందించిన కార్పొరేటర్

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ శ్రీనివాస్ నగర్ ప్రాంతానికి చెందిన బాలగంగాధర్ తిలక్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఉండటంతో ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకొని వైద్య ఖర్చుల నిమిత్తము 22వ డివిజన్ కార్పొరేటర్ పల్లా రోజ్ లీన సాల్మన్ రాజు, వారి కుమారుడు పల్లా జాన్ అబ్రహం కలిసి బాలగంగాధర్ తిలక్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో గోనె శ్రీశ్రీ, పల్లా మహేష్ కుమార్, సాల్మన్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రసున్నాంబకు బాణోత్ మదన్ లాల్ నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మునిసిపాలిటీ పరిధిలోని 5వ వార్డు వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ తల్లి అమరజీవి బోగాది రమా ప్రసున్నాంబ వర్ధంతి సందర్భంగా వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బాణోత్ మదన్ శుక్రవారం రమా ప్రసున్నాంబ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వీరితో పాటు వనమా చిన్ని, భూమత క్రిష్ణమూర్తి, మేదరమెట్ల రాము, రెబ్బవరం సర్పంచ్ సాదం రామారావు, కీలారి కిరణ్ కుమార్, దొంతేబోయన వెంకటేశ్వర్లు, అదురి ప్రేమ్ కుమార్, మడుపల్లి క్రిష్ణా, నల్లగొండ నాని, మూల దుర్గా, బత్తుల లింగారావు, యలదండి బాబు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌లో సత్తా చాటిన దాచాపురం

నవతెలంగాణ-వైరాటౌన్

అభివృద్ధి పథంలో ప్రతిభ చూపుతూ స్వచ్ఛ్ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 సంవత్సరానికి జిల్లా స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా నిలిచిన దాచాపురం గ్రామం మరో ప్రత్యేకత సొంతం చేసుకుంది. వైరా మండల దాచాపురం గ్రామ సర్పంచ్ వేల్పుల జయరాజు, ఉపసర్పంచ్ గూడూరు రామశేషి రెడ్డిల చొరవతో గ్రామంలో ప్రతి ఇంట్లో మరుగుదొడ్డి వినియోగం, తడి, పొడి చెత్త సంగ్రమ నిర్వహణ, కంపోస్ట్ షెడ్ల వినియోగం ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామంగా దాచాపురాన్ని ఎంపిక చేశారని గ్రామ కార్యదర్శి షేక్ అబ్దుల్ రహీం తెలిపారు. ఖమ్మం జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షన్ ద్వారా దాచాపురం గ్రామం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక అవ్వడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు నిరంతర మార్గదర్శనం, సహకారం వల్లనే ఇది సాధ్యమైందని గ్రామ ప్రజలు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

ఇంజనీర్స్ డే వేడుకలు

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని ఎస్బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని వేడుకలు విద్యార్థుల మధ్య ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలకు అవసరమయ్యే ఎన్నో నీటి పారుదల ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన గొప్ప ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి. ధాత్రి, ప్రిన్సిపల్ డాక్టర్ జి. రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ అమిత్ బింధాజ్, ఎకడమిక్ డైరెక్టర్స్ గంధం శ్రీనివాసరావు, డాక్టర్ ఎ.వి.వి. శివ ప్రసాద్, జి.ప్రవీణ్ కుమార్, డాక్టర్ జె.రవీంద్రబాబు, డాక్టర్ యస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఖమ్మంరూరల్ : మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా మండల పరిధిలో సాయి ప్రభాత్‌నగర్‌లోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీర్స్ డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతరత్న కొండా విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు రూపొందించిన ఆదిత్య ఎల్-1,చంద్రయాన్-3, పీఎస్ఎల్వీ రాకెట్ నమూనాను ప్రదర్శించారు. విద్యార్థులు రూపొందించిన 7 యాప్ లను ప్రదర్శించారు.'ప్రజ్ఞా మానస్' కళాశాల సంచికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడారు. ప్రస్తుత ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతున్న సాంకేతికత గురించి వివరించారు. విద్యార్థులు ఎప్పటికపుడు తమ నైపుణ్యాలకు పదును పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఏవో అట్లూరి వెంకటరమణ, ప్రిన్సిపాల్ గోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



కష్టపడి పని చేస్తే గుర్తింపు

విద్యుత్ ఉద్యోగుల సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గాదె మోహన్‌రెడ్డి

నవతెలంగాణ-ముదిగొండ

ఉద్యోగంలో కష్టపడి పని చేస్తే గుర్తింపు వస్తుందని తెలంగాణా రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు గాదె మోహన్ రెడ్డి అన్నారు. ముదిగొండలో ఐఎన్టియుసి ఖమ్మంరూరల్ సబ్ డివిజన్ (ఎన్నిక) సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్‌లో కష్టపడే వారికి గౌరవం ఇవ్వాలని, యూనియన్ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు. యూనియన్ బలోపేతానికి అందరిని కలుపోకొని, పోయేవారే నిజమైన నాయకులన్నారు. ప్రమోషన్‌తోపాటు, పెన్షన్ స్కీం అమలు చేస్తూ ప్రతి సెక్షన్ కు 4 పోస్టులు మంజూరు చేయాలన్నారు.ఆర్టిజెన్లకు ఏపీఎస్ఈబి సర్వీస్ రూల్స్ అమల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఖమ్మంరూరల్ సబ్ డివిజన్ విద్యుత్ ఉద్యోగుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షకార్యదర్శిగా ఎస్కె దావుద్, జి వెంకట రామారావుతోపాటు, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల జిల్లా అధ్యక్ష కార్యదర్శి మందాటి సత్యనారాయణరెడ్డి, ఊటుకూరి సీతారాంగోపాల్ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

వైద్య విద్యలో నవశకానికి నాంది

మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

నవతెలంగాణ-ఖమ్మం

తెలంగాణ రాష్ట్రంలో వైద్య రంగానికి పెద్దపీట వేసి వైద్య విద్యలో సిఎం కేసీఆర్ నవశకానికి నాంది పలికారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర రావు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖల మంత్రి తన్నీరు హరీశ్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్రంలో 9 నూతన వైద్య కళాశాలలను వర్చువల్ పద్దతిలో ప్రారంభించారు. నూతన వైద్య కళాశాలల్లో ఖమ్మం ప్రభుత్వ వైద్య కళాశాల ఉండగా, ఖమ్మం వైద్య కళాశాల లెక్చర్ హాల్ నుండి మంత్రి, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒకేరోజు 9 ప్రభుత్వ నూతన మెడికల్ కళాశాలలలో తరగతులు ప్రారంభించి ముఖ్యమంత్రి కెసిఆర్ తన మార్కును చూపించారన్నారు. రాష్ట్రంలోని ఖమ్మం, కరీంనగర్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, జనగామ, కుమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో మెడికల్ కళాశాలలలో తరగతులను సీఎం కేసీఆర్ ప్రారంభించారని ఆయన అన్నారు. మెడికల్ కళాశాలల ఏర్పాటుతో జిల్లాలో కలిగే ప్రయోజనాలను, మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఉండే హాస్పిటల్లో అందే వైద్య సేవలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. మెడికల్ కళాశాల భవనాలు నిర్మాణం కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.166 కోట్లు మంజూరు చేసిందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యలో చేరిన తొలి బ్యాచ్ విద్యార్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పి చైర్మన్ లింగాల కమలరాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్.రాజేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డాక్టర్. బి. మాలతి, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, కళాశాల ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, టీఎస్ఎంఐడిసి ఇఇ ఉమామహేశ్వరరావు, డిఈ శ్రీనివాస్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు గృహలక్ష్మి పథకం

పేద వాడి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకంను తీసుకువచ్చిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకం ఖమ్మం కార్పొరేషన్‌లోని 2, 3, 4, 8, 26వ డివిజన్లు, రఘునాథపాలెం మండలం బూడిదంపాడు, ఈర్లపుడి గ్రామాల లబ్ధిదారులకు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మంజూరు పత్రాలు అందజేసి, గృహలక్ష్మి పథకం మంజూరు పంపిణి కార్యక్రమాన్ని జిల్లాలో లాంఛనంగా ప్రారంభించారు. ఖమ్మం నియోజకవర్గంలో మొత్తం 4వేల ఇళ్లకు దరఖాస్తులు రాగా ఇప్పుడు రెండు వేల ఇళ్లకు మంజూరు పత్రాలు అందిస్తున్నామని, రెండవ విడతలో మళ్ళీ మిగిలిన రెండు వేల ఇళ్లను కూడా అందిస్తామని, ఎవరు అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి స్వంత ఇల్లు కట్టుకోవాలనే కల ఉంటుందని అన్నారు. గతంలో ఇండ్ల స్థలాలు అసైన్డ్ చేసినట్లు, 3 వేల మందికి జీవో 58 క్రింద పట్టాలు అందజేసినట్లు ఆయన అన్నారు. జిల్లాకు 15,500 గృహలక్ష్మి ఇండ్లు మంజూరు అయినట్లు, ప్రతి నియోజకవర్గానికి 3 వేల ఇండ్లు ఉన్నట్లు, దీని క్రింద ప్రతి లబ్దిదారునికి ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. మంజూరు పత్రాలు పొందిన వారు వెంటనే మంచిరోజు చూసుకొని పనులు ప్రారంభించాలని ఆయన అన్నారు. బేస్ మెంట్ వరకు లక్ష, రూఫ్ లెవల్ వరకు వస్తే మరో లక్ష, పూర్తయిన తర్వాత లక్ష రూపాయలు గృహలక్ష్మి కింద అందజేస్తారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనా భివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డిఓ జి.గణేష్, తహశీల్దార్ స్వామి, రఘునాథపాలెం ఎంపిపి గౌరీ, జడ్పిటిసి ప్రియాంక, ఖమ్మం మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ మల్లీశ్వరి, సహాయ కమిషనర్ సత్యనారాయణరెడ్డి, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

20, 21, తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు

నవతెలంగాణ- కల్లూరు

మండల స్థాయి పాఠశాలల క్రీడలు ఈనెల 20, 21, తేదీలలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం నందు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ దామోదర్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. మండలంలో చదువుతున్నటువంటి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందినటువంటి పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చు అన్నారు. 6 నుంచి పది తరగతుల మధ్య చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు మాత్రమే అర్హులు. క్రీడల నిర్వహణ బాధ్యతలను కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు .గడిపర్తి మాధవరావు, కల్లూరు మండల విద్యాశాఖ అధికారి ఎం.దామోదర్ ప్రసాద్, కల్లూరు మండల వ్యాయామ విద్య విభాగం బాధ్యులు తప్పెట లక్ష్మీ నరసయ్య, పిడి పివి సత్యనారాయణరెడ్డి. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు పసుపులేటి వీర రాఘవయ్య ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తారని తెలిపారు.

సమస్యలపై తహశీల్దార్‌కు మీసేవ నిర్వాహకుల వినతి

నవతెలంగాణ- వేంసూరు

సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ రాజుకు మీ సేవ నిర్వాహకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గత ఐదు సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీలను నేటి వరకూ అమలు చేయలేదన్నారు. మీ సేవలో ఉన్న సర్వీసులను తొలగించడం వల్ల మీ సేవల పరిస్థితి దయనీయంగా మారిందని, పెరుగుతున్న నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలకునుకూలంగా కమీషన్ పెంచాలని, సంవత్సరాలు గడుస్తున్నా కమీషన్ పెంచకపోవడంతో నిర్వహణ కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మీ సేవ నిర్వహకులు శేఖర్, కోటేశ్వరరావు, నాగేంద్ర, రాఘవ తదితరులు ఉన్నారు

ఏ ప్రమాదం ముంచుకొస్తుందో..

ప్రమాదభరితంగా విద్యుత్ స్తంభం

నవతెలంగాణ-కారేపల్లి



కారేపల్లి మండలం బాజుమల్లాయిగూడెం లో ప్రధాన రహదారి పక్కనే విద్యుత్ స్తంభం కూలే దశలో ఉండి ఏప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రహదారి పక్కనే కూలే దశలో ఉన్న విద్యుత్ స్తంభం చూస్తే భయం వేయక మానదు. వంగి పోయి కూలి పోయే స్థితిలో ఉన్న స్తంభం పక్కనే ఉన్న కుటుంబం నిత్యం భయం గుప్పెట్లో ఉండాల్సిన పరిస్థితి. దానిపై గ్రామస్తులు ఎన్ని పిర్యాదు చేసినా అధికారులుపట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి కూలే స్థితిలో ఉన్న స్తంభాన్ని మార్చాలను కోరుతున్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు టీ షర్టు వితరణ

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి ఎస్సై పుష్పాల రామారావు ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులకు శుక్రవారం టీషర్టు వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల క్రీడోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎస్సై పుష్పాల రామారావు పీఈటీ, పీడీ లను యూనిఫాం టీషర్టులను అందజేశారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులలో దాగిన క్రీడా నైపుణ్యాలను వెలికి తీసే బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యార్థుల ఆసక్తిని గమనించి వారిని ఆ క్రీడలలో ప్రోత్సహించాలని కోరారు. ఈకార్యక్రమంలో పీడీలు ఐ.పవన్‌కుమార్, మోసా మొహినుద్దీన్, దొండేటి రమేష్, రామకృష్ణ, ముక్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

విలీనం కంటే ముందే సమస్యలను పరిష్కరించాలి

నవ తెలంగాణ- మధిర

తెలంగాణ ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయడం కంటే ముందే ప్రస్తుతం ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం డిమాండ్స్ బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కావాలని రాష్ట్ర జేఏసీ పిలుపునిచ్చారు. ఆ పిలుపులో భాగంగా మధిర డిపో నందు జేఏసీ నాయకులు గోపాలకృష్ణ, వెంకట లక్ష్మీ ఆధ్వర్యంలో ఉద్యోగులు బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.



పాఠశాలల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

నవతెలంగాణ-కొణిజర్ల

మండల స్థాయి ఆటలపోటీలను మండల విద్యాశాఖాధికారి యం శ్యాంసన్, ఎస్ఐ జె.శంకర్‌రావులు శుక్రవారం ప్రారంభించారు. మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామపంచాయతీలో గల మైనార్టీ పాఠశాల ఈ ఆటలపోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఆటల పోటీలకు మైనార్టీ పాఠశాల ప్రిన్సిపాల్ మండల క్రీడా కమిటీ కన్వీనర్ సైదులు అధ్యక్షతన నిర్వహించారు. విజేతలకు అమ్మపాలెం, తనికెళ్ళ సర్పంచ్‌లు చిలుకూరి నాగేంద్రమ్మ, చల్లా మోహన్‌రావు చేతుల మీదగా బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల క్రీడా ఆర్గనైజర్ కార్యదర్శి హరీష్, వ్యాయామ ఉపాధ్యాయులు షేక్ రంజాన్, సత్యనారాయణ, శక్రం శంకర్, విజయ్‌కుమార్, రామారావు, షతిలాల్, మారతమ్మ యాదగిరి, నరసింహరావు, రవి, హరీష్ ఉపాధ్యాయులు అచుత్రావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-తల్లాడ

తల్లాడ టౌన్ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ రాజేష్ తెలిపారు. తల్లాడ, నారాయణపురం, మల్లారం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారుల సహకరించాలని ఏఈ కోరారు.

కల్లూరు : తల్లాడ మండలం కుర్నవల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏఈ తిరుపతిరావు ఓ ప్రకటనలో తెలిపారు. మిట్టపల్లి పరిధిలో ఉన్న33కేవీ కుర్నవల్లి ఫీడర్‌లో ఉన్న పెద్దకోరుకొండి పరిధిలోని చెన్నూరు, రావికంపాడు, లింగాల, ఎర్రబొయినపల్లి, చిన్నకోరుకొండి, పోచారం, తెలగారం, మర్లపాడు, వెన్నవల్లి, తాళ్ళూరు, వెంకటా పురం, య్ష నారాయణపురం, ఓబులరావుబంజర, ముచ్చారం, విశ్వనాథపురం, పాయపూర్ గ్రామాలలో ఉదయం 7.00 నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పల్లెమాల వెంకటరత్నంకు పరామర్శ

నవతెలంగాణ-మధిర

మధిర మండలం ఆత్కూరు గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లెమల వెంకటరత్నం సతీమణి పుల్లమ్మ అనారోగ్యంతో మృతిచెందింది. మృతదేహాన్ని మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దారా బాలరాజు, మండల నాయకులు నిడమానూరు వంశీ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొల్లెపోగు సత్యానందం, కంభంపాటి రవికుమార్, ఖమ్మంపాటి వీరయ్య, ఖమ్మంపాటి యోహాను, పల్లెపోగు నాగయ్య, కంచి పోగు లాజరు, బొల్లెద్దు రాజేందర్ తదితరులు సందర్శించి నివాళ్లర్పించారు. వెంకటరత్నంను పరామర్శించారు.

హెల్త్ వెల్నెస్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-కామేపల్లి

కొమ్మనేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ వెల్నెస్ సెంటర్‌ను కేంద్ర బృందం ప్రారంభించారు. రికార్డులు రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం డాక్టర్ ఎమ్మెస్ రీటా రాణీ, డాక్టర్ అమూల్య రేషన్ మొహన్ టా మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యమును ప్రజల దరికి చేరే విధంగా మరిన్ని వైద్య సౌకర్యాలను కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కామేపల్లి మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ నెల్లూరు చందన డాక్టర్ శిరీష డాక్టర్ ఉస్మాన్ ఖాన్ సిహెచ్ఓ సుధారాణి హెచ్ ఓ దూప్ సింగ్ ఏఎన్ఎం రేణుకా రాణి నవత శ్రీనివాసరావు ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ గొప్ప ఇంజినీరు 'మోక్షగుండం'

- ఎస్ఎస్ఐటీ డైరెక్టర్ డాక్టర్ చెన్నుపాటి

- కళాశాలలో ఘనంగా 'ఇంజినీర్స్ డే'

నవంతెలంగాణ-సత్తుపల్లి

దేశం గర్వించదగిన గొప్ప ఇంజినీరు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అన్ని సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ చెన్నుపాటి విజయకుమార్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఇంజినీర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ఇంజినీర్‌గా సర్వేశ్వరయ్య సాగు, తాగునీటి ప్రాజెక్టుల రూపకల్పనలో కీలకపాత్ర పోషించారన్నారు. అప్పట్లో హైదరాబాద్ నగరాన్ని వరదలు చుట్టుముట్టిన సమయాల్లో ప్రజలను రక్షించడానికి తీసుకొచ్చిన వ్యవస్థతో ఆయనకు మంచిపేరు మంచిపేరు వచ్చిందన్నారు. ముఖ్య అతిథిగా అమెజాన్ డేటా ఇంజినీర్ భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ ప్రోగ్రాంలో సోర్స్ కోడ్‌ను సృష్టించడం, నిర్వహణ, లైన్ కోడింగ్, డేటా ట్రాన్స్‌మిషన్‌లో ఉపయోగించే కంప్రెషన్, కోడింగ్ సిద్ధాంతం, ఛానెల్ కోడింగ్ తదితర విషయాలను విపులీకరించారు. ఎంపీ, హెటిరో అధినేత, కళాశాల ఛైర్మెన్ డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్టీ బండి అన్విద వర్చువల్‌గా విద్యార్థులకు ఇంజినీర్స్‌డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి, ప్రిన్సిపాల్ వూట్కూరి శేషారత్నకుమారి, కళాశాల చీఫ్ కౌన్సెలర్ కేవీ జవహర్, డిప్లొమో డీన్ తోమంద్రు రాంబాబు, అన్ని విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టు దుర్మార్గపు చర్య

నవతెలంగాణ- ఖమ్మం



ఖమ్మం తెలుగుదేశంపార్టీ కార్యాలయం ఎదుట తెలుగుదేపార్టీ శ్రేణులు,టిడిపి, తెలుగుమహిళ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని డాక్టర్ రామనాథం శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్‌ను చేతిలో పెట్టుకొని ప్రతిపక్షాలపై అక్రమ అరెస్టులు చేపిస్తూ ఎక్కడ సభలు, ర్యాలీలు, పెట్టుకున్నా దాడులు చేయిస్తూ రాజ్యాంగాన్ని పక్కన పెట్టి సైకో చేష్టలతో ఆంధ్ర రాష్ట్రాన్ని అధోగత పాలు చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలను తెలుగు రాష్ట్రాలే కాక ఇతర పార్టీ నాయకులు, సినీ తారలు తీవ్రంగా ఖండిస్తున్నారని అన్నారు. అప్రజాస్వామ్యికంగా వ్యవహరించే జగన్ రెడ్డి లాంటి దుర్మార్గపు ముఖ్యమంత్రిని ఏ రాష్టంలో చూడలేదని, రాజకీయంగా, ప్రజాబలంతో ఎదుర్కొనే సత్తా లేక, అన్యాయపు కేసు పెట్టి అక్రమంగా చంద్రబాబుని అరెస్ట్ చేసి పైశాచిక ఆనందం పొందుతున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో ఖమ్మం టిడిపి పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్, ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, ఐటిడిపి అధికార ప్రతినిధి ఆకారపు శ్రీనివాస్, లీగల్ సెల్ కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, పాల్వంచ రామారావు, బి.వి.రాగవులు, టిడిపి రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు చుండూరి రాజేశ్వరి ఖమ్మం పార్లమెంటరీ తెలుగు మహిళా కమిటీ అధ్యక్షురాలు మందపల్లి రజని, ప్రధాన కార్యదర్శి కామ అనితా తదితరులు పాల్గొన్నారు.

ముదిగొండ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెదేపా అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమని, ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుఅని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు అన్నారు. ముదిగొండ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్ర వెంకన్న నివాసంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు అరెస్టును ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి దేశ రాజకీయాలని చంద్రబాబు ప్రభావితం చేశారన్నారు. చంద్రబాబు అరెస్టు చేసి బెయిల్ రాకుండా కక్షపూర్వకంగా జైల్లో పెట్టడం అన్యాయమన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటమిలు సహజమని అధికారం ఎవరికి శాశ్వతం కాదన్నారు. అధికారంలోకి వచ్చినవారు కక్షపూరిత రాజకీయాలు చేయటం సమంజసం కాదన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు వాచేపల్లి లక్ష్మారెడ్డి, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, నాయకులు పసుపులేటి వెంకట్, ఎర్ర వెంకన్న, పోట్ల ప్రసాద్, చెరుకుపల్లి బిక్షం తదితరులు పాల్గొన్నారు.

చింతకాని: ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రివర్యులు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుపై ఏపీ ప్రభుత్వం రాజకీయ వేధింపుల కేసులు పెట్టడం దారుణమని బీఆర్ఎస్ చింతకాని మండల పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య అన్నారు. శుక్రవారం చింతకాని మండల పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఇటువంటి కక్షపూరిత కేసులు సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల మద్దతుతో గెలవాలి తప్ప రాజకీయంగా వేధింపులకు గురి చేయడం సరికాదన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అండ చూసుకొనే ఏపీలో వైకాపా సర్కారు ఈ రకంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. శనివారం ఉదయం 9 గంటలకు మధిరలో జరిగే నిరసన ర్యాలీలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు సమావేశంలో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, జడ్పిటిసి కిషోర్ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ పొనుగోటి రత్నాకర్, టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీను, వేముల నరసయ్య, బండి తిరపయ్య, కొండలరావు, నన్నక నరసింహారావు, బంధం కృష్ణ, వజ్రాల రామ్మూర్తి పట్టేటి గోపయ్య పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌పై బీఆర్ఎస్ దొంగనాటకాలు

టీడీపీ అభిమానుల ఓట్లు కొల్లగొట్టేందుకు ఓటు రాజకీయం

కాంగ్రెస్ పార్టీ నేతలు మువ్వా విజయబాబు, తుళ్లూరి బ్రహ్మయ్య

నవతెలంగాణ- ఖమ్మం



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్ పై గులాబీ పార్టీ నేతలు ఒక్కొక్కరూ ఒక్కో వైఖరి ప్రదర్శిస్తున్నారని, బాబు అరెస్ట్ అయిన సందర్భంలో మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులు పక్క రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలు.... రాజకీయాలు మనకెందుకు అని దాటవేశారని, అరెస్ట్ అయిన నాలుగైదు రోజులకు అంటే దొంగల పడ్డ ఆర్నెళ్లకు కుక్కలు మొరిగినట్లు ఉమ్మడి ఖమ్మంజిల్లా బీఆర్ఎస్ నేతలు బాబు అరెస్ట్ అక్రమమని ప్రకటనలు చేస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయబాబు, రాష్ట్ర నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య అన్నారు. శుక్రవారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతల ద్వంద వైఖరిని అవలంబిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని టీడీపీ అభిమానుల ఓట్లు కొల్లగొట్టేందుకు గులాబీలు ఇక్కడ చేస్తున్న ఓటు రాజకీయం అందరూ గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు అరెస్ట్ అయిన కొన్ని గంటల్లోనే కాంగ్రెస్ పార్టీ తరుపున సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తన స్పష్టమైన వైఖరి ఏంటో చెప్పారని, బాబు అరెస్టను ఖండించారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వైఖరి ఇంతవరకూ స్పష్టం చేయలేదన్నారు. ఇక్కడ పువ్వాడ, సండ్ర మాత్రం టీడీపీ ఓట్ల కోసం దొంగనాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. వీళ్ల ఎన్ని జిమ్మిక్కులు చేసినా జనం నమ్మే పరిస్థితి లేదన్నారు.

వారోత్సవ ముగింపు సభను జయప్రదం చేయండి : సీపీఐ(ఎం)

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం సాయంత్రం జరిగే బైక్ ర్యాలీను మరియు భక్త రామదాసు కళాక్షేత్రంలో జరిగే సెమినార్‌ను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు షేక్ బషీరుద్దీన్ పిలుపునిచ్చారు. స్థానిక గజ్జల వెంకటయ్య భవనంలో అంగిరేకుల నరసయ్య అధ్యక్షతన జరిగిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ నిజాం నవాబుకు వ్యతిరేకంగా, జమీందారులు, రజాకార్లు, భూస్వాములు, పటేల్ పట్వారిలకు వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటం వీర తెలంగాణ సాయుధ పోరాటమన్నారు. 11 నుంచి 17 వరకు వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలుగా నిర్వహిస్తున్నామని, ఈ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని వాటిని జయప్రదం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, పార్టీ మండల నాయకులు తుళ్లూరు నాగేశ్వరరావు, నాగాటి సురేష్, రమేష్, కొమ్ము నాగేశ్వరరావు గోపోజి రవి పగిడిపల్లి సునీల్, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి పురిటిగడ్డ పిండిప్రోలు

పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం లాంటి మహా నాయకుల సారథ్యంలో రజాకార్లకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టి పోరాడిన చరిత్ర పిండిప్రోలు గ్రామానికి ఉందని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సాయుధ రైతాంగ తెలంగాణ పోరాట వారోత్సవాల్లో భాగంగా పిండిప్రోలు గ్రామంలోని అమరవీరుల స్థూపం వద్ద అమరులకు నివాళుల ర్పించారు. అనంతరం పిండిప్రోలు గ్రామ శాఖ కార్యదర్శి పప్పుల ఉపేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొమ్ము శ్రీను మాట్లాడుతూ పోరాటాల గడ్డ పిండిప్రోలుకి వీర చరిత్ర ఉందని అన్నారు. సాయుధ తెలంగాణ పోరాటంలో దొండేటి పుల్లయ్య, రాయల రామాయమ్మ, షేక్ చినమలసూరి, రాయల రాంబాయమ్మ, రాయల వెంకటనారాయణ, రామన బోయిన వీరస్వామి మరికొందరు పోరాటంలో వీరమరణం పొందారని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పప్పుల ప్రసాద్, సొసైటీ డైరెక్టర్ చల్ల వెంకటేశ్వర్లు, దొండేటి నిర్మల్ రావు, మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి, నాగటి సురేష్, పప్పుల చిన్న ఉపేందర్, కిన్నెర, వెంకన్న, పిడతల నరేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు నివాస స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి

టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి విరహత్ అలీ

నవతెలంగాణ- ఖమ్మం



ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల ఉదాసీన వైఖరిని అవలంభిస్తున్నాయని తక్షణం జర్నలిస్టుల కనీస అవసరాలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యదర్శి విరహత్ అలీ డిమాండ్ చేశారు. అనారోగ్యం బారినపడి అనేక మంది ఇబ్బందులు పడుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం.. శోచనీయమన్నారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం స్థానిక డిపిఆర్సి భవన్లో జరిగింది. జిల్లా అధ్యక్షులు వనం వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో విరహత్ అలీ మాట్లాడుతూ అనేక దశాబ్దాలుగా వృత్తిని నమ్ముకుని పని చేస్తున్న వారికి కనీసం ఇండ్ల స్థలాలు కూడా మంజూరు చేయలేదని, ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు నివాస స్థలాలు మంజూరు చేయాలని విరహత్ డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 19 రాష్ట్రాలు జర్నలిస్టులకు పింఛన్ సౌకర్యం కల్పిస్తున్నాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా పింఛన్ సౌకర్యం కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జర్నలిస్టుల నివాస స్థలాలు, హెల్త్ కార్డుల కోసం త్వరలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్జేయు అధ్యక్షులు శివశంకర్ గౌడ్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు రవీంద్రశేషు, రాష్ట్ర నాయకులు మాటేటి వేణుగోపాల్, నర్వనేని వెంకట్రావు, సామినేని కష్ణ మురారి, ఎస్కె ఖాదర్, ఖదీర్, జిల్లా కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు సివిఆర్ శ్రీనివాస్, ఖమ్మం నియోజక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు దువ్వా సాగర్, నామ పురుషోత్తం, జనార్ధనాచారి, మోహినుద్దీన్, తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పరిశ పుల్లయ్యకు సన్మానం

విస్తతంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న పరిశ పుల్లయ్యను టియుడబ్ల్యూజె (జాతీయు) కార్యవర్గం ఘనంగా సన్మానించింది. పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడమే కాకుండా విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్న పుల్లయ్యను టియుడబ్ల్యూజె (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి విరహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాంనారాయణ, జిల్లా కమిటీ ఘనంగా సన్మానించింది.

ముగియనున్న చేనేత హస్తకళాల ప్రదర్శన, అమ్మకాలు

నిర్వాహకులు ప్రసాద్‌రావు

నవతెలంగాణ- ఖమ్మం

నగరంలోని 51 డివిజన్ దోరేపల్లి ఫంక్షన్ హాల్ లో శ్రీ కళాభారతి చేనేత హస్తకళా మేళా అఖిల భారత హస్తకళా చేనేత వస్త్ర ప్రదర్శన, అమ్మకాలు శనివారం, ఆదివారం ముగియనున్నాయని నిర్వాహకులు ప్రసాద్‌రావు తెలిపారు. ఖమ్మం నగర ప్రజలు చేనేత హస్తకళలను ఆదరించి ప్రదర్శనను సందర్శించి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి, గద్వాల, నారాయణపేట, సిద్ధిపేట, వరంగల్, వెంకటగిరి, మంగళగిరి, చీరాల, ఉప్పాడ, కంచి, ధర్మవరం, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, శారీస్, బెడ్షీట్స్, టవల్స్ వంటి ఎన్నో రకాల చేనేత వస్త్రాలు శ్రీ కళాభారతి ఆధ్వర్యంలో కళాకారుచే నేరుగా తయారు చేసిన వస్త్రాలను ఖమ్మం ప్రజల వద్దకు తీసుకొచ్చామని తెలిపారు. దేశంలోనే పేరెన్నికగన్న కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, నిర్మల్ టాయిస్, హైద్రాబాద్ మంచి ముత్యాలు, మైసూర్ రోజ్వుడ్, సహారన్పూర్ వుడ్ కార్వింగ్, వరంగల్ లెదర్ బ్యాగులు, బంజార ఎంబ్రాయిడరి, బెంగాల్ జ్యూట్ బ్యాగ్స్ ఇలాంటి ఎన్నో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సుమారు 200 లకు పైగా హస్తకళలు చేనేత వస్త్రాలు తమ ప్రదర్శన ఉన్నాయని, రెండు రోజులు వరకు ఈ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.



విజయభేరిలో ఖమ్మం సత్తా చాటుదాం

తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయబాబు

నవతెలంగాణ- ఖమ్మం

కేసీఆర్ పునాదులు కదిలించే విజయభేరికి భారీగా తరలివెళ్లి సోనియమ్మకు నీరా'జనం' పలికి ఖమ్మం సత్తా చాటుదామని తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ సభ్యులు మువ్వా విజయబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఖమ్మం నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే లక్ష్యంగా జరుగుతున్న సీడబ్ల్యూసీ సమావేశాల్లో భాగంగా ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న విజయభేరి భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ వస్తున్న సందర్భంలో సభకు భారీగా తరలివెళ్లి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వర్లు, ఎండీ ముస్తఫా, కొప్పెర ఉపేందర్, రామ్మూర్తి, తమ్మిన్ని నాగేశ్వరరావు, మియాభాయ్, ఇమామ్ భాయ్, నగర ఓబీసీ సెల్ చైర్మన్ బాణాల లక్ష్మణ్, ఎంపీటీసీ అశోక్, కీసర పద్మజా రెడ్డి, కొంగర జ్యోతిర్మయి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైరాటౌన్ : సెప్టెంబర్ 17వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్ సరిహద్దు తుక్కుగూడ ప్రాంతంలో నిర్వహించే విజయభేరి సభలో కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వైరా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిపిసిసి సభ్యులు ధరావత్ రామ్మూర్తి నాయక్, టిపిసిసి కార్యదర్శి కట్ల రంగారావు పిలుపునిచ్చారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే తదితర ఎఐసిసి అగ్ర నాయకులు పాల్గొంటారని తెలిపారు.

చంద్రబాబు నాయుడు అరెస్టుకు ఖండన

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు అరెస్టును ధరావత్ రామ్మూర్తి నాయక్, కట్ల రంగారావు ఖండించారు. జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కట్ల సంతోష్, కట్ల నాగరాజు, రేచర్ల నాగేశ్వరరావు, రేచర్ల రాముడు, నంద్రు నాగరాజు, వెంపటి రంగారావు, బొర్రా గోవిందరావు, గుత్తికొండ వీరబాబు, పాణ్యం భాస్కర్, యామాల భాస్కర్, తేజావత్ రామకష్ణ, యామాల కిరణ్ పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సానుభూతిపరుని మృతి

నవతెలంగాణ- తల్లాడ

మండల పరిధిలోని నరసింహారావు పేట గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరుడు సిర్ర నాగేశ్వరరావు గురువారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని పార్టీ మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, శీలం సత్యనారాయణరెడ్డి, నల్లమోతు మోహన్ రావులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పిం చారు. పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. నివాళ్లర్పించిన వారిలో ఏన్కూరు మండల సిపిఎం కమిటీ సభ్యుడు గుడ్ల వెంకటేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షుడు కూచిపూడి వెంకటేశ్వరావు,పేరసాని వెంకటయ్య, కొమ్మూరు గోపాలరావు, సామినేని వెంకటేశ్వరరావు, చిన్నకాల మోహన్‌రావు, శనక్కాల నరసింహారావు, శనక్కాయల చిన్న నరసింహారావు, సుంకర నరసింహారావు, శివలింగ వెంకట నరసయ్య, గువ్వల వెంకటేశ్వర్లు, శనక్కాల సీతారామయ్య, పిన్ని వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలు పంచాలని తహశీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

తిరుమలాయపాలెం మండల కేంద్రంలో గత మేలో ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు స్వీకరించారు. గ్రామసభ పెట్టి 130 మందిని ఎంపిక చేశారు. వీరిలో 80 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మిగిలిన వారికి త్వరలో ఇస్తామని చెప్పారు. కానీ నేటికీ వారికి ఇవ్వలేదు. స్థానిక ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై దృష్టి సారించి త్వరగా అందరికీ ప్లాట్లు పంపిణీ చేయాలని సీపీఐ(ఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

డెంగ్యూ దోమల వల్ల ప్రజలందరూ జాగ్రత్త పాటించాలి

మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభి ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ... డెంగ్యూ దోమల వల్ల గురించి వివరిస్తూ ఖమ్మం నగర ప్రజలందరూ ఎక్కడ నిల్వ ఉంచుకోవద్దని డెంగ్యూ దోమలు ఎక్కువగా మంచినీరులోనే వచ్చే అవకాశాలు ఉన్నాయని అందువల్ల ఇంట్లో బాటిల్స్ రోడ్లు గాబులు మూతలు సీసాలు టైర్లు ఇటువంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని అన్నారు.

నేడు విద్యుత్‌లో అంతరాయం

నవతెలంగాణ-చండ్రుగొండ

33/11కేవి మద్దుకూరు ఉపకేంద్రం నందు మరమ్మతులు చేస్తున్న నేపథ్యంలో శనివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మద్దుకూరు, దామరచర్ల, సీతాయిగూడెం, అయ్యన్నపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మండల విద్యుత్ శాఖ ఎమ్మెల్యే నరసింహారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పాపకొల్లులో కాంగ్రెస్ "మార్నింగ్ వాక్"

నవతెలంగాణ - జూలూరుపాడు

మండల పరిధిలోని పాపకొల్లు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకురాలు బానోతు విజయబాయి శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేయబోయే అభివృద్ధిని వివరించుకుంటూ, కాంగ్రెస్ మేనిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కొత్తపెల్లి గ్రామ సందర్శన

నవతెలంగాణ-చర్ల

కొత్తపెల్లి గ్రామ ప్రజలు గత రెండు వారాలుగా విష జ్వరాలతో అల్లాడుతున్నారని సీపీఐ(ఎం) మండల కమిటీ శుక్రవారం ఆ గ్రామాన్ని సందర్శించింది. ప్రతి ఇంట్లో ఒకరు జ్వరంతో బాధపడుతున్నారని మెడికల్ క్యాంపు కూడా ఏర్పాటు చేయడంతో గ్రామంలో భయభ్రాంతులకు గురి కాకుండా ఉండాలని అన్నారు. ప్రభుత్వం దగ్గరుండి మెడికల్ క్యాంపులు రెండు రోజులకు ఒకసారి ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో శానిటేషన్, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని మురికి కాలువలు లేకుండా ప్రత్యేక డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి కారం నరేష్, మచ్చ రామారావు, బందెల చంటి, తాళ్లూరి కృష్ణ, శ్రీను ప్రజలు పాల్గొన్నారు.

యువకుడిపై బల్లెంతో దాడి

నవతెలంగాణ-చెర్ల

మండలంలోని బూరుగుపాడు గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. బూరుగుపాడు గ్రామస్తుడైన మట్ట భద్రయ్యను దానవాయపేట గ్రామస్తుడు మట్ట నరసింహారావు బల్లెంతో పొడిచి తీవ్రంగా గాయపరిచాడు. మట్ట భద్రయ్య కడుపులో నుంచి పేగులు బయటకు రావడంతో గ్రామస్తులు ఒక్కసారిగా భయభ్రాంతులకు గురయ్యారు. మెరుగైన వైద్యం కోసం వెంటనే భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు గిరిజనుల మధ్య భూతగాదాలు కానీ, ఏ ఇతర సొంత గొడవలు కానీ ఉండవచ్చని అందుకే ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడం జరిగిందని తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు

- **జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత**

నవతెలంగాణ -బూర్గంపాడు

తెలంగాణ ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీలకు, రైతులకు సీఎం కేసీఆర్ పెద్ద పేట వేశారని జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత అన్నారు. బూర్గంపాడు మండల ఉప్పుసాక గ్రామంలో శుక్రవారం ఎస్సి కాలనీ, ఎస్టీ కాలనీలో జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆధ్వర్యంలో అభివృద్ధి పల్లె ప్రగతి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు తెలియ జేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ పినపాక నియోజకవర్గ పరిధిలో ఎమ్మెల్యే రేగా కాంతారావు అనేక అభివృద్ధి సంక్షేమానికి కోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి పినపాక నియోజవర్గ ప్రజల కష్టాలు తీర్చినారని ఆమె పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధి చేస్తున్న సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే రేగా కాంతారావుల కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, యువజన విభాగ మండల అధ్యక్షులు గోనెల నాని, ఇంచార్జ్‌లు యువజన విభాగం నాయకులు చుక్కపల్లి బాలాజీ, కొనకంచి శ్రీను, లక్ష్మీ చైతన్య రెడ్డి, గ్రామ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు కనీస వేతనం 26వేలు ఇవ్వాలి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రాష్ట్రంలో 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని వీరికి కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీపీఐ కార్యదర్శి ఆకోజు సునీల్, సిఐటియు పట్టణ కన్వీనర్ ఎంబి. నర్సారెడ్డి డిమాండ్ చేశారు. భద్రాచలం పట్టణ కేంద్రంలో జరుగుతున్న అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ నిరవధిక సమ్మెలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్వాడీ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరంతా మహిళలు బడుగు బలహీన వర్గాల దళితులు పేదలేనని గత 45 సంవత్సరాలుగా పనిచేస్తున్నారని వీరికి కనీస వేతనం పెన్షన్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యాలు ఏమి రాష్ట్ర ప్రభుత్వాలు కల్పించలేదని అన్నారు. ఈ మధ్యకాలంలో రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏ గ్రామపంచాయతీ సెక్రటరీలను కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసిందని అట్లాగే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందని అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమం సిఐటియు పట్టణకు కో కన్వీనర్ మర్లపాటి రేణుక అధ్యక్షత వహించారు ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పట్టణ నాయకులు భీమవరపు వెంకటరెడ్డి, సిఐటియు నాయకులు ఎన్.నాగరాజు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు ముత్తయ్య, ఏఐటీయూసీ నాయకులు మారెడ్డి శివాజీ పాల్గొన్నారు.

పాము కాటుకు గిరిజన యువతి మృతి

- **రహదారి సక్రమంగా లేక నిండు ప్రాణం బలి**


నవతెలంగాణ-చర్ల

మండలంలోని సుబ్బంపేట పంచాయతీ రాజయ్య నగర్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున రాత్రి 3:30 గంటల సమయంలో కట్లపాము కరిచి పొడియం జ్యోతి(23) అనే యువతి మృతి చెందింది. రహదారి మార్గం అస్తవ్యస్తంగా ఉండడం వలన పాముకాటు బారిన పడిన యువతిని సమయానికి వైద్యం అందించలేకపోయామని గ్రామస్తులు వాపోతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టేందుకు యత్నం

- **అడ్డుకున్న టీచర్లు**

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



పట్టణంలో గత మూడు రోజులుగా ఐసీడీఎస్ గ్రామ పంచాయతీ అధికారులు, పోలీస్ సహకారంతో స్వయంగా దగ్గరుండి అంగన్వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టించడాన్ని అంగన్వాడీ టీచర్లు అడ్డుకొని అధికారులను ఎదిరించారు. మనుబోతుల చెరువు, సుందరయ్య నగర్, ఇందిరానగర్ కాలనీ, రాజుపేట కాలనీ, ఎంపీ కాలనీ, భూదేవి నగర్, కాలనీలో స్థానికులు పెద్ద ఎత్తున అధికారులను అడ్డగించారు. ప్రభుత్వం తక్షణమే సమ్మెలో ఉన్న అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ లను పిలిచి చర్చలు జరపాలని కోరారు. సమ్మె ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు అడ్డుకుని తీరుతామని, వారు హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-జూలూరుపాడు

జులూరుపాడు, పాపకొల్లు, పి.నరసాపురం సబ్ స్టేషన్ ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ నిలిపి వేయబడుతుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు, రైతు సోదరులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రేపు బీఎస్పీ ఆధ్వర్యంలో తెలంగాణ పునఃర్విముక్తి ప్రతిజ్ఞ దివస్

- **పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.వి.రమణ**

నవతెలంగాణ -బూర్గంపాడు

ఈ నెల 17న బీఎస్పీ ఆధ్వర్యంలో తెలంగాణ పునఃర్విముక్తి ప్రతిజ్ఞ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.వి.రమణ పేర్కొన్నారు. శుక్రవారం బూర్గంపాడులో గడపగడపకు బీఎస్పీ ప్రగతి భవన్‌కు ఆర్.ఎస్.పి. కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు నల్లగట్ల రఘు, గాడిద దామోదర్ పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన జెడ్పీ చైర్మెన్ కోరం

నవతెలంగాణ-ఇల్లందు

మండలంలోని పలు బాధిత కుటుంబాలను శుక్రవారం జెడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య పరామర్శించారు. కొమరారం గ్రామానికి చెందిన జోగా సింగమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, 5,000 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. కొమరారం గ్రామంలో నూతనంగా నిర్మాణంలో ఉన్నటువంటి చర్చి నిర్మాణ పనులను పరిశీలించి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తానని మత పెద్దలకు హామీ ఇచ్చారు. చల్ల సముద్రం గ్రామ పంచాయతీ, ముకుందాపురం జూపల్లి సీతమ్మ చిత్ర పటానికి నివాళు లర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి,4,000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ముకుందాపురం గ్రామానికి చెందిన మోడెం ఆత్మలింగం ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, 4,000 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వారివెంట మండల సర్పంచులు పాయం స్వాతి, కల్తీ పద్మ, పాయం లలిత, తాటి చుక్కమ్మ,ఎంపీటీసీలు మండల రాము,పూనెం సురేందర్,బానోత్ రోజా,తాటి యశోద, ఉప సర్పంచులు తాటి రాంబాబు, కుర్ర అరుణ,నాయకులు మడుగు సాంబమూర్తి,బోళ్ళ సూర్యం పాల్గొన్నారు.

25 నుండి ఆశాల సమ్మె బాట..!

- **జిల్లా జాయింట్ కలెక్టర్, డీఎంహెచ్ఓలకు సమ్మె నోటీస్ అందజేత**
- **ఆశా వర్కర్లతో వెట్టి చాకిరీ : సిఐటియు జిల్లా కోశాధికారి జి.పద్మ**

నవతెలంగాణ-పాల్వంచ



ఆశా వర్కర్లకు పారితోషకాలను 18 వేలకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలని, ఇతర సమస్యల పరిష్కరించాలని లేనియెడల సెప్టెంబర్ 25 నుండి నిరువధిక సమ్మెలోకి వెళ్తామని వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి ఆశా వర్కర్లు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటియు జిల్లా కోశాధికారి జి.పద్మ సీఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డ రవి కుమారులు మాట్లాడుతూ ప్రభుత్వం ఆశా వర్కర్లకు పనికి తగ్గ వేతనం ఇవ్వట్లేదని అదనపు పనులు అదనపు వేతనాలు ఇవ్వట్లేదు అని పారితోషకం లేని అనేక పనులు చేయిస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని విమర్శించారు. ఆశా వర్కర్లు అందరూ వీరంతా మహిళలు బడుగు బలహీన వర్గాలకు చెందినవారు, ప్రారంభం నుండి ఇప్పటి వరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగులు పొందారు. రిజిస్టర్ రాయడం సర్వేలు చేయడం, ఆన్ లైన్ పనిచేయడం బీపీ, షుగర్, థైరాయిడ్, తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం సప్లై చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారు. తగిన జాగ్రత్తలు ఎప్పటికప్పుడు ప్రజలకు వివరిస్తున్నారు. వీటితోపాటు గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలకు ఇతర ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కరోనాను నియంత్రించడంలో ఆశాలు కీలక పాత్ర పోషించారు. డబ్ల్యూటీవో ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా హెల్త్ గ్లోబల్ లీడర్స్ అనే ఆశా వర్కర్లకు అవార్డు ప్రకటించిన పరిస్థితి ఉంది. ఇన్ని పనులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం ఇవ్వకుండా పనికి తగ్గ పారితోషకం అని చెప్పి చాలీచాలిన వేతనం ఇస్తున్నారని వారి సేవలను కొనియాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాల తీస్తున్న పారితోషకాలు 18 వేలకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలని ఆశాలకు మట్టి ఖర్చులు 50 వేలు చెల్లించాలని పారితోషకం లేని అదన పనులు ఆశాలతో చేయించకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ఆశా యూనియన్ సీఐటియు అనుబంధం అధ్యక్ష కార్యదర్శులు ధనలక్ష్మి, ఝాన్సీ, మాధవి, జయ, సునీత, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు కొరియర్ అరెస్ట్

- **వివరాలు వెల్లడించిన సీఐ రాజగోపాల్**
- **సంఘ విద్రోహక చర్యలకు పాల్పడవద్దని హెచ్చరిక**

నవతెలంగాణ- చర్ల



నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన కొరియర్‌ను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకొని శుక్రవారం అరెస్టు చేశారు. చర్ల సిఐ బి.రాజగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకటచెరువు గ్రామ అటవీ ప్రాంతంలో చర్ల పోలీసులు, తమ సిబ్బందితో సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీ చేపట్టారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, బీజాపూర్ జిల్లా, మిర్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల పుల్లుమ్ గ్రామానికి చెందిన కుంజ ఉమేష్ ఏ భద్రు మావోయిస్ట్ పార్టీతో అనుబంధంగా ఉండే బాలల సంఘం నందు 2011వ సంవత్సరంలో చేరాడు. మావోయిస్టు పార్టీ వారు గ్రామాలలో నిర్వహించే మీటింగులు, సభలలో పాల్గొంటూ వారికి సహాయ సహకారాలు అందించేవాడు. మావోయిస్టు పార్టీ ఎల్వోఎస్ నందు పార్టీ మెంబర్‌గా చేరాడు. భైరమ్ ఘడ్ ఏరియా కమిటీకి చెందిన వయం జిత్రు ఏ.అశోక్ కమాండర్‌గా ఉన్న 12వ ప్లాటున్‌కు భైరమ్ ఘడ్ పరిసర ప్రాంతల్లో పనిచేశాడు. అలా 2022 వరకు దళంలో పని చేసి, పోలీస్ వారి కదలికలను తెలుసుకోని మావోయిస్టు నేతలకు చెరవేసేవాడు. వారి ఆదేశాల మేరకు ములుగు జిల్లా వెంకటాపురం గ్రామం వచ్చి కూలీ పనులు చేస్తూ, పోలీస్ వారి కదలికలను తెలుసుకుంటూ అట్టి సమాచారాన్ని చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని కోమటి పల్లి, కొండపల్లి గ్రామాలకు వెళ్ళి తెలంగాణ ప్రాంతానికి చెందిన మావోయిస్ట్ పార్టీ నాయకులైన దామోదర్, ఆజాద్, కంకనాల రాజ్ రెడ్డి, ఆడేళ్ల భాస్కర్, ఇంకొంత మందికి చేరవేస్తూ వారితో పరిచయం బలపడిన తర్వాత అప్పటి నుండి వారు చెప్పిన పనులు చేస్తూ వారికి కొరియర్‌గా పనిచేస్తుండేవాడు. ఇలా పలు మావోయిస్టు కార్యకలాపాల్లో పని చేశాడని సీఐ బి. రాజగోపాల్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు టి.వి.ఆర్ సూరి, నర్సిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి

- **ఎస్ఐ సంతోష్**

నవతెలంగాణ-లక్ష్మీదేవి పల్లి



మండలంలోని గణేష్ మండపాలకు పోలీస్ అనుమతులు తప్పనిసరని ఎస్ఐ పి.సంతోష్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా గణేష్ విగ్రహ ప్రతిష్ఠ, పందిళ్ళ/మండపాలు ఏర్పాటు చేసుకోవడానికి ఐదు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులతో ఒక కమిటీగా ఏర్పడి వారి వివరాలు పోలీస్ స్టేషన్లో తెలియజేయాలన్నారు. ప్రయివేట్ స్థలాలలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే సంబంధిత స్థల యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పోలీస్ అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాట్లు చేయరాదన్నారు. పోలీస్ శాఖతో పాటు ఫైర్, విద్యుత్ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఆయా విభాగాలు సూచించిన నియమ నిబంధనలకు అనుగుణంగా పందిళ్ళ/మండపాల వద్ద ముందస్తుగా ఇసుక మరియు నీళ్ళను ఏర్పాటు చేయాలన్నారు. పందిళ్ల/మండపాలలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా జాగ్రతలు తీసుకోవాలని, విద్యుత్ వైర్లను ప్రకాశవంతమైన లైట్ల వినియోగంలో తగు జాగ్రతలు వహించాలన్నారు. ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ జరుగకుండా వైరింగ్ జాగ్రత్తగా చేయించుకోవాలన్నారు. గణేష్ ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవం నిర్వహించే రోజుల వివరాలు, నిమజ్జనం చేసే తేదీని, సమయం, నిమజ్జన మార్గం, విగ్రహ నిమజ్జనానికి ఉపయోగించే వాహన వివరాలను విధిగా తెలియజేయాలన్నారు. పందిళ్ళ/మండపాలు వద్ద శబ్ద కాలుష్య నింబంధనలు ప్రకారం మాత్రమే స్పీకర్లను ఉపయోగించాలని, ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వాడాలన్నారు. రాత్రి వేళల్లో మండపాల వద్ద విధిగా ఆర్గనైజింగ్ కమిటీ వారి ప్రతినిధులు కాపలా ఉండాలని, రాత్రి సమయాలలో పందిళ్ళ/మండపాలలో విలువైన వస్తువులు ఉంచరాదన్నారు. వినాయక పందిళ్ళు గాని, విగ్రహం పెట్టే ప్రదేశం గాని రోడ్డుపైన ఉండరాదని, బ్యానర్లు/ఫ్లెక్సీలతో రోడ్డుపైన రాకపోకలకు అంతరాయం కలిగించరాదని, వినాయక చవితి ఉత్సవాల సమయంలో బాణసంచాలను ఉపయోగించరాదన్నారు. డీజే లకు అనుమతి లేదన్నారు.

ఔట్‌సోర్సింగ్‌లోకి మార్చే ప్రతిపాదన విరమించుకోవాలి

- **లేదంటే నిరవధిక సమ్మె చేస్తాం : సీఐటీయూ**

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో నడుస్తున్న హాస్టల్ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న డైలీ వేజ్ వర్కర్లను అవుట్ సోర్సింగ్‌లోకి మార్చే ప్రతిపాదనలు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు విరమించుకోవాలని లేదంటే నిరవధిక సమ్మె చేస్తామని తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు హాస్టల్ డైలీ వేస్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు పేర్కొన్నారు. భద్రాచలంలో సీఐ జియో కార్యాలయం నందు డైలీ వేజ్ వర్కర్ల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మాచారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మధు మాట్లాడుతూ గత కొంతకాలంగా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు డైలీ వేజ్ వర్కర్లను అవుట్సోర్సింగ్ పద్ధతిలోకి మార్పు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారని ఈ ప్రతిపాదనల వల్ల డైలీ వేజ్ వర్కర్లకు తీవ్ర నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం డైలీ వేజ్ వర్కర్లకు 020 పద్దు ద్వారా ట్రెజరీ నుండి వేతనాలు చెల్లింపు జరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ కనీస వేతనాలు జీవో అమలు చేస్తున్నారని ఔట్సోర్సింగ్ లోకి మారిస్తే ఈ సౌకర్యాలు కోల్పోతారని వేతనాలు తగ్గుతాయని కొరకు సేవలు ఏజెన్సీ జోక్యం పెరిగి ప్రభుత్వానికి కార్మికులకి ఉన్న ప్రత్యక్ష సంబంధం తెగిపోతుందని సిఐటియు పేర్కొన్నది అందుకనే డైలీ వేజ్ వర్కర్లను ఔట్సోర్సింగ్ లోకి మార్పు చేయాలని ప్రతిపాదనలను సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని బి మధు తెలిపారు. కనీస వేతనం 26000 ఇవ్వాలని, 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పడినాటి డైలీ వేజ్ వర్కర్లుగా పనిచేస్తున్న అందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెల మొదటి వారంలో జీతాలు చెల్లించాలని సంవత్సరంలో 12 నెలలకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ అధికారులు మొదలుకొని రాష్ట్ర ప్రభుత్వ మంత్రులకు గిరిజన ఎమ్మెల్యేలు ఎంపీలకు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ వారికి సమస్యలపై అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చామని ఐటీడీఏ కార్యాలయాల వద్ద, హైదరాబాదులోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద అనేకసార్లు ధర్నాలు ప్రదర్శనలు నిర్వహించామని గుర్తు చేశారు. ఇప్పటికే హైదరాబాదులో కమిషనర్‌కి జిల్లాల్లో ఐటీడీఏ పివో, పిడిలకు నోటీసులో అందజేస్తామని పూర్తి చేశారు. మీ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కౌసల్య, అబ్బులు జలంధర్, ముసలయ్య, తిరుపతమ్మ, పాపారావు, నాగమణి పాల్గొన్నారు.

లయన్స్ ఆధ్వర్యంలో ఇంజనీర్లకు ఘనసన్మానం

నవతెలంగాణ-ములకలపల్లి



ములకలపల్లిలో లయరన్స్ క్లబ్ ఆఫ్ పాల్వంచ కిన్నెరసాని ఆధ్వర్యంలో శుక్రవారం ఇంజనీర్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. మండల ట్రాన్స్కో ఇంజనీర్ లక్ష్మినర్సింహారావు, ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ పూర్వాషాలకు క్లబ్ బాధ్యులు కేదారేశ్వరరావు, సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీర్ల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మెహరామణి, ఉపసర్పంచ్ అంజి, శెనగపాటి రవి, పాల్గొన్నారు.

సమ్మెను ఉధృతం చేస్తాం

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.పద్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఐదు రోజులుగా జరుగుతున్న అంగన్వాడీల నిరవధిక సమ్మె 5వ రోజు సమ్మెను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా కోశాధికారి వెంకట్ రమణ, రాజ్యలక్ష్మి, చుక్కమ్మ, అచ్చమ్మ, రమణ, భాను విజయ, కుమారి మేరి తదితరులు పాల్గొన్నారు.

చెవిలో పువ్వులతో అంగన్వాడీ, హెల్పర్ల వినూత్న నిరసన

ములకలపల్లి : ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని ములకలపల్లి మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు చెవిలో పువ్వులు ధరించి వినూత్న నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ ఎంతోమంది ఉద్యోగులకు న్యాయం చేశారని, సమస్యలు పరిష్కరించి తమకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ధర్నా చేస్తున్నా ఒక్క అధికారి, పాలకులు తమకు సంఘీభావం తెలపడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ మా బాధలు అర్థం చేసుకుని తమ కనీస వేతనం రూ.26వేలు, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కొందరు చిన్నారులు కేసీఆర్ తాత మా అమ్మల బాధలు అర్థం చేసుకోమని ధర్నా నిర్వహించే ప్రదేశంలో పలకపై రాసి పట్టుకోవడం చూపరులను కలిచివేసింది. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు, హెల్పర్లు పాల్గొన్నారు.

'విజయ భేరి'ని విజయవంతం చేయండి

- **మాజీ శాసనసభ్యులు తాటి వెంకటేశ్వర్లు**

నవతెలంగాణ-చండ్రుగొండ



సెప్టెంబర్ 17న జరిగే కాంగ్రెస్ విజయ భేరి సభను విజయవంతం చేయాలని మాజీ శాసనసభ్యులు టిపిసిసి సభ్యులు తాటి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం మద్దుకూరు గ్రామంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీతో పాటు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ కార్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, హాజరవుతున్నారు, ఈ సభను విజయవంతం చేయవలసిందిగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుండి పదివేలకు తగ్గకుండా జన సమీకరణ చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పరిశీలకులుగా కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ శనివారం దమ్మపేట తాటి వెంకటేశ్వర్లు నివాసం వద్ద ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి 5 మండలాల నుంచి ముఖ్య నాయకులు పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కొనకండ్ల వెంకటరెడ్డి, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, మండలాల అధ్యక్షులు దారం గోవిందరెడ్డి, వనమా గాంధీ, మాజీ ఎంపీపీ గుగులోత్ బాబు, సీనియర్ నాయకులు నల్లమోతు రమణ, కృష్ణ, తుమ్మలపల్లి సురేష్, సిహెచ్ రవి, ఇజం అప్పారావు, అంతటి రామకృష్ణ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

- **క్రీడా జెండాను ఆవిష్కరించిన ఎంపీపీ గుమ్మడి గాంధీ**

నవతెలంగాణ-పినపాక

మండలంల పరిధిలోని జానంపేట పంచాయతీలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఘనంగా మండల స్థాయి క్రీడలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలకు పినపాక ఎంపిపి గుమ్మడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని క్రీడా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపిపి గుమ్మడి గాంధీ మాట్లాడుతూ... విద్యార్థులకి చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలు వల్ల శరీరం దారుఢ్యంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణ, ఆత్మ కమిటీ చైర్మన్ పోనుగోటి భద్రయ్య, సొసైటీ చైర్మన్ రవి శేఖర్ వర్మ, పాఠశాల కమిటీ చైర్మెన్ మహాలక్ష్మి, వ్యాయమ ఉపాధ్యాయులు పోలెబోయిన అనిల్ కూమర్ పాల్గొన్నారు.

బి.కొత్తగూడెంలో ఉచిత మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ భద్రాచలం వారి ఆధ్వర్యంలో శుక్రవారం బి.కొత్తగూడెం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరానికి చుట్టు పక్కల గిరిజన గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ శిబిరానికి జ్వరపీడితులే ఎక్కువగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మందపాటి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఎస్ఎల్ కాంతారావు, జి రాజిరెడ్డి, భానుప్రసాద్, సిపిఐ నాయకులు రామిరెడ్డి, రాజారెడ్డి, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అభినవ నైజాం మోడీ

- **సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్**

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ప్రధాని మోడీ తెల్లదొరలను మించిన అభినవ నైజాం అని మతోన్మాద బీజేపీ విధానాలకు ఘోరీ కడదామని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్మవరం, గంగోలు గ్రామాలలో వీరతెలంగాణ సాయుధ పోరాట 76వ వార్షికోత్సవ సభను సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు మర్మం చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా కొమరం భీం చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శ్రీధర్ మాట్లాడుతూ.. నిజాం సంస్థానం భారతదేశంలో కమ్యూనిస్టుల సాయుధ పోరాటంతోనే విలీనం అయిందన్నారు. బీజేపీ పార్టీ మత కోణంలో చరిత్రను సెప్టెంబర్ 17ని విముక్తి పేరుతో వక్రీకరిస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని అన్నారు. ఈ వార్షికోత్సవ సభలలో సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులు కారం బజారు, గంగోలు గ్రామశాఖ కార్యదర్శి బిల్లపాటి రాజు, నాయకులు డేగల సుధాకర్, కుసుని నాగేశ్వరరావు, కుర్సం భీమ, వెంకటేష్, చెల్లెమ్మ, తులసి, పద్మ, రామ్మూర్తి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయండి

- **రెవెన్యూ డివిజన్ అధికారి మంగీలాల్‌కు వినతి**

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పర్ణశాల గోదావరి నది వద్ద సీతమ్మ సాగర్ వాల్ పనుల దృష్ట్యా ఈ ఏడాది గణేష్ నిమజ్జనాలకు అనుమతి లేదు అంటూ మండల అధికారులు తెలిపారని గణేష్ నిమజ్జనాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని టీడీపీ మండల అధ్యక్షులు కొమరం దామోదర్‌రావు రెవిన్యూ డివిజన్ అధికారికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన గణేష్ ఉత్సవకమిటీ వారు ప్రతి ఏడు గణేష్ నవరాత్రుల అనంతరం గణేష్ నిమజ్జనాలు పవిత్ర పర్ణశాల గోదావరిలో నిర్వహించేవారని ఆయన దృష్టికి తీసుకు వెళ్లారు. ప్రత్యామ్నాయంగా సీతానగరం గ్రామ సమీపంలోని చిన్నగుబ్బలమంగి వాగు, తాలిపేరు రిజర్వాయర్, పైడాకుల మడుగు గ్రామంలో గల చిన్నగుబ్బలమంగి రిజర్వాయర్‌లో గణేష్ నిమజ్జనాలు నిర్వహించుకునే తగు ఏర్పాట్లు చేయాలని ఆయనకు విన్న వించారు. వినతి పత్రం అందజేసిన వారిలో నల్లపరాజు నీలాద్రివర్మ, రామచంద్రరాజు తదితరులు ఉన్నారు.

రుణ మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు

- **పీఏసీఎస్ అధ్యక్షులు కిలిమి ఎల్లా రెడ్డి**

నవతెలంగాణ-దుమ్ముగూడెం

రుణ మాఫీ అయిన రైతులకు తిరిగి కొత్త ఇస్తున్నట్లు దుమ్ముగూడెం పిఏసిఎస్ అధ్యక్షులు కిలిమి ఎల్లా రెడ్డి అన్నారు. శుక్రవారం దుమ్ముగూడెం పిఏసిఎస్ కార్యాలయంలో రుణ మాఫీ అయిన రైతులకు కొత్త రుణాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు యలమంచి శ్రీనివాసరావు(శ్రీనుబాబు) సీఈఓ యు ముత్తయ్యతో పాటు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

5వ రోజుకు చేరిన అంగన్వాడీల సమ్మె

నవతెలంగాణ-ఇల్లందు

సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారు కార్యాలయంలో ఎదుట అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 5వ రోజుకు చేరుకుంది. ఈ శిబిరాన్ని సీఐటీయు, ఏఐటియుసి నేతలు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి సమ్మె ను ఉద్దేశించి మాట్లాడారు.

అన్నపురెడ్డిపల్లి : అన్నపురెడ్డివల్లిలో అంగన్వాడీల దీక్షలకు ఎఐటియుసి యూనియన్ మద్దతు తెలిపారు.

కండ్లకు కంతలు కట్టుకుని అంగన్వాడీలు నిరసన

దుమ్ముగూడెం : నిరధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీలు కండ్లకు కంతలు కట్టుకుని వినూత్న రీతిలో ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొర్సా చిలకమ్మ, కమలాదేవి, గజలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com

బీఆర్‌ఎస్, బీజేపీ ఇద్దరూ తోడు దొంగలు

- ప్రజలు కేసీఆర్...మోదీనీ బంగాళాఖాతంలో కలపడం ఖాయం
- టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ

నవతెలంగాణ-కొత్తగూడెం



బీఆర్‌ఎస్, బిజేపి ఇద్దరు తోడు దొంగలని, ప్రజలు కేసీఆర్ పాలన, మోదీనీ బంగాళాఖాతంలో కలపడం ఖాయమని టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గం పాత కొత్తగూడెం నందు 4, 5, వార్డుల్లో వీరస్వామి, రాజు ఏర్పాటు చేసిన గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఎడవల్లి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షులు రాయల శాంతయ్యా, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గాయమైన అభ్యర్థికి చికిత్స...పోలీసుల తీరుపై అభినందనలు

నవతెలంగాణ-కొత్తగూడెం



టెట్ పరీక్ష సందర్భంగా పరీక్షా కేంద్రానికి వచ్చిన మహిళా అభ్యర్థికి ప్రమాదరీత్య చేతికి తీవ్రమైన గాయమైంది. పరీక్షా కేంద్రం వద్ద డ్యూటీలో ఉన్న పట్టణ వన్ టౌన్ సిఐ కరుణాకర్ ఆమెకు చికిత్స చేయించారు. పోలీసుల తీరు పట్ల అ బి . న ం ద ` న ల ు వెల్లువెత్తాయి.....కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టెట్ పరీక్ష రాయడానికి వచ్చిన మహిళా అభ్యర్థిని చేతికి గాయం కావడంతో కొత్తగూడెం వన్ టౌన్ సిఐ కరుణాకర్ స్పందించారు. గాయపడిన మహిళా అభ్యర్థిని స్వయంగా ఆసుపత్రికి తీసుకువెళ్లి చేతికి కట్టు కట్టించి, ఇన్ టైంలో పరీక్ష రాసే విధంగా సహకరించారు. ఇది పరీక్ష రాయడానికి వచ్చి అభ్యర్థులు గమనించి సిఐ కరుణాకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

11 రోజుల పాటు శ్రీగణపతి నవరాత్ర బ్రహ్మోత్సవాలు

- విలేకర్ల సమావేశంలో ఆలయ ఈఓ కె.సులోచన

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం పట్టణ నడి బొడ్డున ఉన్న శ్రీ విజయవిశ్వేశ్వర దేవాలయంలో ఈనెల 18 నుండి 28 వరకు 11 రోజుల పాటు శ్రీగణపతి నవరాత్ర బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ కె.సులోచన తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నామని, రంగు రంగుల విద్యుత్ దీపాలు, ఆలయానికి రంగులు, తోరణాలు ఏర్పాటు చేయించామని, ఇప్పటికే నూతశోభ సంతరించుకుందని చెప్పారు.

సీఎం సహాయ నిధి పేదల పాలిట వరం

మణుగూరు : సీఎం సహాయనిధి పేదల పాలట వరమని రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. శుక్రవారం 60 వేల రూపాయల విలువ గల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు. నిరుపేద కుటుంబాల వైద్య ఖర్చుల నిమిత్తం అప్పులు చేసి అనేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నగదు మంజూరు చేసి భరోసా కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో లెనిన్, పి సాయి, తదితరులు పాల్గొన్నారు.

రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో లిఖించబడింది

- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాష

మణుగూరు : తెలంగాణసాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో లిఖించబడిందని సిపిఐ జిల్లా కార్యదర్శి అన్నారు. శుక్రవారం వారోత్సవాలలో భాగంగా మణుగూరు కార్యాలయంలో కార్యాలయంలో జెండావిష్కరణ, అమరుల స్థూపానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం కార్యాలయంలో జంగం మోహన్ రావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎస్కే సాబీర్ భాష హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య చారి, జిల్లా కార్యవర్గ సభ్యులు మున్నా లక్ష్మీకుమారి, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదాలకు సంబంధిత అధికారులను ప్రాసిక్యూట్ చేయాలి

- డీఎస్పీకి ఫిర్యాదు చేసిన టీపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తరుచూ జరుగుతున్న ప్రమాదాలకు సంబంధిత అధికారులను ప్రాసిక్యూట్ చేయాలని టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తగూడెం డిఎస్పీకి రెహమాన్‌కు కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ కొత్తగూడెం రైల్వే అండర్ బిడ్జి దగ్గర అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బుధవారం రాత్రి జరిగిన ప్రమాదాంలో ఇద్దరు మరణించడం చాలా బాధాకరం అన్నారు. గతంలో అండర్ బ్రిడ్జి వద్ద చాలా ప్రమాదాలు జరిగిన విషయాన్ని గుర్తుచేశారు. స్పందించిన డిఎస్పీ సంబంధిత నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి-బ్లాక్ అధ్యక్షులు రాయల శాంతయ్యా, బొమ్మిడి మల్లికార్జున్, నూకల రంగారావు, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, కొప్పుల రమేష్, కోటిష్ నాయక్, శనగ లక్ష్మణ్, నరేష్, మలోత్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మిలిటెంట్ పోరాటాలకు అంగన్వాడీలు సిద్ధం కావాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్

నవతెలంగాణ-పాల్వంచ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చెయ్యకుండా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై నిర్బంధ కాండ విధిస్తూ అధికారులతో అంగన్వాడీ కేంద్రాలు తాళాలు పగలు కొట్టే నీతి మాలిన చర్యలకు ఉసిగొల్పుతున్నదని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ ఆరోపించారు. శుక్రవారం కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న సమ్మె శిబిరంలో మాట్లాడుతూ 48 ఏళ్లుగా గౌరవ వేతనం తో ఐసీడీఎస్‌లో శ్రమ దోపిడీ చేస్తూ చాలి చాలని వేతనం ఇస్తూ ప్రభుత్వాలు నష్ట పర్చుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జమలయ్య, మల్లికార్జున్, అంగన్వాడీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గోనె మణి, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ, విజయ, సునీత, భారతి, శ్రీలత, రూప, తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట : అంగన్వాడీలు వారి సమస్యలు పరిష్కారం కోసం నిర్వహిస్తున్న సమ్మెకు ఆమ్ ఆద్మీ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని జిల్లా అధ్యక్షులు సీపీ దొర ప్రకటించారు. సమ్మె శుక్రవారం నాటికి ఐదో రోజుకు చేరిన సందర్భంగా ఆయన శిబిరం వద్దకు చేరుకుని వారికి భరోసా గా మాట్లాడారు.

అంగన్వాడీ డిమాండ్లను నెరవేర్చండి

పాల్వంచ : అంగన్ వాడీ ఉద్యోగులను రెగ్యులర్ చేసి కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని నెల రోజుల ముందే సమ్మె నోటీస్ ఇచ్చినా సమస్య పరిష్కరించకుండా అధికారులు బెదిరింపులకు పాల్పడటం,తాళాలు పగలగొట్టడం ఏంటని టీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలో అంగన్ వాడీలు చేపట్టిన ఐదవ రోజు సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కోళ్ళపూడి ప్రవీణ్ కుమార్, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు కేతిని కుమారి పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకోండి

- మైనారిటీ జిల్లా అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా

నవతెలంగాణ-పాల్వంచ

కేంద్ర ప్రభుత్వం తల్లి లేదా తండ్రి మరణించిన అనాథ పిల్లలకు ప్రవేశపెట్టిన "మిషన్ వాత్సల్య" పథకానికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ అధ్యక్షులు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకొనే విద్యార్థులకు నెలకు 4వేల చొప్పున వారి ఖాతాలో జమ చేస్తారని చెప్పారు. ఈ యొక్క పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు గాను గ్రామీణ ప్రాంతాలవారికి రూ. 72000/- పట్టణ ప్రాంతానికి చెందిన వారికి రూ.96000/- లోపు తహసీల్దార్ కార్యాలయం ద్వారా పొందిన ఆదాయ ధృవీకరణ పత్రం, విద్యార్థి బ్యాంక్ పాస్ పుస్తకం, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికేట్, తల్లి లేదా తండ్రి మరణించిన ధృవీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో, కళాశాలల్లో చదువుతున్న 18 యేండ్ల లోపు విద్యార్థులు ఈ పథకానికి అర్హులు అని పేర్కొన్నారు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి గడువు తేదీ అనేది ఉండదని అన్నారు. సంబంధిత ధృవీకరణ పత్రాలతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని రూమ్ నెంబర్, యస్ 21 లో అందచెయ్యాలని అన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డు హర్షనీయం



- కలెక్టర్ డాక్టర్ ప్రియాంక

నవతెలంగాణ-పాల్వంచ

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ములకలపల్లి, పూసుగూడెం గ్రామ పంచాయతీ రాష్ట్ర స్థాయిలో పురస్కారం సాధించడం పట్ల కలెక్టర్ డాక్టర్ ప్రియాంక హర్షం వ్యక్తం చేశారు. గురువారం రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు నుండి అవార్డు స్వీకరించిన అధికారులు, సర్పంచ్ లను శుక్రవారం ఐడిఓసిలో కలెక్టర్ సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్నారని కలెక్టర్ చెప్పారు. పూసుగూడెం గ్రామ పంచాయతీ ఓడీఎఫ్ ప్లస్ సాధించుట, విలేజ్ సెల్ఫ్ అసెస్ మెంట్ పక్కాగా చేయడం ద్వారా రాష్ట్రస్థాయిలో అవార్డు సాదించినట్లు చెప్పారు. ఇంకుడు గుంతల నిర్మాణం, నిర్వహణ, డంపింగ్ యార్డు నిర్వహణ, శ్మశానవాటిక నిర్మాణం, నిర్వహణ, గ్రామ పరిశుభ్రం, సీసీ రోడ్ల నిర్మాణం, గ్రామంలో పచ్చదనం పెంచడానికి మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు బావున్నాయని, బాగా చేస్తున్నారని అభినందించారు. సర్పంచ్, కార్యదర్శి సమన్వయంతో గ్రామ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. అవార్డుల ప్రదానం కార్యక్రమంలో డిఆర్డీఓ మధుసూదన్ రాజు, డిపిఓ రమాకాంత్, జడ్పి సీఈఓ విద్యాలత, ఎంపిడిఓ శ్రీనివాస్, ఎంపిఓ లక్ష్మయ్య, సర్పంచ్ బాణోత్ విజయ, కార్యదర్శి శ్రీను అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మధుసూధన్ రాజు, డీపీఓ రమాకాంత్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపిఓ లక్ష్మయ్య, సర్పంచ్ విజయ, కార్యదర్శి శ్రీను, స్వచ్ఛ భారత్ మిషన్ సిబ్బంది రేవతి, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సమస్యల పరిష్కారానికి సింగరేణి తమ వంతు సహకారం

- ఏరియా జీఎం దుర్గం రామచందర్

నవతెలంగాణ-మణుగూరు

మాజీ సింగరేణీయుల సీఎం పిఎఫ్ సమస్యల పరిష్కారానికి సింగరేణి తమ వంతు సహకారం అందిస్తుందని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచంద్ర అన్నారు. శుక్రవారం పివి కాలనీ కమ్యూనిటీ హాల్ నందు ఏరియా సింగరేణి యాజమాన్యం సహకారంతో సిఎంపీఎఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో పెన్షన్ అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే సిఎంపిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కనకమ్మ, బృందం పాల్గొంది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ పదవీ విరమణ చేసి ప్రతి నెల పెన్షన్ కోసం ఎదురుచూసి లబ్ధిదారులకు సౌకర్యవంతమైన సేవలు అందించడమే సింగరేణి భవిష్య నిధి కార్యాలయ సిబ్బంది లక్ష్యం కావాలని అన్నారు. పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులకు బాసటగా నిలిచేది పెన్షన్, వయసు ప్రభావం కావచ్చు, పెన్షన్ పై సరైన అవగాహన లేని కారణం కావచ్చు లేదా దూర ప్రాంతాలలో నివాసముంటున్న పెన్షన్ దారులకు సకాలంలో సమాచారం తెలియకపోవచ్చు అన్నారు. ఈ పై కారుణాల వల్ల నిబంధనల ప్రకారం సమయానికి కొన్ని ధ్రువీకరణ పత్రాలు అందించలేని విశ్రాంతి ఉద్యోగులకు ఇబ్బంది కలుగకుండా మానవతా దృక్పథంతో కూడా వ్యవహరించాలని అన్నారు. అనంతరం కొత్తగూడెం సీఎంపీఎఫ్ కార్యాలయ సహాయ కమిషనర్ ఎం.కనకమ్మ మాట్లాడుతూ జీఎం సూచనల పట్ల సానుకూలంగా స్పందిస్తూ సిఎంపిఎఫ్ లబ్దిదారుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు తగు చర్యలు చేపడతామని సభలో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్.ఓటు జి ఎం వీసం



కృష్ణయ్య, డిజిఎం(పర్సనల్) ఏరియా అధికార ప్రతినిధి ఎస్. రమేష్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస రావు, ఎండి మదార్ సాహెబ్, సంక్షేమ అధికారి నరేష్, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు అరెస్టు చాలా బాధాకరం

- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మనమా వెంకటేశ్వర రావు

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం జాతీయ నాయకులు నారా చంద్రబాబు నాయుడుని సీఐడి పోలీసులు అరెస్టు చేయడం బాధాకరమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని కొత్తగూడెం బీఆర్ఎస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కొత్తగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేరు ఎఫ్ఐఆర్‌లో లేకుండానే సీఐడి పోలీసులు అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఇది పూర్తిగా రాజకీయ వ్యక్తిగత కక్షల కారణంగానే అరెస్టు జరిగినట్టు అభివర్ణించారు. ముందస్తుగా సిఐడి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ఎలాంటి విచారణ చేయకుండా అరెస్టు చేయడం సరైంది కాదన్నారు. రాజకీయాలను.. రాజకీయంగానే ఎదుర్కోవాలి



తప్పా... వ్యక్తిగతంగా, మానసికంగా శోభకు గురి చేయడం సరికాదని సూచించారు. వ్యక్తిగత విమర్శలు రాజకీయాలకు తగవని హితవు పలికారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా రాష్ట్ర అభివృద్ధికి పని చేసిన మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేస్తున్నతీరు కేంద్రం అనుమతి లేకుండా కాదని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేంద్రం అనుమతి లేకుండా చేశారంటే నమ్మబుద్ధి కావడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. కచ్చితంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వ హస్తం ఉందని ఆరోపించారు. ఆంధ్ర రాజకీయాలు బిజేపీ పాలకపక్షం కలిసి, ప్రతిపక్షాన్ని ఆడుకుంటుందని విమర్శించారు. ప్రజల మద్దతుతో అధికారంలోకి రావాలి... ప్రజలిచ్చిన అవకాశాన్ని బట్టి ప్రజలకు సేవలు అందించాలి అని సూచించారు. అంతేగాని అధికారంలో ఉన్నామని వ్యతిరేకుల మీద, ప్రతిపక్ష నాయకుల మీద అణచి వేత ధోరణి అవలంబించడం సరైన పద్ధతి కాదని ఉద్ఘటించారు. చంద్రబాబు నాయుడు అరెస్టుకు పూర్తి బాధ్యత అధికారులే వహించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, చుంచుపల్లి, లక్ష్మీదేవి పల్లి ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోనా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యా రాంబాబు, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి జేవిఎస్. చౌదరి, ఉర్దూగర్ చైర్మన్ అన్వర్ పాష పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై సత్వర చర్యలు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.జివిఎల్ శిరీష
- ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా డెంగ్యూ పరీక్షలు
- అత్యవసర సేవలకు టోల్ ఫ్రీ నెంబర్ 7396602959

నవతెలంగాణ-పాల్వంచ

డెంగ్యూ వ్యాధిపై సత్వర చర్యలు చేపడుతున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జివిఎల్ శిరీష అన్నారు. శుక్రవారం ప్రకటనలో తెలుపుతూ ప్రజలు అపరిశుభ్రమైన వాతావరణం ఇండ్ల లోపల బయట నీరు నిల్వ ఉండటం వాడి పారేసిన పాత సామాన్లు, టైర్లు, కూలర్లు, పూల కుండీల్లో నీరు చేరడంతో డెంగ్యూ దోమలు పెరుగుతాయన్నారు. దీంతో డెంగ్యూ వ్యాధి సోకుతుందన్నారు. 104 తీవ్రమైన జ్వరం, కళ్ళు ఎర్రబడటం, తలనొప్పి, కనుగుడ్లు నొప్పి ఉండటం చర్మంపై ఎర్రని దద్దుర్లు, వ్యాధి తీవ్రమైనప్పుడు కళ్ళు నుండి రక్తం కారడం మెదడు లోపల రక్తస్రావం జరుగుతుందని తెలిపారు. డెంగ్యూ నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా చికిత్స చేపడుతుందని తెలిపారు. రోగి ప్లేట్లెట్స్ సంఖ్య తగ్గినంత మాత్రాన డెంగ్యూ అని అపోహ చెందవద్దని ప్రతి జ్వరంలోనూ ప్లేట్లెట్స్ సంఖ్య తగ్గుతుందన్న విషయాన్ని అందరూ గమనించాలన్నారు. ప్రయివేట్ ల్యాబ్ లలో చేసే రాపిడ్ టెస్ట్‌లు డెంగ్యూ వ్యాధిని కచ్చితంగా నిర్ధారించలేవని ఎన్ఎస్ఐ పాజిటివ్ వచ్చినంత మాత్రాన అది డెంగ్యూ అని భయపడకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో మాకు ఎలిసా టెస్ట్



చేయించుకుని నిర్ధరించుకోవాలన్నారు. ప్రజలందరూ జ్వరం అని అనుమానించిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి ఇచ్చి పరీక్షలు చేయించుకోవాలని, అదేవిధంగా అత్యవసర సేవల కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 7396602959 ప్రోగ్రాం ఆఫీసర్ మలేరియాకు సంప్రదించాలని తెలిపారు.

చంద్రబాబు నాయుడు అరెస్ట్ అక్రమం

- ఏపీ ప్రభుత్వ సిగ్గుచేటు చర్య : ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ-దమ్మపేట

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టు అక్రమమని, ఏపీ ప్రభుత్వం సీఐడీని తన అదుపులో ఉంచుకుని లేనిపోని కేసులు బనాయించి అరెస్టు చేయటం ఏపీ ప్రభుత్వ సిగ్గుచేటు చర్యగా అశ్వరావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం దమ్మపేట మండలం తాటి సుబ్బన్న గూడెంలోని ఎమ్మెల్యే నివాసంలో మెచ్చా మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పట్ల ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు పద్ధతి సరిగా లేదని ఉమ్మడి రాష్ట్రంలో ప్రస్తుతం తెలంగాణ ఏపీ గా ఉన్న రెండు రాష్ట్రాల్లో



చంద్రబాబు నాయుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని తెలిపారు. తనకు గత 30 సంవత్సరాలుగా చంద్రబాబు నాయుడుతో సాన్నిహిత్యం ఉందని ఆయన చిల్లరరాజకీయాలు చేయరు రాజకీయాల్లో చంద్రబాబు నాయుడు హుందాగా ఉంటారని అన్నారు. చంద్రబాబు నాయుడుకు జరగరానిది ఏదైనా జరిగితే ఏపీ ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోవడం తప్పదని తెలిపారు. తాను ఒక ఎమ్మెల్యేగా చంద్రబాబు నాయుడు అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నానని స్పష్టం చేశారు.

అంగన్వాడీల న్యాయమైన కోరికలను ప్రభుత్వం నెరవేర్చాలి...

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ భాష

నవతెలంగాణ-అశ్వాపురం :

అంగన్వాడి టీచర్స్ ,వెల్ ఫర్ ల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె షాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో అంగన్వాడీలు చేపడుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీలు గత కొన్ని దశాబ్దాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని వారికి కనీస వేతనంగా నెలకు 26000 ఇచ్చి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అలాగే వారికి పిఎఫ్ ఈఎస్ఐ, పెన్షన్ స్కీం సౌకర్యాలను కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కమటం వెంకటేశ్వరరావు రాయపూడి రాజేష్, శ్రీకాంత్ అంగన్వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

లచ్చిగూడెంలో ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-దుమ్ముగూడెం

దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లచ్చిగూడెం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి పుల్లారెడ్డి ఆద్వర్యంలో నిర్వహించిన వైద్య శిభిరంలో 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేసినట్లు వైద్యాధికారి తెలిపారు. వీరిలో నలుగురు జ్వరపీడితులకు రక్తపూత నమూనాలు సేకరించి ఆర్.టీ.డి చేయగా నెగటివ్‌గా నిర్ధారణ అయినట్లు తెలిపారు. అనంతరం గ్రామంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించి సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. డెంగ్యూ టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు సోకకుండా ప్రతి ఒక్కరు దోమ తెరలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్చార్చిన నీటిని తాగాలను గ్రామస్తులను తెలియజేశారు. వైద్య శిభిరంలో హెల్త్ సూపర్వైజర్ సాగర్, హెల్త్ అసిస్టెంట్ చలపతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు..

హామీలు అమలు చేయాలి

- సంయుక్త కిసాన్ మోర్చా ఎస్‌కేఎం

నవతెలంగాణ-టేకులపల్లి

కేంద్ర ప్రభుత్వం రైతు సమస్యలపై రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస మద్దతు ధర చట్టం చేయాలని, విద్యుత్ సవరణ బిల్లు 2020ను రద్దు చేయాలని, రైతుల రుణాలను మాఫీ చేయాలని, రుణ విమోచన చట్టం చేయాలని, రైతులకు అనుకూలంగా పసల్ భీమా పథకాన్ని మార్చాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని, తెలియజేస్తూ రాబోయే రోజుల్లో రైతులకు సంఘటితంగా ఉధృతం చేస్తామనిరైతు ఎస్కెఎం జిల్లా కన్వీనర్ బానోత్ ఉక్ల నాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మార్కెట్ కమిటీ యార్డ్ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సుతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గుగులోతు రామచందర్, రైతు నాయకులు భూక్య హార్జ, మండల నాయకులు వీర బ్రహ్మాచారి, జరపల.సుందర్, ఈసం నరసింహారావు, కే వీరన్న, శ్రీను వాసం భద్రయ్య, నర్సింగ్ పాల్గొన్నారు.

ఐటీఐలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరు ప్రభుత్వ ఐటిఐలో స్పాట్ అడ్మిషన్ల కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ బడుగు ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 20వ తేదీ ఉదయం 11 గంటల లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని స్థానిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటికే సీటు కేటాయించిన వారికి ఈ అవకాశం ఉండదన్నారు.

సీఎంపీఎఫ్ జమ వివరాల పాస్ బుక్కులు అందజేయాలి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సీఎం పీఎఫ్ జమ వివరాల పాస్ బుక్కులు అందజేయాలని శుక్రవారం ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో సీఎం పిఎఫ్ కమిషనర్ కనకమ్మకి వినతి పత్రం అందజేశారు. పివి కాలనీ కమ్యూనిటీ హాల్‌లో సీఎం పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కనకమ్మకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్‌డి నాసర్ పాషా మాట్లాడుతూ 2020 -21 వార్షిక సివిల్, పర్చేజ్, పార్కులు, గెస్ట్ హౌసులు, స్టోర్స్, మ్యాక్స్ సొసైటీ ఇలా ఇంకా కొంతమంది కాంటాక్ట్ కార్మికులకు సీఎంపిఎఫ్ పాస్ బుక్కుల వివరాలు అందజేయాల్సి ఉందన్నారు. అదేవిధంగా 2021- 22, 2022-23 రెండు సంవత్సరాల వార్షిక జమ వివరాలతో కూడిన పిఎఫ్ పాసుబుక్కులు కూడా త్వరగతిన పూర్తి చేసి అందజేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.మంగీలాల్, కా బి.హాథిరామ్, కే.నాగేశ్వరరావు ఐ.గోపి, ఎస్.భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

- రెండో రోజు కొనసాగుతున్న దీక్షలు

నవతెలంగాణ-మణుగూరు

ఎస్సీ 59 కులాల రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ప్రస్తుత అత్యవసర పార్లమెంటు సమావేశాల్లో సందర్భంగా రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్న ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు ఈ దీక్షలను తెలంగాణ బీసీ సంఘ నాయకులు చంద్రమౌళి, ఎంఆర్పిఎస్ మండల నాయకులు మంద కృష్ణ మాదిగ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు అర్ర కనకయ్య మాదిగ మాట్లాడారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము హుస్సేన్ మాదిగ, బోయిల్లా నరసింహారావు మాదిగ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ పరిసరాల్లో ఆకస్మిక తనిఖీలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం



దుమ్ముగూడెం పోలీస్ స్టేషన్ పరిసర గ్రామాలతో పాటు లక్ష్మీనగరంలో గ్రామంలో శుక్రవారం ఉదయం ఎస్సై పడాల కేశవరావు సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో ఉంటున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక శక్తులు, కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దని సూచించారు. ఎవరైనా అనుమానితులు సంచరిస్తే స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తనిఖీలలో హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, హనుమంతు, కానిస్టేబుల్ పృథ్వీ సీఆర్పిఎఫ్ సిబ్బంది ఉన్నారు.

వీర తెలంగాణ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) ఇంటింటికీ ప్రచారం


నవతెలంగాణ-భద్రాచలం

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 17న జరిగే సభ జయప్రదం కావాలని జగదీష్ కాలనీలో విస్తృత ప్రచారం నిర్వహించారు. జోన్ కన్వీనర్ రత్నం అధ్యక్షతన సభను నిర్వహించారు. వీరనారి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకురాలు కె. సత్య, జిల్లా నాయకురాలు లక్ష్మీ, శాఖ సెక్రెటరీ నాగమణి, శాఖ సభ్యురాలు ఉమాదేవి, రాజేశ్వరి,మంగ, షకీరా, శాంత, దర్గాబీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో జయాపజయాలతో వ్యక్తిత్వం పెంపొందుతుంది

- ఎస్ఐ శ్రీకాంత్

నవతెలంగాణ-అశ్వారావుపేట



జీవితంలోని ప్రతి విభాగంలోనూ జయాపజయాలు ఉన్నట్లే క్రీడల్లోనూ విజయంతో పాటు అపజయాలను సమంగా స్వీకరించినప్పుడే ప్రతి ఒక్కరిలోనూ రెట్టింపు ఉత్సాహం తోడౌతుందని ఎస్.ఐ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆట పాటలతో కూడిన విద్య ఆరోగ్యంతో పాటు ఉన్నతమైన స్థితిని కల్పిస్తుందన్నారు. శుక్రవారం పాఠశాలల మండల స్థాయి ఆటలు పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలకు స్థానిక ఎస్.ఐ శ్రీకాంత్ హాజరై క్రీడలను ప్రారంభించారు. అనంతరం అండర్ 14, 17 బాలికల విభాగాలలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ తో పాటు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 205 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులను ఈ నెల 22 న స్థానిక వ్యవసాయ కళాశాలలో జరిగే అశ్వారావుపేట, దమ్మపేట మండలాల స్థాయి పోటీలలో పాల్గొంటారని పోటీల నిర్వాహకులు బి.స్రుజన తెలిపారు. ఈ కార్యక్రమానికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సీ.హెచ్ నర్సింహారావు, బాలికల పాఠశాల హెచ్.ఎంసి.హెచ్ వెంకయ్యలతో పాటు పి.డీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం
శనివారం | సెప్టెంబర్ 16, 2023 | www.navatelangana.com

అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి కేసీఆర్

బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

అభివృద్ధి సంక్షేమాలను సమాంతరంగా అందించి దేశంలోని రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపిన ముఖ్యమంత్రి కెసిఆర్ అభివృద్ధి ప్రదాత అని బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కణితి రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మీ అన్నారు. దుమ్ముగూడెం మండల అభివృద్ధి కోసం ఎస్‌డిఎఫ్ నిధులు రూ.1 కోటీ 50 లక్షల రూపాయలు మంజూరు చేసిన సందర్భంగా శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీనగరం మండల పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు. నిధులు మంజూరు కోసం కృషి చేసిన మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణకు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి జానీపాషా, ఉపాధ్యక్షులు తునికి కామేష్, కార్యదర్శులు కెల్లా శేఖర్, కణితి లక్ష్మణ్, జయసింహ, పర్ణశాల ఎంపిటిసి తెల్లం భీమరాజు, సర్పంచ్‌లు తెల్లం రామకృష్ణ, సోడి కొండయ్య, బొల్లి శేఖర్, కొత్తూరి సీతారామారావు, అల్లాడి వెంకటేష్, పూర్ణయ్య, కృష్ణ, శ్రీను, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన గుడిసెలకు గృహలక్ష్మి ఇవ్వాలి

నవతెలంగాణ-దుమ్ముగూడెం.

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తూరుబాక గ్రామానికి చెందిన మోత్కూరి సుమన్, పోసారపు దేవరాజ్‌లకు చెందిన పూరి గుడిసెలు కూలీ పోయయాని వారికి ప్రభుత్వం గృహలక్ష్మీ పథకం ద్వారా పక్కా ఇండ్లు మంజూరు చేయాలని తూరుబాక జోన్ కన్వీనర్ బొల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ(ఎం) బృందం కూలిన ఇండ్లను పరిశీలించింది. గృహ లక్ష్మీ పథకం ద్వారా పక్కా ఇళ్లు మంజూరు చేయాలన్నారు. ఇండ్లను పరిశీలించిన వారిలో శాఖా కార్యదర్శి కుమ్మరికుంట సాంబశివరావు, నాయకులు బిల్లా ముత్యాలరావు, గంపనాగిరెడ్డి, పృథ్వీ తదితరులు ఉన్నారు.

కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్స్‌కు సత్కారం

నవతెలంగాణ-పాల్వంచ



ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని కేటీపీఎస్ చీఫ్ ఇంజనీర్స్ 7వ దశ పాలకుర్తి వెంకటేశ్వరరావు, 5, 6 దశలు మేక ప్రభాకరరావును (హెచ్-142) యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి రామారావు ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించి పూల బొకేలను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపటి వెంకటేశ్వర్లు, షేక్ సయ్యేద్, ఎం శివరాం, బి సుమన్, గోపయ్య కోటేశ్వరరావు, పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్ఏ కృషి ఫలితం

2వేల కుటుంబాలకు గృహలక్ష్మి పథకం మంజూరు

నవతెలంగాణ-ఇల్లందు



ఎంఎల్ఏ హరిప్రియ కృషి ఫలితంగా నియోజకవర్గంలో 2000 కుటుంబాల గిరిజనేతురులకు గృహలక్ష్మి పథకం మంజూరైంది. ఈ మేరకు సీఎం కేసీఆర్ కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే హరిప్రియ శుక్రవారం ప్రగతి భవన్లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నాన్ ట్రైబ్స్, గిరిజనేతురులకు 2000 కుటుంబాలకు గృహలక్ష్మి పథకం మంజూరు చేయవలసిందిగా ముఖ్యమంత్రి కోరగా వెంటనే రాష్ట్ర సానుకూలంగా స్పందించి తక్షణమే ఎమ్మెల్యే హరిప్రియ హరి సింగ్ నాయక్ అభ్యర్థనను అమలు చేయవలసిందిగా జిల్లా కలెక్టర్‌కు వెంటనే ఆదేశం ఇచ్చినట్లు ఎంఎల్ఏ హరిప్రియ తెలిపారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలిపారు.

ప్రశాంతంగా టెట్

92.04 శాతం అభ్యర్థుల హాజరు

కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-పాల్వంచ

ఉపాధ్యాయ అర్హతకు నిర్వహించిన టెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు కలెక్టర్ ప్రియాంక అల చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 92.04శాతం అభ్యర్థులు హాజరైనట్లు చెప్పారు. జిల్లాలో పరీక్ష నిర్వహణకు 37 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మొదటి పేపర్ కు 8717, రెండో పేపర్ కు 6661 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా మొదటి పేపర్ కు 7307 మంది హాజరు కాగా 1410 మంది గైర్హాజరయినట్లు చెప్పారు. అలాగే రెండో పేపర్ కు 6661 మంది హాజరుకావాల్సి ఉండగా 6131 మంది హాజరయ్యారని, 530 మంది గైర్హాజరయినట్లు చెప్పారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల లక్ష్మీదేవిపల్లి మండలం, కృష్ణ వేణి జూనియర్ కళాశాలలో టెట్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని



ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్ష సజావుగా, సక్రమంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంతంగా నిర్వహించుటలో భాగస్వాములైన సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు యంత్రాంగపు సలహాలు, సూచనలు పాటించి ప్రశాంతంగా వ్రాయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో 37 కేంద్రాలలో పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. మొదటి పేపర్ ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, రెండో పేపర్ 2.30 నుంచి 5 గంటల వరకు నిర్వహించడం జరిగిందని చెప్పారు. మొదటి పేపర్‌కు 37 కేంద్రాలు, రెండో పేపర్‌కు 29 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల హాజరు వివరాలను చీఫ్ సూపరింటెండెంట్ ను అడిగి తెలుసు కున్నారు.

ప్రశాంతంగా టెట్ పరీక్షలు

నవతెలంగాణ-మణుగూరు

మణుగూరులో టెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. శుక్రవారం ఎనిమిది పరీక్ష కేంద్రాలలో టెట్ నిర్వహించారు. మొత్తం 1920 విద్యార్థులకు గాను 234 మంది గైరాజరయ్యారు. మండల విద్యాధికారి వీరస్వామి, తాసిల్దార్ నాగిరెడ్డి, సిఐ బాలాజీ వరప్రసాద్, ఎస్సైలు శ్రీనివాస్ రాజ్ కుమార్ లు పర్యవేక్షించారు. మణుగూరు పట్టణంలోని జిరాక్స్ సెంటర్లు నెట్ సెంటర్లను మూసివేశారు మొదటి పేపర్ అనంతరం విద్యార్థులకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో కొన్ని సెంటర్లలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దళిత బంధు పథకంలో అవినీతి



పైరవీలకే పరిమితమైన ప్రభుత్వ పథకాలు

ధర్నాలో జెడ్పీ చైర్మెన్ కోరం

నవతెలంగాణ-ఇల్లందు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు, బీసీ, మైనారిటీ బంధులతో పాటుగా గృహలక్ష్మి పథకాల్లో అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల కనుసన్నలతోనే భారీగా అవినీతి జరిగిందని మాజీ ఎమ్మెల్యే జిల్లా పరిషత్ చైర్మెన్ కోరం కనకయ్య ఆరోపించారు. పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన దళిత, బీ.సీ, మైనార్టీ, గృహలక్ష్మి పతకాలపై తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ఎలాగైనా మూడోసారి అధికారం చేపట్టాలనే మోసపూరిత వ్యూహంలో భాగంగా ప్రవేశపెట్టిన దళిత, బీసీ, మైనారిటీ, గృహలక్ష్మి పథకాల్లో నిజమైన లబ్దిదారులకు కాకుండా అధికార పార్టీ పైరవీకారులు సూచించిన వారిని లబ్దిదారులుగా ఎంపిక చేయడం వల్ల నిజమైన అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. బీ.ఆర్.ఎస్ పార్టీకి దళితులపై చిత్తశుద్ధి ఉంటే అర్హులైన వారందరికీ ఎటువంటి లాభాపేక్ష ఆశించకుండా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ప్రతీ పేదవానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, రానున్న ఎన్నికల్లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పులి సైదులు, పట్టణ ప్రధాన కార్యదర్శి మహ్మద్ జాఫర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్, బీ.సీ సెల్ అధ్యక్షుడు శంకర్, మైనారిటీ సెల్ అధ్యక్షుడు మసూద్, మున్సిపల్ కౌన్సిలర్ పత్తి స్వప్న, సీనియర్ కాంగ్రెస్ నాయకులు జీ.వీ భద్రం, మహబూబ్,ఎ ెంకట నారాయణ,కుక్కల వెంకటేశ్వర్లు,సర్పంచులు పాయం స్వాతి, కల్తీ పద్మ, పాయం లలిత, పూనెం కవిత, తాటి చుక్కమ్మ చాట్ల భాగ్యమ్మ, ఎంపీటీసీలు మండల రాము, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్, తాటి యశోద, బియ్యని రజిని, బానోత్ రోజా, ఉప సర్పంచులు తాటి రాంబాబు, కుర్ర అరుణ, ఎల్లయ్య, మండల నాయకులు గూడా బాబురావు, రామిషెట్టి పోషయ్య పాల్గొన్నారు.

విజయభేరి సభను విజయవంతం చేయండి

టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ

నవతెలంగాణ-కొత్తగూడెం

ఈనె 17న తుక్కుగూడలో జరుగు విజయభేరి సభను విజయవంతం చేయాలని టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ పిలుపు నిచ్చారు. శుక్రవారం కొత్తగూడెం రైటర్స్ బస్తీ, స్థానిక బస్టాండ్ సెంటర్ ఏరియాలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో టిపిసిసి జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ మాట్లాడారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుండి యూత్ కాంగ్రెస్ నాయకులు, ఐఎన్‌టియుసీ నాయకులు, మహిళ నాయకురాళ్లు, కాంగ్రెస్ అభిమానులు, అనుభంద సంస్థలు తుక్కుగూడ విజయభేరి సభకు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు రాయల శాంతయ్యా, కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు బొమ్మిడి మల్లికార్జున్, పాల్వంచ పట్టణ అధ్యక్షులు నూకల రంగారావు, చుంచుపల్లి మండల అధ్యక్షులు అంతోటి పాల్, లక్ష్మీదేవిపల్లి మండల యస్సీ సెల్ అధ్యక్షులు కొప్పుల రమేష్, సీనియర్ నాయకులు సుబ్బా రెడ్డి, మైనార్టీ పట్టణ అధ్యక్షురాలు జేరినా కొలిపాక సత్యనారాయణ, పట్టణ అధ్యక్షురాలు వాలీ, మాలోత్ లక్ష్మణ్, నరేష్, నాగేందర్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.



వీరతెలంగాణ పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య

నవతెలంగాణ-ములకలపల్లి

భూమి కోసం, భుక్తి కోసం వెట్టిచాకిరీ విముక్తి కోసం భారత దేశంలో గొప్పగా సాగిన వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నిజమైన వారసులు కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఒడ్డురామవరంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభలో పాల్గొని మాట్లాడుతూ ఆనాడు పేదలందరిని కూడగట్టి జమీందారులకు భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం నడిపి పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేశారు. వెట్టిచాకిరీ నుండి విముక్తి కలిగించారని మట్టి మనుషులతో మహా సంగ్రామం జరిపారని ఈనాడు ఆ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని కొన్ని రాజకీయ పార్టీలు కల్ల బొల్లి మాటలు చెబుతూ పోరాట చరిత్రను వక్రీకరిస్తూ కుల మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని అలాంటి చారిత్రక పోరాట స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పాల్గొన్నారు.

పెండింగ్ పే స్కేల్ ను వెంటనే ఇవ్వాలి

జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ముందు ఆందోళన

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన పెండింగ్ పే స్కేల్ ను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపో ముందు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. డిపో ముందు ఆందోళన చేపట్టి, పెద్దఎత్తున నినాదాలు చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా డిపో నందు జేఏసీ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కన్నా ముందుగా చేయవలసిన డిమాండ్స్ ఉన్నాయని చెప్పారు. 2017-2021 సంవత్సరానికి 'పెండింగ్ పే స్కేల్ ను వెంటనే అమలు చేయాలని, ఆర్పిఎస్-2013 ఏరియర్స్ బాండ్స్‌ను ఇప్పటి వరకు వడ్డీతో చెల్లించాలన్నారు. 2023 జనవరి, జూలై డిఏలను అమలు చేయాలన్నారు. 9డిఏల ఏరియర్స్‌ను చెల్లించాలన్నారు. సిసిఎస్‌కు చెల్లించాల్సిన డబ్బులు వడ్డీతో సహా చెల్లించాలని, చేస్తున్న రికవరీలను ప్రతినెల చెల్లించాలని, పి ఎఫ్ఎస్ ఆర్‌బిఎస్, ఎస్‌బిటిలకు బకాయిలను చెల్లించాలని, రిటైర్ అయిన కార్మికులు, ఉద్యోగుల బకాయి ఉన్న డబ్బులు వెంటనే చెల్లించాలనే తదితర డిమాండ్లపై డిపో గేట్ ముందు కార్మికులు ధర్నా చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూ నాయకులు సెక్రెటరీ వి.జాకబ్, ప్రెసిడెంట్ ఈ శామ్యూల్, బత్తుల నాగేశ్వరరావు, డిపో అసిస్టెంట్ సెక్రటరీ ఎస్‌కే. జానీమియా, ఎంప్లాయిస్ యూనియన్ సెక్రటరీ నాగేంద్ర సింగ్, గ్యారేజీ నుండి శేషుబాబు, ఇంకా గ్యారేజ్ సిబ్బంది, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

మధిర మున్సిపాలిటీలో మల్లు నందిని విస్తృత పర్యటన

నవ తెలంగాణ-మధిర

మధిర పట్టణంలో శుక్రవారం ఎంఎల్ఏ మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని విక్రమార్క పర్యటించారు. ఈ సందర్భంగా మధిర పట్టణంలో రైతు కూరగాయల మార్కెట్, సమీకృత కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. కూరగాయల మార్కెట్లో మున్సిపాలిటీ వారు కుళ్ళిన చెత్తని తీసుకు వెళ్ళటం లేదని, పరిసర ప్రాంతాల ఇళ్లవారు దుర్వాసన వస్తుందని తమ మీద కోపగిం చుకుంటున్నారని వాళ్ళ గోడు ఆమె ఎదుట విన్నవించుకున్నారు. సమీకృత కూరగాయల మార్కెట్ హడావిడిగా అసంపూర్తిగా నిర్మించి ఏదో అయిపోయిందని చేతులు దులుపుకున్నారని కనీసం మరుగుదొడ్లు నిర్మించలేదని మహిళలు తమకు బాధలు తెలియజేశారు ఈ సందర్భంగా మల్లు నందిని విక్రమార్క మాట్లాడుతూ మధిర మున్సిపాలిటీలో 100 కోట్ల రూపాయల అభివృద్ధి చేశామంటున్న బిఆర్ఎస్ పార్టీ కేవలం అది కాగితాలకే పరిమితమైందని అన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చావా వేణు, మధిర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా బాలరాజు, కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డి, మండల ఐఎన్టీయూసీ అధ్యక్షుడు కోరంపల్లి చంటి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాణావత్ వెంకటరమణ నాయక్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్, కాంగ్రెస్ నాయకులు మున్సిపాలిటీ కౌన్సిలర్ ఎర్రగుంట లక్ష్మి మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మార్పుకు పరితపించే నేత కేసీఆర్

లబ్ధిదారులకు చెక్కులు పంపణి చేసిన ఎమ్మెల్యే రాములునాయక్

నవతెలంగాణ-కారేపల్లి



ప్రజా జీవనంలో మార్పుకు పరితపించే నేత కేసీఆర్ అని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ కొనియాడారు. శుక్రవారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో తహసీల్దార్ వంకాయల సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ 52 మంది లబ్ధిదారులకు రూ.52.06 లక్షలు విలువైన చెక్‌లను 10 మంది సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు 4.13 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆరే నా దేవుడని, నాకు టికెట్ ఇవ్వలేదని బాధలేదన్నారు. కమ్యూనిస్టుల ప్రణాళిక అమలు చేసి చూపుతున్నారన్నారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేద్దామని, దానికి ప్రతి ఒక్కరు కృషిచేద్దామన్నారు. మహిళలకు చట్టసభలలో ప్రాతినిధ్యం పెరగనుందని, పార్లమెంట్‌లో మహిళా బిల్లు అమలు అయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పినపాక తప్ప అన్ని మహిళలకు రిజర్వుడు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ శకుంతల, జడ్పీటీసీ వాంకుడోత్ జగన్, సొసైటీ దుగ్గినేని శ్రీనివాస్, వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, సొసైటీ ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్, దిశ కమిటీ సభ్యులు సర్పంచ్ బాణోత్ కుమార్, సంత ఆలయ అడ్డగోడ ఐలయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

నాయకుల తీరుతో కార్యకర్తలలో అయోమయం

పాత గూటికి చేరుతున్న నాయకులు

పార్టీ వారికే కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శ

నవతెలంగాణ - ఎర్రుపాలెం



పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు తీరుతో అయోమయానికి గురవుతు న్నామనీ కార్య కర్తల విమర్శ, నా యకులు,ప్రజా ప్రతినిధులు రోజుకొక నాయకుడి మెప్పు కోసం తమ నిర్ణయాలు మార్చుకుంటూ అయోమ యానికి గురి చేస్తున్నారని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎర్రుపాలెం మండలంలో బిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన జడ్పిటిసి శీలం కవిత మొదటి నుండి మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి అనుకూల వర్గంగా పని చేస్తున్నారు.పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి బిఆర్ఎస్ పార్టీలో ప్రాధాన్యత దక్కక పోవడంతో తీవ్ర నిరాశ కు గురై కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్లాల ని నిశ్చయించుకుని మండలం నుండి తన వర్గంగా ఉ న్న ప్రజా ప్రతినిధులను నాయకులను తనతో పాటుగా కాంగ్రెస్ పార్టీలో చేర్పించారు.వారు కాంగ్రెస్ పార్టీ లో చేరిన దగ్గర నుండి పాత కాంగ్రెస్ నాయకులతో కలిసి పనిచేయక వారితో ఇమడ లేక పోతున్నారు. చాలా మంది ప్రజాప్రతినిధులు, నాయకులు,కార్యకర్తలు తిరిగి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పినా ఆయన మాట పట్టించుకోకుండానే తిరిగి పాత గూటికి చేరు కుంటున్నారు.గత కొద్ది రోజుల క్రితం రామన్నపాలెం గ్రామ పంచాయతీ సర్పంచ్ వారి అనుయాయులు తిరిగి బిఆర్ఎ స్ పార్టీలో చేరారు.ఇంకా కొంత మంది మరల సొంత గూటి వైపు పయనిస్తానికి ఎదురు చూస్తున్నారని ప్ర చారం జరుగుతుంది,బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకే తిరిగి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీకి చెందిన కొ న్ని వందల కుటుంబాలు పార్టీలో చేరినట్లు ప్రచారాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు విమర్శిస్తున్నారు.బి ఆర్ఎస్ పార్టీ నాయకుల ప్రచార తీరును కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్పు పడుతున్నారు.రానున్న రోజులలో రాజకీయాలు ఏ మరుపు తిరగనున్నాయని ప్రజలు గుసగుసలాడు కుంటున్నారు. జడ్పిటిసి శీలం కవిత ఇప్పటి వరకు అధికారికంగా కాంగ్రెస్ పార్టీలో చేరనే లేదు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గంగా ఉంటున్నారు.గురు వారం ఖమ్మం లో జరిగిన రాష్ట్ర మంత్రి హరీష్ రావు సమక్షం లో మరల బిఆర్ఎస్ పార్టీలో చేరటం చూసే వారికి రాజకీయాలంటే ఇంత జుగుప్సాకరంగా ఉంటాయా అనే భావన కలుగుతుంది.ఏది ఏమైనా రాజకీయ నాయకుల విలువలు కనుమరుగయ్యాయని ప్రజలు,ఓటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఆయిల్ పామ్ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలి : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలో ఆయిల్ పామ్ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అధికారులతో ఆయిల్ పామ్ సాగు పురోగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 2023-24 సంవత్సరంలో 11,800 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకై లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. 2021-22 నాటికి జిల్లాలో 8,067 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు ఉండగా, 2022-23 నాటికి 11,551 ఎకరాలకు చేరుకుందని అన్నారు. నేటివరకు ఆర్ఎస్ఎస్ఎస్ క్రాప్ బుకింగ్ పోర్టల్ లో 18,091 ఎకరాలు ప్రాంతం నమోదైనట్లు ఆయన తెలిపారు. జిల్లాలో టీఎస్ ఆయిల్ ఫెడ్, గోద్రెజ్ కంపెనీలకు లక్ష్యం ఇవ్వగా, సెప్టెంబర్ నాటికి 4600 ఎకరాల ప్రగతి సాధించామన్నారు. 2543 మంది రైతులు 11212.23 ఎకరాల్లో సాగుకు నమోదు చేసుకున్నట్లు ఆయన తెలిపారు. డ్రిప్ ఇరిగేషన్ కోసం 472 చోట్ల 2191.17 ఎకరాలకు పరిపాలన అనుమతులు ఇవ్వగా, 154 చోట్ల 736.75 ఎకరాల్లో పూర్తిచేసినట్లు, మిగిలిన ప్రాంతాల్లో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతుల్లో అవగాహన కల్పించాలని, ఆయిల్ పామ్ సాగు వల్ల కలిగే లాభాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై రైతుల్లో చైతన్యం తేవాలన్నారు.

రెవిన్యూ సంబంధ అంశాలపై పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలి

రెవిన్యూ సంబంధ అంశాలపై పెండింగ్ లేకుండా తహశీల్దార్లు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. శుక్రవారం నూతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో తహసిల్దార్లతో జీవో 58, 59 అమలు, బల్క్ ఇషఉ్యస్, ధరణి మాడ్యూల్ కి సంబంధించి దరఖాస్తుల పరిష్కారం, గురించి కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. జీవో 58 క్రింద వచ్చిన దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన చేసి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సర్వే నెంబర్ల ప్రకారం గూగుల్ ఎర్త్ లో ట్యెం ఇమేజ్ డౌన్లోడ్ చేయాలని, ఆ ప్రకారం ఎప్పటి నుంచి పొజిషన్లో ఉన్నది చూడాలన్నారు. రోజువారి తనిఖీల లక్ష్యాలు పెట్టుకొని త్వరగా పరిశీలన పూర్తి చేయాలన్నారు.జీవో 59 ద్వారా వచ్చిన దరఖాస్తులకు సంబంధించి, మొదటి విడతలో జారీచేసిన నోటీసులకు గాను డిమాండ్ మొత్తం వసూలుకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. రెండో విడత డిమాండ్ నోటీసుల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని, డిమాండ్ త్వరగా చెల్లించేలా అవగాహన చేయాలని అన్నారు. ధరణి మాడ్యూళ్లకు సంబంధించి ఫార్మాట్‌లు ఇవ్వడం జరిగిందని, అట్టి ఫార్మాట్ లో ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. ధరణి లో పెండింగ్ దరఖాస్తుల త్వరితగతిన పరిష్కారం చేయాలన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడి శ్రీనివాస్, ఖమ్మం ఆర్‌డిఓ గణేష్, కల్లూరు ఆర్డీవో అశోక్ చక్రవర్తి, ఎస్డీసి ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, జిల్లాలోని మండల తహశీల్దార్లు, సర్వేయర్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ క్యాంప్ ఆఫీసులో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నాయకులు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో జిల్లాలోని 64 మంది లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం ఉదయం 10 గంటలకు ఖమ్మం ఎంపీ క్యాంప్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో లబ్దిదారులకు పంపిణీ చేయనున్నట్లు ఎంపీ క్యాంప్ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఖమ్మం కార్పొరేషన్, మధిర నియోజకవర్గంలోని మధిర, బోనకల్, చింతకాని, ముదిగొండ, ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, వైరా నియోజకవర్గంలోని వైరా, కొణిజర్ల తదితర మండలాలకు చెందిన లబ్దిదారులకు చెక్కులు అందజేయడం జరుగుతుంది. సమాచారం అందుకున్న లబ్దిదారులంతా ఎంపీ క్యాంప్ కార్యాలయానికి సకాలంలో చేరుకోవాలని క్యాంప్ కార్యాలయం కోరింది.

కార్మికులకు కనీస వేతనం రూ.12000 ఇవ్వాలి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

- ఇందిరాపార్క్ వద్ద తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ మహాధర్నా



ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద జరిగిన మహా ధర్నాలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్ తదితరులు

నవతెలంగాణ- ముషీరాబాద్

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23 వేల మంది ఆర్టిజన్లు, కన్వర్షన్లను పర్మినెంట్ చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 11 ప్రకారం కార్మికులకు కనీస వేతనం రూ.12000 ఇవ్వాలన్నారు. తెలంగాణ రాష్ట్ర యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా జూలకంటి రంగారెడ్డి, పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ ట్రాన్స్‌కో జెన్‌కో శాశ్వత ఉద్యోగులకు ఈపీఎఫ్, జీపీఎస్ సమస్య చాలా తీవ్రంగా ఉందని తెలిపారు. తెలంగాణ ట్రాన్స్‌కో -జెన్‌కో ఎన్‌పీడీపీఎల్ హైదరాబాద్, వరంగల్ విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న 23 వేల మంది ఆర్టిజన్స్, కన్వర్షన్స్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. వరంగల్ బేస్‌గా ఉన్న ఎంపీడీపీఎల్ కంపెనీలో 1,536, ఎస్పీడీసీఎల్‌లో గల 53 మంది అన్‌మెన్స్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించాలన్నారు. పీస్‌రేట్ కార్మికులైన బిల్ కలెక్టర్లు, స్పాట్ బిల్డర్స్, ఎస్పీఎం, పీఏఎలుగా పనిచేస్తున్న కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం రూ.12000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ శాఖ శాశ్వత ఉద్యోగులకు ఈపీఎఫ్ టు జీపీఎఫ్ సమస్య చాలా తీవ్రంగా ఉందన్నారు. విద్యుత్ సంస్థల్లో ప్రమోషన్స్ ఇవ్వడం లేదని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో 2011లో రిక్రూట్‌మెంట్ చేసిన జేఎల్‌ఎంలకు రావాల్సిన వేల రూపాయల ఏరియన్స్ ఇవ్వ కుండా యాజమాన్యం కాలయాపన చేస్తోందని, వెంటనే ఇవ్వాలని కోరారు. విద్యుత్ వినియోగదారుల సంఖ్య పెరుగుతున్న కారణంగా ఉద్యోగుల సంఖ్య తక్కు వగా ఉండటంతో మెరుగైన సేవలు అందడం లేదన్నారు. మరో 18 నుంచి 20 వేల మంది ఉద్యోగులను రిక్రూట్ చేయాల్సి ఉందని, వెంటనే ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహా ధర్నాలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్య క్షులు ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ వెంకటరాజు, ప్రసాద్ రాజు, ఆర్గనై జింగ్ సెక్రెటరీలు సుధాకర్, రవీంద్ర ప్రసాద్, శశికళ బసవ రాజు, ఎస్పీడీసీఎల్ అధ్యక్ష కార్యదర్శులు చంద్రారెడ్డి, సత్యం, ఎస్పీడీసీఎల్ అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రజలే ఎర్రజెండాగా మారి.. సాయుధ పోరాటం

- చరిత్రను వక్రీకరిస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

నవతెలంగాణ-మంచిర్యాల

ప్రజలే ఎర్రజెండాగా మారి సాగించిన పోరుబాటే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో చార్వక ట్రస్ట్ భవనంలో శుక్రవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.వీరయ్య మాట్లాడుతూ.. ఓవైపు స్వాతంత్ర్య సంబరాలు చేసుకుంటుంటే.. మరోవైపు తెలంగాణలో మా భూములు మాకు కావాలి అంటూ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ రైతాంగ పోరాటం ఉవ్వెత్తున సాగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కమ్యూనిస్టులపై, ప్రజలపైన దాడి చేయించిందన్నారు. ఇందులో 3వేల మందికి పైగా కమ్యూనిస్టులు అమరులయ్యారని తెలిపారు. మూడు లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘన చరిత్ర తెలంగాణ సాయుధ పోరాటానిదని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాటాన్ని తట్టుకోలేక నిజాం సర్కారు సెప్టెంబర్ 17న తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేసిందని వివరించారు. కానీ దీన్ని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వక్రీకరించి ముస్లిం రాజుపై హిందువుల పోరాటంగా, విద్రోహదినంగా చిత్రీకరించేందుకు ప్రయత్నాలు చేస్తోందని విమర్శించారు. ఇందులో భాగంగానే ఈ నెల 17న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను ఆహ్వానించారని తెలిపారు. ఇక్కడ కూడా హిందూ, ముస్లింల మధ్య విభేదాలు పెట్టి అల్లర్లు సృష్టించాలని ప్రయత్నాలు సాగిస్తున్నారన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో మతోన్మాద చర్యలను తిప్పికొట్టే విధంగా ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్, దుంపల రంజిత్ కుమార్, నాయకులు దూలం శ్రీనివాస్, బోడెంకి చందు, రవి, ఉమారాణి, ప్రేమ్ కుమార్, మహేష్, సరిత, రేణుక, భూదక్క, సమ్మక్క పాల్గొన్నారు.



అంగన్వాడీ ఆయా ఆత్మహత్య

- కుటుంబాన్ని ఆదుకోవాలి : తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సునిత

నవతెలంగాణ- ఉట్నూర్/ ఆదిలాబాద్‌టౌన్

సమస్యలను పరిష్కరించాలని ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మనస్తాపానికి గురైన అంగన్‌వాడీ కేంద్రం ఆయా ఆత్మహత్య చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం ఉమ్రి-కొలాంగూడకు చెందిన ఆత్రం రంభ(30) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. ఏఎస్ఐ దిలీప్ తెలిపిన వివరాల ప్రకారం.. సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో రంభ మనస్తాపానికి గురైంది. దాంతో శుక్రవారం పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించలోపే మృతిచెందింది. మృతురాలి భర్త సోనేరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ దిలీప్ తెలిపారు. అంగన్వాడీ ఉట్నూర్ డివిజన్ నాయకులు రత్నమాల, ముక్త తదితరులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి నివాళి అర్పించారు. ప్రభుత్వం సమస్యలను పట్టించుకోకపోవడంతోనే రంభ ఆత్మహత్య చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.

హెల్పర్ కుటుంబాన్ని ఆదుకోవాలి : సునిత

మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్య చేసుకున్న ఆయా రంభ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సునీత డిమాండ్ చేశారు. తోటి అంగన్వాడీ టీచర్‌కు ఫోన్ చేసి సమ్మెలో పాల్గొంటానికి వస్తున్నానని చెప్పి.. అంతలోనే ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమన్నారు. అంగన్వాడీ కేంద్రం తాళం విషయంలో అధికారులు బెదిరింపులకు పాల్పడ్డారని తెలిపారు. అధికారుల వేధింపుల వల్లే ఆయా ఆత్మహత్య చేసు కుందని, ఆమె కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు 'దసరా కానుక'

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం దసరా నుంచి అమలు చేయనున్నది. తమిళనాడులో విజయవంతంగా అమలు తమిళనాడులో విజయవంతంగా అల్పాహారం పథకం అమలవుతున్నది. ఆ పథకం విధానాన్ని పరిశీలించి రావాలంటూ ఐఏఎస్ అధికారుల బృందాన్ని సీఎం కేసీఆర్ ఇటీవలే అక్కడకు పంపించారు. కాగా అక్కడ విజయవంతంగా అమలవుతున్న 'విద్యార్థులకు అల్పాహారం పథకం'ను అధ్యయనం చేసిన అధికారుల బృందం ప్రభుత్వానికి నివేదిక అందించింది. తమిళనాడులో కేవలం ప్రాథమిక పాఠశాలల వరకే అమలు చేస్తున్నారనే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తెచ్చింది. కాగా విద్యార్థుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించే కేసీఆర్ ఖర్చుకు వెనకాడకుండా ఉన్నత పాఠశాలల విద్యార్థులకూ అల్పాహారం అందజేయాలని నిర్ణయించారు. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ప్రతి ఏటా దాదాపు రూ. 400 కోట్ల వరకు అదనపు భారం పడనున్నదని ప్రభుత్వం ప్రకటించింది. అయితే రాష్ట్రంలోని 28,807 ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 23,05,801 మంది విద్యార్థులకు 'ముఖ్యమంత్రి అల్పాహార పథకం' వర్తించనుంది. ఇందుకు సంబంధించి విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు.

సీఎం కేసీఆర్‌కు మంత్రి సబిత కృతజ్ఞతలు

దసరా కానుకగా వచ్చేనెల 24 నుంచి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు ముఖ్యమంత్రి అల్పాహార పథకం అందించాలని నిర్ణయం తీసుకోవడం పట్ల సీఎం కేసీఆర్‌కు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

స్వాగతించిన టీఎస్‌యూటీఎఫ్

ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని టీఎస్‌యూటీఎఫ్ సంపూర్ణంగా స్వాగతించింది. వచ్చేనెల 24 నుంచి ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు విడుదల చేయడం హర్షణీయమని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి తెలిపారు. ఉదయం ఖాళీ కడుపుతో బడికి వచ్చే పలువురు పేద విద్యార్థుల ఆకలి తీర్చే ఈ పథకాన్ని పకడ్బందీగా శాశ్వతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని వారు కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అల్పాహార పథకం ఒక వరమని పీఆర్‌టీయూ ఉపాధ్యాయ ఉద్యోగ సంఘం అధ్యక్షులు దాముక కమలాకర్, ప్రధాన కార్యదర్శి చీటీ భూపతిరావు పేర్కొన్నారు. ఈ పథకాన్ని ప్రకటించిన సీఎం కేసీఆర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు అల్పాహార పథకం అందించాలని సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకోవడం పట్ల బాలల హక్కుల సంక్షేమ సంఘం అధ్యక్షులు గుండు కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి రఘునందన్ హర్షం ప్రకటించారు.



ఆ రెండూ కాకుండా నేను రాజకీయ నాయకుడినయ్యా!

- అమ్మకు డాక్టర్ కావాలని.. నాన్నకు ఐఏఎస్ కావాలని కోరిక..
- రాజన్నసిరిసిల్ల జిల్లా మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

నవతెలంగాణ- సిరిసిల్ల రూరల్ / కరీంనగర్ / కొత్తపల్లి

'1993లో నేను బయాలజీ స్టూడెంట్‌గా ఉన్నప్పుడు ఎంసెట్ రాస్తే 1600 ర్యాంకు వచ్చింది.. అయినా మెడిసిన్ సీట్ రాలేదు. మా అమ్మకు నేను డాక్టర్ కావాలని, నాన్నకు ఐఏఎస్ కావాలనే కోరిక ఉండేది. ఆ రెండూ కాకుండా నేను రాజకీయ నాయకుడిని అయ్యాను' అని ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం మెడికల్ కాలేజీని రాజధాని నుంచే సీఎం కేసీఆర్ వర్చువల్ పద్ధతిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రారంభోత్సవ వేదికలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ ప్రయివేటు మెడికల్ కళాశాలల్లో ప్రతి సంవత్సరమూ 10వేల మంది విద్యార్థులు వైద్య విద్యను పూర్తి చేసి డాక్టర్లుగా బయటకు వస్తున్నారని చెప్పారు. దేవుని రూపంలో అత్యవసర పరిస్థితుల్లో ప్రాణం కాపాడే వైద్యున్ని ప్రజలు గౌరవిస్తారని, అంతటి ప్రాధాన్యతన ఉన్నదే వైద్య వృత్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టిసారించి ప్రతి జిల్లాలో మెడికల్ కాలేజీని ప్రారంభించి పేదలకు మెరుగైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవ రెడ్డి, సెస్ చైర్మెన్ చిక్కాల రామారావు, రాష్ట్ర పవర్ లూం, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ గూడూరి ప్రవీణ్, టెస్కాబ్ చైర్మెన్ కొండూరి రవీందర్, రైతుబంధు సమితి అధ్యక్షులు గడ్డం నర్సయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్‌లు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

శరవేగంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పనులు

(మొదటిపేజీ తరువాయి)

ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని 12.30 లక్షల ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా పనులు సాగుతున్నాయి. దాదాపు 19 నియోజకవర్గాల్లోని ఆయకట్టును వరప్రదాయిని కానుంది. 2015లో ప్రారంభమైన నిర్మాణాన్ని రెండు ఫేజులుగా చేపడుతున్నారు. ఫేజ్-1లో ప్రాజెక్టు ప్రధాన పనులు, ఫేజ్-2లో కాలువలు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నాయి. తొలుత శంకుస్థాపన నాటికి ప్రాజెక్టుకు రూ. 35,200 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరుచేశారు. ఇప్పటివరకు సాగునీటి శాఖ అధికారిక సమాచారం ప్రకారం రూ.26,262 కోట్లు ఖర్చు చేశారు. కాగా ఈ ప్రాజెక్టు వ్యయం మూడు రెట్లు పెరుగుతుందనే వ్యాఖ్యానాలు ఇటు అధికారులు, అటు సాగునీటిరంగ నిపుణుల నుంచి వస్తున్నాయి. ఈనెల 16న ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి వెట్‌రన్‌కు స్విచ్ఛాన్ చేయనున్నారు. ఇప్పటికే డ్రైరన్ పూర్తిచేసిన సంగతి తెలిసిందే. కాగా ప్రాజెక్టు పనులే పూర్తికాలేదనీ, పూర్తికాని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవాలేంటనీ, పనులు నాణ్యంగా జరగడం లేదంటూ ప్రతిపక్షాల నుంచి ఆరోపణలు, విమర్శలు వస్తున్న తరుణంలో రాష్ట్ర సమాచార, పౌరసంబంధాల శాఖ 'ప్రెస్‌టూర్' నిర్వహించింది. హైదరాబాద్ నుంచి మూడు బస్సుల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాను తీసుకెళ్లింది. ప్రాజెక్టును భౌతికంగా చూపించి వాస్తవాలను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో ప్రాజెక్టు పరిధిలోని నార్లపూర్ పంపుహౌజ్, హెడ్‌రెగ్యులేటర్, యేదుల పంపుహౌజ్, సర్జ్‌పూల్‌ను మీడియాకు చూపించింది. ప్రాజెక్టుకు సంబంధించి సమాచారాన్ని మీడియాకు అందించింది. సాంకేతిక అంశాలను తెలియజేసింది. స్థానికంగా ఉన్న సాగునీటి చీఫ్ ఇంజినీర్ స్థాయి అధికారితో పాటు జిల్లా, డివిజనల్ అధికారులు మీడియాకు అందుబాటులో ఉన్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు వి. శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సైతం చెప్పారు. ప్రపంచంలోనే అతిపెద్ద సాగునీటి ఎత్తిపోతల పథకంగా అభివర్ణించారు . కాళేశ్వరం కంటే పాలమూరు ప్రాజెక్టుకు భారీ బాహుబలి మోటర్లను బిగిస్తున్నట్టు చెప్పారు.

సైద్ధాంతికవేత్త కామ్రేడ్ కన్నయ్య బెనర్జీ కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ఆఫీసు బేరర్‌గా పనిచేసిన ఆయన కార్మిక ఉద్యమం అభివృద్ధికి కీలకమైన సేవలందించారంటూ ఆయన మృతికి పార్టీ పొలిట్‌బ్యూరో సంతాపం వ్యక్తం చేసింది. తత్వశాస్త్రం, సంస్కృతి గురించి చాలా ఆసక్తి కలిగిన ఆయన వాటిలో ప్రావీణ్యతను సంపాదించారు. కన్నయ్య చాలా నిరాడంబరమైన జీవితాన్ని గడిపారని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఆయన కుటుంబ సభ్యులందరికీ సానుభూతిని తెలియచేసింది. పార్టీ కార్యకర్తల పట్ల చాలా ప్రేమగా వుండే ఆయన రాజకీయ సైద్ధాంతిక పోరులో అస్సలు రాజీ పడేవారు కాదు, సైద్ధాంతిక పోరు సాగుతున్న ఈ క్లిష్ట సమయంలో ఆయన మృతి పార్టీకి తీరని నష్టమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. బాగా పుస్తకాలు చదివే ఆయన సృజనాత్మక రచనలు కూడా చేశారు. మార్క్సిజం-లెనినిజం పై విశ్లేషణాత్మక సామర్థ్యాన్ని కలిగివుండేవారని పొలిట్‌బ్యూరో గుర్తు చేసుకుంది. 2008 వరకు సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడిగా వున్నారు.

సీఐటీయూ సంతాపం

స్వాతంత్ర్య ఉద్యమ నేత, ప్రముఖ కార్మిక సంఘ నాయకుడు, సైద్ధాంతికవేత్త, సిఐటియు మాజీ జాతీయ కార్యదర్శి కామ్రేడ్ కన్నయ్య బెనర్జీ మృతికి సిఐటియు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. 1940 తొలినాళ్లలో బీడి కార్మికులు, టైలర్లు, చాకలివాళ్ళ సంక్షేమం కోసం ఉద్యమాలు నిర్మించిన ఆయన తర్వాత సహకార సంస్థలను నడిపారు. కలకత్తాకు వచ్చిన తర్వాత విద్యార్థి ఉద్యమంలో, కార్మిక సంఘ ఉద్యమంలో చాలా చురుకుగా వుండేవారు. 1974లో చారిత్రక రైల్వే సమ్మెలో కీలక పాత్ర పోషించిన ఆయన 1984లో రైల్వే నుండి ముందుగానే రిటైర్‌మెంట్ తీసుకుని కామ్రేడ్ బిటిఆర్ చొరవ మేరకు ఢిల్లీలో సీఐటీయూ సెంటర్‌లో చేరారని గుర్తు చేసుకుంది.

గ్రామాధ్యక్షురాలిగా గెలిచి రెండేండ్లు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఎస్సీ మహిళలకు పంచాయతీని రిజర్వ్ చేయాలనే ఎన్నికల కమిషన్ నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ వన్నియార్ కులానికి చెందిన పంచాయతీ మాజీ అధ్యక్షుడు మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. కేసు కొట్టివేయబడినప్పటికీ, కేసు అప్పీల్ ఫలితం దళిత మహిళ ప్రమాణస్వీకారంపై పడింది. పంచాయతీలో తక్కువ ఎస్సీ జనాభా ఉన్నందున పెత్తందారీ కులాల సభ్యులు కోర్టును ఆశ్రయించాలని నిర్ణయించుకున్నారు.

కాగా, ఈ అంశంపై సీపీఐ(ఎం), తమిళనాడు అంటరానితనం నిర్మూలన ఫ్రంట్(టీఎన్‌యూఈఎఫ్), విడుతలై చిరుతైగల్ కట్చి(వీసీకే)లు జోక్యం చేసుకున్నాయి. సెప్టెంబర్ 13న జిల్లా కలెక్టర్‌తో చర్చలు జరిపారు. అనంతరం, ఈనెల 23లోగా ప్రమాణస్వీకారం పూర్తయ్యేలా చేస్తామన్న హామీ కలెక్టర్ నుంచి వచ్చిందని జరిగిన చర్చల అనంతరం సీపీఐ(ఎం), టీఎన్‌యూఈఎఫ్, వీసీకే నాయకులు వెల్లడించారు.

అభిప్రాయాలు చెప్పడమే నేరమా?

(మొదటిపేజీ తరువాయి)

తర్వాత ఫిర్యాదుదారులు పదే పదే జర్నలిస్టులు మణిపూర్‌లో చేసిన నష్టం గురించి ప్రస్తావిస్తూ వుండడంతో కీలకమైన వ్యాఖ్యలు చేసింది."మీరు ఈ విషయాన్ని లేవదీశారు కాబట్టి ఒక విషయం ముందు మాకు చెప్పండి, అసలు ఈ నేరాలు ఎలా జరిగాయో చెప్పండి, అఫిడవిట్ దాఖలు చేయండి, అన్నీ రికార్డు చేయండి, అసలు ఈ ఫిర్యాదులను, ఎఫ్‌ఐఆర్‌లను ఎందుకు కొట్టివేయరాదో కూడా చెప్పాలి" అంటూ ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ కోరారు. మణిపూర్‌లో పక్షపాతంతో కూడిన మీడియా కవరేజీ జరిగిందని పేర్కొంటూ ఆర్మీ ఎడిటర్స్ గిల్డ్‌కు లేఖ రాసింది. వెంటనే గిల్డ్ తన సీనియర్ జర్నలిస్టుల బృందాన్ని పంపి, క్షేత్రస్థాయిలో ఏం జరిగిందో కనుగొనాల్సిందిగా కోరింది. వారు ఒక నివేదికను సమర్పించారు.



మెరుపు మీసొంతం


ముఖం మెరుపులీనాలని అందరికీ ఉంటుంది. ఇందుకు ఏవేవో క్రీములని, ఫౌండేషన్స్ అని చాలా ఖర్చు చేస్తుంటారు. అలా కాకుండా, సింపుల్‌గా, నాచురల్‌గా ముఖం కాంతులీనాలంటే కొన్ని చిన్న చిట్కాలు పాటిస్తే సరి..

- బియ్యం పిండి, మిల్క్ క్రీమ్ రెండూ ముఖం మెరిసిపోవడానికి అద్భుతంగా పనిచేస్తాయి. ఇవి మంచి ఫేస్ స్క్రబ్‌లా కూడా ఉపయోగపడతాయి. ఒక టీస్పూన్ బియ్యం పిండిని తీసుకుని కాస్తంత మిల్క్ క్రీమ్‌ను కలపండి. ఆ తర్వాత ముఖంపై, మెడపై ఈ మిశ్రమంతో సర్క్యులర్ మోషన్‌లో మసాజ్ చేయండి. తర్వాత ముఖాన్ని శుభ్రం చేసుకోండి.
- చిటికెడు పసుపును, శనగపిండిని కలిపి చిక్కగా పేస్ట్‌లా చేసుకుని, ముఖంపై మసాజ్ చేసుకోవాలి. ముఖ్యంగా మొటిమలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న ప్రాంతంలో కచ్చితంగా మసాజ్ చేయాలి. ఇది ముఖంపై నుంచి అదనపు నూనెను గ్రహిస్తుంది. చర్మాన్ని హైడ్రేటెడ్‌గా, క్లీన్‌గా ఉంచుతుంది.
- మిల్క్ క్రీమ్‌ను కాస్తంత తేనెతో కలపండి. ముఖంపై అప్లై చేసుకోండి. కొద్ది సేపు ఆరనివ్వండి. కొన్ని నిమిషాల తరువాత నీటితో కడిగేయండి. బ్యూటీపార్లర్‌కు వెళ్ళినంత మెరుపు మీ ముఖంపై గమనిస్తారు.

ఇట్ల చేద్దాం



ఇడ్లీలు మృదువుగా, రావాలంటే ఐదు కప్పుల బియ్యానికి ఒక కప్పు అటుకులు నానబెట్టుకోవాలి. రుబ్బుకునేప్పుడు వీటిని కలిపితే ఇడ్లీలు మృదువుగా వస్తాయి.



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

మానసికంగా కుంగదీశారు

సునీతకు 35 ఏండ్లు ఉంటాయి. తన తల్లిని తీసుకుని ఐద్వా అదాలత్‌కు వచ్చింది. వారికి సునీత ఒక్కతే కూతురు. తల్లి బట్టల మిల్లులో ఉద్యోగం చేస్తుంది. తండ్రి తన చిన్నతనంలోనే కుటుంబాన్ని వదిలేసి ఎటో వెళ్ళిపోయాడు. ఇంట్లో తల్లి, కూతురు మాత్రమే ఉంటారు. సునీతకు 17 ఏండ్లకే పెండ్లి చేసింది తల్లి. పెండ్లి తర్వాత ఒక ఏడాది వరకూ బాగున్నారు. వాళ్ళది పల్లెటూరు. భర్తకు వచ్చే జీతంతో ఇల్లు గడవడం కష్టంగా ఉండేది. అందుకే ఆమె కూడా ఏదో ఒక పని చేయాలనుకుంది. కొన్ని రోజులు వ్యవసాయం పనులకు వెళ్ళింది. తర్వాత చిన్న కిరాణ షాపు పెట్టుకుంది. దుకాణం బాగానే నడుస్తుంది. కానీ ఇక్కడి నుండే సమస్య మొదలైంది.

ఊరు కాబట్టి కిరాణా షాపులో మద్యం అమ్మితే ఎక్కువ డబ్బులు వస్తాయంటూ తోటి కోడలు సునీతకు చెప్పింది. కానీ దానికి ఆమె ఒప్పుకోలేదు. దాంతో సునీతను పక్కన బెట్టి అత్త, తోడి కోడలు షాపులో కూర్చునేవారు. సునీత ఎండు మిర్చి పౌడర్ చేసే మిషన్ తెచ్చుకుంది. పసుపు, మిర్చి పౌడర్ చేసేది. వచ్చిన డబ్బులు కొంత ఇంటికి ఖర్చు పెట్టి మిగిలిన వాటితో బంగారం కొనుక్కుంది. సునీతకు బాబు పుట్టాడు. దాంతో పుట్టింటికి వచ్చింది. డెలివరీ తర్వాత మూడు నెలల అక్కడే ఉంది. తర్వాత అత్తగారింటికి వెళ్ళింది. తను వెళ్ళే సరికి పరిస్థితి మొత్తం మారిపోయింది. కిరాణా షాపుపై పూర్తి ఆధిపత్యం వాళ్ళ తోడికోడలు తీసుకుంది. మిర్చి మిషన్ అమ్మేశారు. వచ్చిన డబ్బులతో భర్త కార్పెంటర్ మిషన్ తీసుకున్నాడు.


'నాకు చెప్పకుండా ఇలా చేశారేంటి' అని అడిగితే 'నీకెందుకు చెప్పాలి? నేను నీ మిషన్ అమ్మేసి వర్క్ చేసుకుంటాను. అన్నయ్యకు కూడా పని లేదు. వదినా, పిల్లలు ఎలా బతుకుతారు. అందుకే షాపు వాళ్ళకు ఇచ్చేశాను. షాపులో మందు అమ్మమంటే అమ్మడం లేదు. కానీ వదిన అలా కాదు. సరుకులతో పాటు మందు కూడా అమ్ముతుంది. ఎక్కువ డబ్బులు వస్తున్నాయి' అన్నాడు. దానికి ఆమె 'మరి ఇప్పుడు నేనేం చేయాలి. మనకూ ఇప్పుడు బాబు ఉన్నాడు. వాడి భవిష్యత్ గురించి ఆలోచించరా' అంటే 'నీకు పొలం పనులు కూడా వస్తాయిగా, నువ్వు ఆ పనులకు వెళ్ళు' అన్నాడు.

బాబు చిన్నగా ఉన్నాడని ఇక సునీత ఏం మాట్లాడలేదు. ఏడాది తర్వాత కుట్టు పనులు నేర్చుకుని మిషన్ తెచ్చుకుంది. బట్టలు కుట్టడం మొదలుపెట్టింది. కానీ ఆమె ఇంట్లో ఉండటం, భర్తకు, తోడి కోడలికి ఏ మాత్రం ఇష్టం లేదు. ఎప్పుడు ఏదో ఒక విషయానికి గొడవ పెట్టుకుంటారు. భర్త అయితే కొట్టడం ప్రారంభించాడు. అనవసరంగా తిట్టడం, మీ అమ్మ దగ్గరకు వెళ్ళి డబ్బులు తీసుకురా, బంగారం తీసుకురా అంటూ గొడవలు చేసేవారు. చివరకు కొట్టి పుట్టింటికి పంపించేశారు. సునీత తల్లి వేరే వాళ్ళ దగ్గర అప్పు చేసి లక్ష రూపాయలు తీసుకువచ్చి ఇచ్చింది. ఇలా 4, 5 సార్లు జరిగింది. చివరకు పెద్ద మనుషుల్లో పంచాయితీ కూడా పెట్టించింది.

వాళ్ళ ముందు 'ఇక పై అలా చెయ్యను' అనేవాడు. ఇంటికి వచ్చిన తర్వాత మళ్ళీ అలాగే చేసేవాడు. వాళ్ళు కూడా అతని ప్రవర్తనతో విసిగిపోయారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయమన్నారు. కానీ సునీత ఆ పని చేయలేకపోయింది. అసలు భర్త ఎందుకు ఇలా ప్రవర్తిస్తున్నాడో ఆమెకు చాలా రోజులు అర్థం కాలేదు. తన భర్తా, తోడి కోడలు ఎప్పుడూ సరదాగా మాట్లాడుకునే వారు. సునీత పెద్దగా పట్టించుకోలేదు. వాళ్లిద్దరూ మొదటి నుంచి ఒక్కటే స్కూల్, ఒక్కటే కాలేజీ, ఒకే క్లాస్. అందుకే అంత చనువుగా ఉంటారు అనుకునేది. కానీ ఒక రోజు 'నువ్వు ఇంట్లో బట్టలు కుట్టడానికి వీలు లేదు. మిషన్ సౌండ్‌కి, ఇంటికి వచ్చే వారితో చాలా ఇబ్బందిగా ఉంది అని' గొడవ చేశారు.

'మిషన్ కోసం కరెంటు ఉపయోగిస్తాను. కాబట్టి సౌండ్ రాదు. బట్టలు తీసుకోవడానికి వచ్చే వాళ్ళు కూడా మధ్యాహ్నం వస్తారు. వాళ్ళతో ఈయనకు ఇబ్బంది ఏంటో తెలీదు. ఒక రోజు లైనింగ్ కోసం నేను బయటకు వెళ్ళాను. వచ్చే సరికి ఇంట్లో మా ఆయన్ని, వాళ్ళ వదినను చూడకూడని స్థితిలో చూశాను. ఎందుకిలా చేశారని అడిగితే విపరీతంగా కొట్టారు. 'నువ్వు నాకు అవసరం లేదు పో' అన్నాడు. వాళ్ళ ఇద్దరి మధ్య వున్న సంబంధం ఇంట్లో అందరికీ తెలుసు. నాకూ ఎలాగో తెలిసిపోయింది కదా అని 'మా వదినతో నేను ఇలాగే ఉంటాను. నీకు ఇష్టమైతే ఇక్కడ ఉండు, లేదంటే పో' అన్నాడు.

దాంతో సునీత పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టింది. వదినకు, మరిదికి సంబంధం పెట్టి తప్పుగా మాట్లాడుతుందని అక్కడ నమ్మించారు. ఆమెకు పిచ్చి పట్టిందని, ఆస్పత్రికి తీసుకువెళ్ళి చికిత్స చేయించాలని నిర్ణయించారు. భర్త, కుటుంబ సభ్యులు కొట్టడం, తిట్టడంతో ఆమె మానసికంగా కుంగిపోయింది. పరిస్థితి విషమంగా మారడంతో ఆమెను పుట్టింట్లో వదిలేశారు. డాక్టరు పరీక్షలు చేసి 'ఈమె మానసిక పరిస్థితి బాగాలేదు. దేని గురించో బాగా ఆలోచిస్తుంది. కోలుకోవడానికి కొంచెం సమయం పడుతుంది' అన్నాడు. ఇదే మంచి అవకాశం అని భర్త ఆమెను వదిలేసి ఊరికి వెళ్ళిపోయాడు. అంతే తిరిగి రాలేదు.



> **సునీత పరిస్థితి మరింతగా క్షీణించింది. డాక్టర్లు మానసిక వైద్యులకు చూపించాలన్నారు. అదే విషయం భర్తకు చెపితే 'ఆమె పిచ్చిది అందుకే అలా చెప్పారు. మీరు చూయించుకుంటే చూపించుకోండి. నేను మాత్రం రాను' అన్నాడు.తల్లే సునీతకు చికిత్స చేయిస్తూ ఓ చిన్న పిల్లలా చూసుకుంటుంది. ఒంటిపైన బట్టలు ఉన్నాయో, లేదో కూడా తెలిసేది కాదు. తల్లి పనికి వెళుతూ సునీతను ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్ళేది. ఆమె పరిస్థితి తెలిసిన మిల్లు యజమానులు, తోటి ఉద్యోగులు సాయంగా ఉన్నారు.**

సునీత పరిస్థితి మరింతగా క్షీణించింది. డాక్టర్లు మానసిక వైద్యులకు చూపించాలన్నారు. అదే విషయం భర్తకు చెబితే 'ఆమె పిచ్చిది అందుకే అలా చెప్పారు. మీరు చూయించుకుంటే చూపించుకోండి. నేను మాత్రం రాను' అన్నాడు. తల్లే సునీతకు చికిత్స చేయిస్తూ ఓ చిన్న పిల్లలా చూసుకుంటుంది. ఒంటిపైన బట్టలు ఉన్నాయో, లేదో కూడా తెలిసేది కాదు. తల్లి పనికి వెళుతూ సునీతను ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్ళేది. ఆమె పరిస్థితి తెలిసిన మిల్లు యజమానులు, తోటి ఉద్యోగులు సాయంగా ఉన్నారు. అందులో ఒకరి ద్వారా ఐద్వా గురించి చెప్పడంతో సునీతను తీసుకుని తల్లి మా దగ్గరకు వచ్చింది.

సునీత మాత్రం 'నాకు నా భర్త కావాలి, బాబు కావాలి ఇంక ఏమీ వద్దు' అంటుంది. 'డాక్టర్లతో కూడా పదే పదే ఇదే చెబుతుంది. వాళ్ళు ముందులు వాడితే మళ్ళీ మామూలు పనికి అవుతుందని చెప్పారు' అని తల్లి చెప్పింది.

మేము సునీతతో నీవు ప్రతి రోజు మందులు వేసుకుంటే నీ భర్తను, నీ బాబును నీ దగ్గరకు తీసుకువస్తామని చెప్పాం. మధ్య మధ్యలో సునీత వాళ్ళ అమ్మకు ఫోన్ చేసి మాట్లాడాం. ఆమె ఆరోగ్య పరిస్థితి కొంత మెరుగు పడిన తర్వాత సునీతను ఆఫీసుకు పిలిచాం. అప్పుడు జరిగింది మొత్తం తనే చెప్పింది.

మేము సునీత భర్తను పిలిస్తే రాలేదు. 'ఆమె పిచ్చిది, ఆమె చెప్పిన మాటలు మీరు ఎలా నమ్ముతారు. నేను రాను మేడం' అంటూ ఎన్ని సార్లు పిలిచినా రాలేదు. ఇక లాభం లేదని ఆ ఊరి సర్పంచ్‌కి ఫోన్ చేశాం. 'వాడు మేం చెప్పినా వినడం లేదు. మీరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోండి' అని చెప్పారు. మేము వెంటనే పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి విషయం చెప్పాము. సునీతతో 'నీ గురించి పట్టించుకోని వాడి గురించి నువ్వెందుకు ఆలోచిస్తావు. అతను నిన్ను వదిలేసి దాదాపుగా ఆరేండ్లు అవుతుంది. నీ బాబు కూడా నిన్ను మర్చిపోయాడు. బాబుతో మాట్లాడి నీతో పంపించే ప్రయత్నం చేస్తాం' అని చెప్పాం. దానికి సునీత కూడా అంగీకరించింది.

స్థానిక ఐద్వా వాళ్ళ సహాయంతో పోలీసులలో మాట్లాడి బాబును సునీతతో పంపించాం. కానీ బాబు వాళ్ళ అమ్మను పూర్తిగా మరిచిపోయాడు. ఆమెతో ఉండటానికి ఇష్టపడటం లేదు. దాంతో పదిహేను రోజుల తర్వాత బాబును తండ్రితో పంపించాం. ఇక సునీత భర్తతో మాట్లాడి పెండ్లిలో పెట్టిన బంగారం, కట్నంతో పాటుగా 5 లక్షల రూపాయలు ఇప్పించాం. అతని నుండి విడాకులు తీసుకుంది. ఇప్పుడు ఆమె తిరిగి చదువుకోవడం మొదలుపెట్టింది.

- వై. వరలక్ష్మి, 9948794051

వీరతెలంగాణ సాయుధ పోరాటం అజరామరం

(మొదటిపేజీ తరువాయి)

వచ్చిన సంగతిని గుర్తు చేశారు. ఈడీ నోటీసులు మళ్ళీ రావడం వెనుక ఆంతర్యం ఏమిటో బీజేపీ, బీఆర్ఎస్ చెప్పాలన్నారు. తెలంగాణ వచ్చినంక దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఉద్యోగాలు ఇస్తామని హామీలిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, వాటిని నెరవేర్చడంలో విఫలమైందన్నారు.

దళిత బంధు ఇస్తానని అక్కడక్కడ శాంపిల్ చూయించి దళితులను ఆగం చేస్తున్నారని, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తానని ఇప్పటివరకు ఇవ్వలేదని ఆరోపించారు. భవిష్యత్తు ఎన్నికల్లో సీపీఐతో కలిసి పోరాడుతామని, ఇతరపక్షాలతో అవసరమైన విధంగా పొత్తులు పెట్టుకుంటామన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కరాములు, పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలస్వామి, జిల్లా నాయకులు శశిధర్, కళావతి, రవికుమార్, భాస్కర్, ఎల్లయ్య, యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ హింసాకాండలో 175 మంది మృతి పోలీసుల నివేదిక

(మొదటిపేజీ తరువాయి)

మందిలో ఇప్పటికీ గుర్తించని 96 మృతదేహాలు మార్చురీలో ఉన్నట్టు చెప్పారు. మణిపూర్‌లో గత కొన్ని నెలలుగా హింసాత్మక పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. నివేదిక ప్రకారం.. ఈ హింసలో కనీసం 5,172 అగ్ని ప్రమాద ఘటనలు జరిగాయి.

వాటిలో 4,786 నివాసాలు, 386 మతపరమైన ప్రదేశాలు (254 చర్చిలు, 132 దేవాలయాలు) అల్లరి మూకలు నిప్పు పెట్టాయి. హింస ప్రారంభమైనప్పటి నుంచి రాష్ట్ర ఆయుధగారం నుంచి 5,668 ఆయుధాలు లూటీకి గురయ్యాయనీ, వాటిలో 1,329 ఆయుధాలను భద్రతా బలగాలు తిరిగి స్వాధీనం చేసుకున్నాయని అన్నారు.అలాగే 15,050 మందుగుండు సామగ్రి, 400 బాంబులు భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. రాష్ట్రంలో కనీసం 360 అక్రమ బంకర్లను భద్రతా బలగాలు ధ్వంసం చేశారు.బిష్ణుపూర్ జిల్లాలోని ఫౌగక్‌చావో ఇఖారు నుంచి చురచంద్‌పూర్ జిల్లాలోని కాంగ్‌వై వరకు బారికేడ్‌లను తొలగించామనీ, జాతీయ రహదారులపై భద్రతను ఏర్పాటు చేశామని చెప్పారు.

పేపర్-1 సులభం..పేపర్-2 కఠినం

- పేపర్-1కు 84.12 శాతం, పేపర్-2కు 91.11 శాతం హాజరు
- 27న ఫలితాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా ముగిసింది. పేపర్-1 సులభంగా, పేపర్-2 ప్రశ్నాపత్రం గతంకంటే కొంచం కఠినంగా వచ్చినట్టు నిపుణులు చెప్తున్నారు. పేపర్-2 ప్రశ్నాపత్రం గణితం, సైన్స్ గత టెట్ కంటే కఠినంగా వచ్చినట్టు తెలుస్తున్నది. సోషల్ స్టడీస్ ప్రశ్నాపత్రం కూడా కఠినంగానే వచ్చింది. అయితే ఈనెల 27న టెట్ ఫలితాలను విడుదల చేయాలని నోటిఫికేషన్‌లోనే అధికారులు ప్రకటించారు. ఈ మేరకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్, టెట్ కన్వీనర్ ఎం రాధారెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్ పేపర్-1కు 2,69,557 మంది దరఖాస్తు చేస్తే వారిలో 2,26,744 (84.12 శాతం) మంది హాజరయ్యారని తెలిపారు. అత్యధికంగా రంగారెడ్డి జిల్లాలో 15,490 మంది దరఖాస్తు చేయగా, 14,771 (95.36 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని వివరించారు. అత్యల్పంగా నల్లగొండ జిల్లాలో 12,423 మంది దరఖాస్తు చేస్తే, 9,614 (77.39 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. పేపర్-2కు 2,08,498 మంది దరఖాస్తు చేయగా, వారిలో 1,89,963 (91.11 శాతం) మంది అభ్యర్థులు పరీక్ష రాశారని తెలిపారు. అత్యధికంగా వికారాబాద్‌లో 3,846 మంది దరఖాస్తు చేస్తే, 3,689 (95.92 శాతం) మంది హాజరయ్యారని పేర్కొన్నారు. అత్యల్పంగా రంగారెడ్డి జిల్లాలో 13,386 మంది దరఖాస్తు చేయగా, 11,071 (82.71 శాతం) మంది పరీక్ష రాశారని వివరించారు.

ఇక అందరిదృష్టి డీఎస్సీపైనే...

ఉపాధ్యాయ అభ్యర్థులందరి దృష్టి ఇక నుంచి డీఎస్సీపైనే ఉండనుంది. రాష్ట్రంలో 6,612 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో 5,089 ఉపాధ్యాయ పోస్టులు, 1,523 ప్రత్యేక (డిజెబుల్డ్) టీచర్లకు సంబంధించిన ఖాళీలున్నాయి. వాటికి భర్తీకి సంబంధించి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది. అయితే తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) కాకుండా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోనే జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) ద్వారా నియామకాల ప్రక్రియను చేపట్టనున్న విషయం తెలిసిందే. అయితే 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకే డీఎస్సీ నోటిఫికేషన్ ఈనెల ఏడో తేదీన విడుదలైంది. ఇందులో 1,739 స్కూల్ అసిస్టెంట్, 2,575 ఎస్జీటీ, 611 భాషా పండితులు, 164 పీఈటీ పోస్టులున్నాయి. మొదటిసారిగా డీఎస్సీ రాతపరీక్షలను నవంబర్ 20 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష (సీబీఆర్టీ) విధానంలో నిర్వహిస్తున్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 20 నుంచి వచ్చేనెల 21 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

సిరిసిల్లలో 'టెట్' గందరగోళం

- మారిన పరీక్ష బుక్‌లెట్
- ఆందోళనకు దిగిన అభ్యర్థులు

నవతెలంగాణ - సిరిసిల్ల క్రైం

సిరిసిల్లలో శుక్రవారం టెట్ పరీక్ష నిర్వహణ గందరగోళంగా మారింది. ఉదయం పేపర్-1 పరీక్షను సజావుగా నిర్వహించిన అధికారులు మధ్యాహ్నం పేపర్-2 పరీక్ష నిర్వహణలో నిర్లక్ష్యం వహించారు. అభ్యర్థులకు ఒక బుక్‌లెట్ బదులు మరో బుక్‌లెట్ అందింది. అభ్యర్థులంతా కేంద్రంలో ఓఎమ్మార్ షీట్స్ తీసుకుని అందులో హాల్ టికెట్, పేపర్ బుక్‌లెట్‌లోని దాదాపు 40 ప్రశ్నలకు జవాబులను బబ్లింగ్ చేశారు. ఇంతలోనే జిల్లా కేంద్రంలోని 14 పరీక్ష కేంద్రాల పర్యవేక్షణ అధికారులకు ఓ సమాచారం అందింది. అధికారికంగా అందాల్సిన ప్రశ్నపత్రం బుక్‌లెట్-2 కాగా.. దానికి బదులుగా బుక్లెట్-1 ఇచ్చారని తెలుసుకున్నారు. వెంటనే వాటిని మార్చుతామని, సంబంధిత ప్రశ్నపత్రాలు సరఫరా చేస్తున్నట్టు జిల్లా అధికారులు ప్రకటించారు. అప్పటికే కొన్ని పరీక్ష కేంద్రాల్లో అభ్యర్థులు ఓఎమ్మార్ షీట్స్‌లో హాల్ టికెట్



నంబర్, క్వశ్చన్ పేపర్ బుక్‌లెట్ నంబర్, కొన్ని ప్రశ్నలకు సమాధానాలను బబ్లింగ్ చేశారు. వీటన్నింటినీ సరిచేయడానికి ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకుంటామని చెప్పి పరీక్ష కేంద్రాల్లోని అభ్యర్థులను ఇన్విజిలేటర్ సముదాయించారు. ప్రశ్నపత్రం మార్పు చేయడానికి, నిర్ణీత సమయానికి జరిగిన ఆలస్యానికి సమానంగా అభ్యర్థులకు సమయం ఎక్కువ ఇస్తామని తెలపడంతో సమస్య తాత్కాలికంగా సర్దుమణిగింది. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించాల్సిన పరీక్షను సిరిసిల్లలో ఒక్కో కేంద్రానికి ఒక్కో విధంగా ముగించారు.

సిరిసిల్ల పత్తిపాక వీధిలోని సిద్ధార్థ పాఠశాల పరీక్ష కేంద్రంలో అభ్యర్థుల ఓఎమ్మార్ షీట్‌ను వైట్‌నర్ వేసి సర్దుబాటు చేయడంతో వాటిని పరిగణలోకి తీసుకోరన్న వాదనతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో పోలీసులకు, వివిధ పార్టీల నాయకులకు వాగ్వావాదం జరిగింది. సిరిసిల్ల పట్టణ మధ్యలో మంత్రి కేటీఆర్ మెడికల్ కాలేజీ ప్రారంభ సభ వేదిక పెట్టడం వల్ల.. తారుమారైన ప్రశ్నపత్రాలను కేంద్రాలకు సకాలంలో చేరవేయడానికి అధికారులకు కుదరలేదని పొంతనలేని సమాధానాలు చెప్పారు. ట్రాఫిక్ జామ్, అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ భవిష్యత్ అగమ్యగోచరంగా మారిందని పలువురు అభ్యర్థులు నిరసనకు దిగారు. భేషరతుగా టెట్ పరీక్షను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, అభ్యర్థులు డిమాండ్ చేశారు. నిరసనకు దిగిన ప్రతిపక్ష పార్టీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

పరీక్ష కోసం వచ్చి..ప్రాణాలు విడిచి

- ఆయాసం, బీపీ ఎక్కువై.. కుప్పకూలిన 8 నెలల నిండు గర్భిణి
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి
- ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో ఘటన

నవతెలంగాణ-పటాన్‌చెరు

టెట్ పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ ఎనిమిది నెలల నిండు గర్భిణి.. పరీక్షా హాల్‌లోకి వెళ్లే తొందరపాటులో మెట్లు ఎక్కుతూ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ గచ్చిబౌలిలోని ఇందిరానగర్‌కు చెందిన బంటు రాధిక(32) టెట్ పరీక్ష రాయడం కోసం భర్త అరుణ్‌తో కలిసి పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు వచ్చింది. ఉదయం 9 గంటలకు సెంటర్‌కు చేరుకున్న ఆమె.. రెండో అంతస్తులోని పరీక్ష హాల్‌కు మెట్ల వైపుగా వెళ్లింది. ప్రస్తుతం ఆమె ఎనిమిది నెలల గర్భిణి కాగా.. మొదటి అంతస్తుకు చేరుకునేసరికి కొంత ఆయాసంతో బీపీ ఎక్కువై, చెమటతో ఒక్కసారిగా కుప్పకూలిపోయింది.

వెంటనే అక్కడున్న వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఆమె భర్త అరుణ్ హుటాహుటిన కారులో ముత్తంగిలోని ప్రణం ఆస్పత్రికి.. అక్కడి నుంచి పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షలు చేసిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధృవీకరించారు. మృతురాలికి రెండేండ్లు, నాలుగేండ్లు ఉన్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. భార్య మృతితో భర్త అరుణ్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ ఘటనతో పరీక్షాకేంద్రంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

వైద్యరంగంలో దేశానికే ఆదర్శం

(మొదటిపేజీ తరువాయి)

ఆ సమాజం ఎక్కువ నష్టపోతుందన్నారు. తెలంగాణలో 34 వైద్య కళాశాలలు అంటే 34 పెద్ద దవాఖానాలు వస్తాయని తెలిపారు. 2014లో 17 వేలున్న పడకలు 34 వేలకు చేరాయనీ, మరో ఆరు ఆస్పత్రులు, వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించుకుంటున్నామని తెలిపారు. నిమ్స్ పడకలను 4 వేలకు పెంచడంతో పాటు నాలుగు టిమ్స్ ఆస్పత్రులు రాబోతున్నాయన్నారు. 50 వేల ఆక్సిజన్ బెడ్లు అందుబాటులో ఉంచడంతో పాటు 10 వేల సూపర్ స్పెషాలిటీ బెడ్లు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నిటి అయోగ్ నివేదిక ప్రకారం 2014లో వైద్యారోగ్య రంగంలో 11వ స్థానంలో ఉన్న తెలంగాణ ప్రస్తుతం మూడో స్థానానికి చేరుకుందని తెలిపారు. ప్రయివేటు దోపిడీ నుంచి ప్రజలను బయటపడేయాలనే ఆలోచనతోనే కేసీఆర్ కిట్ తెచ్చినట్టు సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ కిట్ మానవీయ కోణంలో తీసుకొచ్చామని తెలిపారు. అమ్మఒడి వాహనాలతో మారుమూల ప్రాంతాలకు చెందిన గర్భవతులు, బాలింతలకు రవాణా సౌకర్యం కల్పించబడిందని తెలిపారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పుట్టబోయే బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. మాతా, శిశు మరణాలను మరింతగా తగ్గిస్తుందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకురావాలని వైద్య విద్యార్థులకు సూచించారు. ఏవైనా కొరతలుంటే ఎంత ఖర్చు చేయడానికైనా వెనుకాడేది లేదని సీఎం హామీ ఇచ్చారు. రాబోయే ఆర్థిక సంవత్సరం 2024-25లో మరో ఎనిమిది మెడికల్ కాలేజీలు జోగులాంబ గద్వాల, ములుగు, మెదక్, నారాయణపేట, వరంగల్(నర్సంపేట), యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సీఎం కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ తదితరులు పాల్గొన్నారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి

(మొదటిపేజీ తరువాయి)

ఎల్లయ్య, ఆదిలాబాద్‌లో ఎమ్‌బీ రావు, కరీంనగర్‌లో శ్రీనివాస్, నల్గొండలో సుధాకర్, నర్సింహ, మహబూబ్‌నగర్‌లో ప్రభాకర్, వీరాంజనేయులు, గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో జీఆర్ రెడ్డి, కష్ణ, ప్రకాష్ తదితరులు నాయకత్వం వహించారు.

పార్లమెంటులో మహిళా, బీసీ బిల్లులు పెట్టాలి

(మొదటిపేజీ తరువాయి)

తీర్మానం చేశారు. ఈ సందర్భంగా లోక్‌సభ, రాజ్యసభల్లో బీఆర్ఎస్ సభ్యులు అనుసరించాల్సిన వ్యూహంపై ఆయన దిశానిర్దేశం చేస్తూ మాట్లాడారు. మహిళా సంక్షేమం, బీసీల అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ పార్టీ కట్టుబడి వున్నదనీ, దేశవ్యాప్తంగా వారి హక్కులను కాపాడేందుకు కేంద్రానికి

ఎప్పటికప్పుడు తమ గళాన్ని వినిపిస్తూనే ఉంటామని చెప్పారు. ఈ అంశాలను పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో లేవనెత్తాలని ఎంపీలకు చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లుపై చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తుచేశారు.

ఈ తీర్మానం చేసి తొమ్మిదేండ్లు గడుస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈనెల 18 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటరీ ప్రత్యేక సమావేశాల్లో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలనీ, దీనిపై కూడా తెలంగాణ రాష్ట్ర తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే ఏకగ్రీవ తీర్మానం చేసి పంపిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు.

నేడు సీడబ్ల్యూసీ సమావేశం

(మొదటిపేజీ తరువాయి)

ఉండనున్న నేపథ్యంలో ఈ సమావేశం రాష్ట్ర ప్రజలతోపాటు జాతీయ స్థాయిలో కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షులు రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ పాలిత ముఖ్యమంత్రులు, తదితరులు శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు రానున్నారు. కాంగ్రెస్ పార్టీలోని ఆయా కమిటీల నేతలు, ఇతర ముఖ్య నాయకులు నగరానికి ఇప్పటికే చేరుకున్నారు.

సీడబ్ల్యూసీ సమావేశం సందర్భంగా తాజ్ కృష్ణతోపాటు సభ్యులు బస చేసే హైదరాబాద్‌లోని ప్రముఖ హోటల్స్ వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహి ంచే విజయభేరి సభకు ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి.

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, మరో కీలక నేత జైరాం రమేష్...ఢిల్లీ నుంచి నేరుగా శంషాబాద్ విమానశ్రయం నుంచి తుక్కుగూడ సభాస్థలిని రేవంత్‌రెడ్డితోపాటు ఇతర నేతలతో కలిసి పరిశీలించారు.

విజయభేరి సభలో సోనియాగాంధీ ఆరు హామీలను విడుదల చేయనున్నారు. అందులో కర్నాటక తరహాలో గృహలక్ష్మి, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అసైన్డ్ భూములకు యాజమాన్యపు హక్కులు కల్పించడం, యువత, రైతులకు ప్రత్యేకంగా భరోసా కల్పించనున్నారు.

ఇవి కాకుండా ఎస్సీ, ఎస్టీ, మహిళా, మైనార్టీ, బీసీ సామాజిక తరగతులకు డిక్లరేషన్లు సిద్ధం చేసింది. కొన్నింటిని ప్రకటించింది. వీటన్నింటి సమ్మేళనంతో ప్రజలను ఆకర్షించే మ్యానిఫెస్టోను అక్టోబర్ మాసంలో విడుదల చేయనున్నట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

హైకోర్టు, జిల్లా కోర్టుల జోక్యం తగదు!



- జస్టిస్ ఎల్.నాగేశ్వర రావు కమిటీ అంశంలో సుప్రీం
- కమిటీ విధులకు ఆటంకం కలిగించే ఆదేశాలు చెల్లవు
- హైదరాబాద్ క్రికెట్ సంఘం ఎన్నికలకు లైన్ క్లియర్

నవతెలంగాణ-న్యూఢిల్లీ



హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ఎన్నికలు, సంస్కరణలకు సంబంధించి సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏండ్లుగా హైదరాబాద్ క్రికెట్ సంఘంలో గ్రూపు రాజకీయాలు ఆట అభివృద్ధికి గొడ్డలిపెట్టుగా నిలుస్తుందని, హెచ్‌సీఏ సమూల సంస్కరణలు, భవిష్యత్‌లో వివాద రహిత అపెక్స్ కౌన్సిల్ ఎన్నికకు అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ ఏడాది ఫిబ్రవరి 14న జస్టిస్ లావు నాగేశ్వర రావుతో కూడిన ఏక సభ్య కమిటీని సుప్రీంకోర్టు నియమించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ క్రికెట్ సంఘం సమస్యలను సమూలంగా అధ్యయనం చేసిన ఏకసభ్య కమిటీ.. అపెక్స్ కౌన్సిల్ ఎన్నికను ప్రభావితం చేస్తున్న బహుళ క్లబ్‌ల యజమానులను ఎన్నికల ప్రక్రియకు దూరం చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఏకసభ్య కమిటీ నిర్ణయంపై పలు క్లబ్‌లు జిల్లా, హైకోర్టును ఆశ్రయించాయి. దీంతో షెడ్యూల్ ప్రకారం సెప్టెంబర్ 15న నిర్వహించాల్సిన ఎన్నికలు పట్టాలెక్కలేదు. దిగువ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులపై జస్టిస్ లావు నాగేశ్వర రావు సుప్రీంకోర్టులో పిటిషను దాఖలు చేయగా.. జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సిదాన్షు ధులియలతో కూడిన ద్వి సభ్య ధర్మాసనం కీలక ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు న్యాయ పరిధి మేరకు ఆర్టికల్ 142 ప్రకారం ప్రత్యేకంగా ఈ ఆదేశాలు జారీ చేస్తున్నాం. సంపూర్ణ న్యాయం అందించే ప్రక్రియలో భాగంగా ఆర్టికల్ 142ను వినియోగిస్తారు.

ఆ ఆదేశాలు చెల్లవు!

జస్టిస్ లావు నాగేశ్వర రావు కమిటీ హెచ్‌సీఏ ఎన్నికల్లో పాల్గొనకుండా బహుళ యాజమాన్యంలోని 57 క్లబ్‌లపై మూడేండ్ల పాటు నిషేధం విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దీనిపై పలు క్లబ్‌లు న్యాయస్థానాలను ఆశ్రయించాయి. ఎలక్టోరల్ కాలేజ్ ఏర్పాటు తుది ప్రక్రియ ఖరారు చేసిన జస్టిస్ లావు నాగేశ్వర రావు.. ఎన్నికల అధికారిగా మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ వి.ఎస్ సంపత్‌ను నియమించారు. కానీ ఓటు హక్కు, ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లేకుండా చేయటంపై కొన్ని క్లబ్‌లు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు సహా జిల్లా కోర్టులు పలు ఆదేశాలు జారీ చేశాయి. దీంతో హెచ్‌సీఏ ఎన్నికల ప్రక్రియకు బ్రేక్ పడింది. ఈ పరిస్థితిపై జస్టిస్ లావు నాగేశ్వరరావు సుప్రీంకోర్టులో పిటిషను దాఖలు చేయగా.. ద్వి సభ్య ధర్మాసనం దిగువ కోర్టుల ఆదేశాలు చెల్లవని పేర్కొంది. 'ఎలక్టోరల్ కాలేజ్ జాబితా మార్పులు, చేర్పులపై దిగువ కోర్టులు ఆదేశాలు చెల్లవు. ఏక సభ్య కమిటీ విధులకు విఘాతం కలిగించే ఆదేశాలు అమల్లోకి రాలేవు. హెచ్‌సీఏ ఎన్నికలు, సంస్కరణల అంశంలో ఏక సభ్య కమిటీకి సుప్రీంకోర్టు పూర్తి అధికారాలు ఇచ్చింది. సుప్రీంకోర్టు ఎదుట పెండింగ్‌లో ఉన్న పిటిషను సైతం ఎన్నికల నిర్వహణకు ఆటంకం కాబోదు. జస్టిస్ నాగేశ్వర రావు కమిటీ తన విధులను యథావిధిగా నిర్వర్తించాలి' అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అన్నారు.



రిటైర్డ్ జడ్జితో విచారణ కమిటీ!

విశ్రాంత జస్టిస్ లావు నాగేశ్వర రావు పిటిషను విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. హైదరాబాద్ క్రికెట్ సంఘం సహా ఇతర క్రీడా సంఘాల్లోనూ ఇదే తీరు కనిపిస్తుంది. కొందరు వ్యక్తులు శాశ్వతంగా పదవుల్లో కొనసాగేందుకు ఎన్నికల ప్రక్రియకు అడ్డుగా నిలుస్తున్నారు. గ్రూపు రాజకీయాలకు కేంద్రంగా మారిన హైదరాబాద్ క్రికెట్ సంఘంలోనూ ఇదే తీరు. గతంలో అంబుడ్స్‌మన్ ఎంపిక విషయంలో హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సరైన రీతిలో వ్యవహరించలేదు. అంబుడ్స్‌మన్, ఎథిక్స్ ఆఫీసర్ ఎంపిక వివాదం సహా హెచ్‌సీఏ వ్యవహారాలపై సమగ్ర విచారణకు సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో కమిటీ ఏర్పాటుకు ఆదేశిస్తామని ఈ సందర్భంగా జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో విచారణను అక్టోబర్ 31కి వాయిదా వేశారు.



స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ

- శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్
- థాయ్ బాక్సింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో తెలంగాణ స్పోర్ట్స్ హబ్‌గా తయారైందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. ఎల్బీ స్టేడియం వేదికగా జాతీయ థాయ్ బాక్సింగ్ పోటీలు నేటి నుంచి ఆరంభం కానుండగా.. టోర్నీకి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. 'క్రీడా రంగానికి తెలంగాణ ప్రభుత్వం పెద్ద పీట వేస్తుంది. స్టేడియాల నిర్మాణం, మౌళిక వసతుల కల్పన సహా గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం అందించేందుకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం. ప్రతి గ్రామానికి సమగ్ర క్రీడా సామాగ్రితో కూడిన కెసిఆర్ స్పోర్ట్స్ కిట్‌ను అందజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. జాతీయ థాయ్ బాక్సింగ్ పోటీలకు హైదరాబాద్‌ను ఎంచుకోవటం సంతోషం. క్రీడా పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం, శాట్స్ నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని' ఆంజనేయ గౌడ్ అన్నారు. జాతీయ థాయ్ బాక్సింగ్ టోర్నీలో 16 రాష్ట్రాల నుంచి 390 మంది బాక్సర్లు పోటీపడుతున్నారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో మెన్, ఉమెన్ చాంపియన్‌షిప్స్ జరుగుతాయి. శనివారం పోటీలు ఆరంభం కానుండగా, ఆదివారం అన్ని విభాగాల్లో ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మహారాష్ట్ర ఎమ్మెల్యే గౌతమ్ చుబుకేశ్వర్, తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, థాయ్‌బాక్సింగ్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ అధ్యక్షుడు సంతోష్ ఖైర్నార్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ నం.2 భారత్

ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్



దుబాయ్: ఐసీసీ ప్రపంచకప్ ముంగిట టీమ్ ఇండియా ర్యాంకింగ్స్‌లో ఎగబాకుతుంది. ఆసియా కప్ ఫైనల్లోకి ప్రవేశించిన రోహిత్‌సేన.. తాజా ఐసీసీ వన్డే టీమ్ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకుంది. భారత్ 116 పాయింట్లతో వరల్డ్ నం.2గా నిలువగా.. 118 పాయింట్లతో ఆస్ట్రేలియా అగ్రస్థానం సొంతం చేసుకుంది. వరల్డ్ నం.1గా ఆసియా కప్‌కు వచ్చిన పాకిస్థాన్.. సూపర్4 నుంచి నిష్క్రమించి మూడో స్థానానికి పడిపోయింది. సెప్టెంబర్ 22 నుంచి ఆస్ట్రేలియా, భారత్ వన్డే సిరీస్ ఉండటంతో.. ఐసీసీ వరల్డ్‌కప్ వేట ముంగిట అగ్రజట్లు సమర సన్నద్ధతతో పాటు అగ్రస్థానం కోసం పోటీపడనున్నాయి.



కొత్తగా మరో 22 మంది అథ్లెట్లు

ఆసియా క్రీడలకు భారత బృందం

న్యూఢిల్లీ: 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత అథ్లెట్ల బృందంలో కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ పలు మార్పులు చేసింది. ఆసియా క్రీడల్లో పోటీపడేందుకు కొత్తగా 22 మంది అథ్లెట్లకు అవకాశం కల్పించిన క్రీడాశాఖ.. కోచ్‌లు, సహాయక సిబ్బందిలోనూ పలు మార్పులు చేసింది. తొలుత వెల్లడించిన జాబితాలో 25 మంది సిబ్బందిని మార్చివేసింది. ఈ మేరకు సవరించిన ఆసియా క్రీడల భారత బృందం జాబితాను శుక్రవారం వెల్లడించారు. సెప్టెంబర్ 23 నుంచి ఆసియా క్రీడలు ఆరంభం కానున్నాయి.

శుభ్‌మన్ శతకం

- ఛేదనలో భారత్ ఎదురీత
- బంగ్లాదేశ్ 265/8



కొలంబో: శుభ్‌మన్ గిల్ సెంచరీతో ఛేదనలో టీమ్ ఇండియా పోరాడుతుంది. బ్యాటింగ్ లైనప్ పెవిలియన్‌కు చేరగా ఓపెనర్ శుభమన్‌మన్ గిల్ ఒంటరి పోరాటం చేస్తున్నాడు. 266 పరుగుల ఛేదనలో భారత్ 40 ఓవర్లలో 188/6తో ఎదురీదుతోంది. 60 బంతుల్లో భారత్ 78 పరుగులు చేయాల్సి ఉంది. ఇక ఆసియా కప్ సూపర్4 దశలో భారత్‌తో మ్యాచ్‌లో బంగ్లాదేశ్ మంచి స్కోరు సాధించింది. నామమాత్రపు మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 265 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ కెప్టెన్ షకిబ్ అల్ హసన్ (80, 85 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సలు), తౌహిద్ (54, 81 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సలు) అర్థ సెంచరీలతో రాణించారు.

టాస్ నెగ్గిన భారత్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్య, జశ్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్‌లకు విశ్రాంతి లభించగా.. తెలుగు తేజం తిలక్ వర్మ వన్డే అరంగ్రేటం చేశాడు. కొత్త బంతితో భారత పేసర్లు చెలరేగారు. షమి, శార్దుల్ వికెట్ల వేటలో దూకుడు చూపించారు. దీంతో 59 పరుగులకే బంగ్లాదేశ్ 4 వికెట్లు కోల్పోయింది. దీంతో బంగ్లాదేశ్ 150 పరుగులు చేయటం చేసినా గొప్పే అనిపించింది. కానీ కెప్టెన్ షకిబ్ అల్ హసన్ (80), తౌహిద్ (54), నసుం అహ్మద్ (44), మెహిది హసన్ (29)లు భారత బౌలర్లను ఎదురొడ్డి పరుగుల వేట సాగించారు. దీంతో బంగ్లాదేశ్ 265 పరుగుల మంచి స్కోరు నమోదు చేసింది. హసన్ (13), లిటన్ దాస్ (0), అనాముల్ (4), మెహిది మిరాజ్ (13), షమిమ్ (1)లు విఫలమయ్యారు. శార్దుల్ ఠాకూర్ (3/65), మహ్మద్ షమి (2/32) మెరువగా.. ప్రసిద్ కృష్ణ, అక్షర్, జడేజా తలా ఓ వికెట్ ఖాతాలో వేసుకున్నారు.

పది నగరాల్లో జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

మెంటార్లుగా స్టార్ షట్లర్లు సాత్విక్, చిరాగ్



హైదరాబాద్: జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (జెబిసి) 2023 ఈ నెల 15 నుంచి ఆరంభం కానుంది. విజయవంతంగా ఏడో సీజన్‌కు సిద్ధమైన జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఈ ఏడాది దేశవ్యాప్తంగా పది నగరాల్లో జరుగనుంది. ఈ మేరకు నిర్వాహకులు పిఎన్‌బి మెట్‌లైఫ్ ఎండీ, సీఈవో ఆశీష్ కుమార్ శ్రీవాత్సవ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన టోర్నీ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లో జరిగింది. భారత అగ్రశ్రేణి షట్లర్లు సాత్విక్‌సాయిరాజ్, చిరాగ్ శెట్టిలు జెబిసి మెంటార్లుగా వ్యవహరించనున్నారు. గువహటిలో సెప్టెంబర్ 15 నుంచి ఆరంభం కానున్న ఈ టోర్నీ.. నవంబర్ 10న ఢిల్లీలో ముగియనుంది. కోచి, ముంబయి, బెంగళూర్, రాంచీ, అహ్మదాబాద్, లక్నో జలంధర్‌లో సైతం టోర్నీ నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో అక్టోబర్ 19 నుంచి 23 వరకు జెబిసి పోటీలు నిర్వహించనున్నారు.

నవచిత్రం



భావోద్వేగ భరిత క్షణాలు..

100 కుటుంబాలకు రూ. కోటి సాయం

"ఖుషి' సినిమాకు ఘన విజయాన్ని అందించిన అభిమానులతో తన సంతోషాన్ని పంచుకుకున్నారు హీరో విజయ్ దేవరకొండ. 'ఖుషి' హ్యాపీనెస్‌ని షేర్ చేసేందుకు ఎంపిక చేసిన 100 లక్కీ ఫ్యామిలీస్‌కు లక్ష రూపాయల చొప్పున ఆయన చెక్స్ అందించారు. ఈ చెక్స్ అందుకున్న కుటుంబాలు ఉద్వేగానికి లోనై విజయ్‌ను హగ్ చేసుకున్నారు.

హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు శివ నిర్వాణ, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, వై రవిశంకర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ,'నాకు ఇంత ప్రేమ పంచుతున్న మీ కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేయాలని ఉంటుంది. ఎందుకంటే నేను కూడా ఒకప్పుడు ఇలా ఎవరైనా మనకు హెల్ప్ చేస్తే బాగుండు అని అనుకున్న వాడినే. ఈ లక్ష రూపాయలు అందిన తర్వాత కొంచెం సంతోషం కలిగి ఒత్తిడి తగ్గి, బలాన్నిచ్చి మీకు ఆనందంగా అనిపిస్తే నాకు అదే సంతృప్తినిస్తుంది. ఈ చిన్న సాయం మీకు ఉపయోగపడితే నాకు హ్యాపీ. లాస్ట్ టైమ్ కొంతమంది పిల్లల్ని టూర్‌కు పంపించా. ఈ ప్రోగ్రాం అనౌన్స్ చేసినప్పటి నుంచి 50 వేలకు పైగా అప్లికేషన్స్ వచ్చాయి. అయితే 100 మందికి మాత్రమే చేయగలుగుతున్నాం. ప్రతి ఇయర్ ఇంకొందరికి హెల్ప్ చేస్తా. ఇలా నేను స్ట్రాంగ్‌గా ఉన్నంతవరకు, నేను సినిమాలు చేస్తున్నంతకాలం మీకు సపోర్ట్ చేస్తూనే ఉంటాను' అని తెలిపారు.

'ఖుషి' సినిమా సక్సెస్ మా అందరికీ ఎంత ఖుషిని పంచిందో మీకు తెలుసు. మీ అందరి ఆదరణ వల్లే సినిమా ఇంత సక్సెస్ అయ్యింది. మా సంతోషాన్ని మీతో కూడా పంచుకునేందుకు విజయ్ ఇలా చేయటం హ్యాపీగా ఉంది. ఆడియెన్స్, అభిమానులు ఇచ్చిన ప్రేమ వల్లే మా మైత్రి సంస్థ ఇంత మంచి పొజిషన్‌లో ఉంది. వారికి తిరిగి ఇవ్వడం అనే గుడ్ కాన్సెప్ట్‌ని విజయ్ తీసుకురావడం బాగుంది. ఇండస్ట్రీలోని మిగతా వారు కూడా ఇలాంటి అడుగు వేస్తారని ఆశిస్తున్నాం. భవిష్యత్‌లోనూ మా సంస్థ ఇలాంటి మరిన్ని మంచి కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేస్తుంది. మీ అందరి ఆదరణకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు' అని దర్శక, నిర్మాతలు శివ నిర్వాణ, వై రవిశంకర్, నవీన్ యెర్నేని అన్నారు.




బ్రహ్మానందం

కీడా కోలా రిలీజ్ డేట్ ఫిక్స్

దర్శకుడు తరుణ్ భాస్కర్ దాస్యం దర్శకత్వంలో రూపొందుతున్న క్రైమ్ కామెడీ మూవీ 'కీడా కోలా'. హీరో రానా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్ర ఫస్ట్ లుక్, టీజర్‌తో క్యూరియాసిటీని పెంచింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. నవంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదల కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో బ్రహ్మానందం, తరుణ్ భాస్కర్, చైతన్య రావు.. ప్రధాన తారాగణం అంతా సీరియస్ లుక్స్‌లో కనిపించడం ఆసక్తికరంగా ఉంది. ఇది విజి సైన్మా మొదటి ప్రొడక్షన్. కె.వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్ నండూరి, శ్రీపాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. బ్రహ్మానందం, రఘు రామ్, రవీంద్ర విజయ్, జీవన్ కుమార్, విష్ణు, తరుణ్ భాస్కర్, చైతన్య రావు మదాడి, రాగ్ మయూర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వివేక్ సాగర్, సినిమాటోగ్రఫీ: ఏజే ఆరోన్, ఎడిటర్: ఉపేంద్ర వర్మ.

భయం.. అత్యాశ.. కుట్ర



హీరో ఆనంద్ దేవరకొండ నటిస్తున్న కొత్త సినిమా 'గం..గం.. గణేశా'. హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్న ఈ చిత్రంతో ఉదయ్ శెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్ర టీజర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో రిలీజ్ చేశారు. ఈ వేడుకలో దర్శకులు శివ నిర్వాణ, అనుదీప్ కేవీ, కార్తీక్ దండు, వినోద్ అతిథులుగా పాల్గొని చిత్ర విజయాన్ని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ వంశీ కారుమంచి మాట్లాడుతూ, 'టీజర్ ఎంత ఎనర్జిటిక్‌గా, కామెడీగా ఉందో మూవీ కూడా అంతే యాక్షన్ కామెడీతో ఉంటుంది. ఈ సినిమా ఈ ఇయర్ ఆనంద్‌కు సెకండ్ సూపర్ హిట్ అవుతుంది' అని చెప్పారు.

డైరెక్టర్ ఉదయ్ శెట్టి మాట్లాడుతూ, 'మన లైఫ్‌లో ఏదో ఒక సందర్భంలో క్రేజీ క్యారెక్టర్స్ చూస్తుంటాం. అలాంటి క్రేజీ క్యారెక్టర్స్ అన్నీ ఈ సినిమాలో ఉంటాయి. వినాయక చవితి చుట్టూ తిరిగే కథ ఇది' అని తెలిపారు. 'భయం, అత్యాశ, కుట్ర చుట్టూ ఈ సినిమా తిరుగుతుంటుంది. సినిమాలో అన్నీ గ్రే క్యారెక్టర్స్ ఉంటాయి. ఎవరి ప్లాన్స్‌తో వారు ఉంటారు. రేసీ, గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లే చూస్తారు' అని హీరో ఆనంద్ దేవరకొండ అన్నారు.



సప్త సముద్రాలు దాటి వస్తావా..

రక్షిత్ శెట్టి, రుక్మిణీ వసంత్

నలుగురు దర్శకులతో కొత్త ప్రయోగం



'కాలా' సిరీస్‌లో ఒక దృశ్యం

వైట్ మనీని బ్లాక్ మనీగా మార్చే కథాంశంతో రూపొందిన 'కాలా' వెబ్‌సిరీస్ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ప్రసారం అవుతోంది. ఈ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌లో నివేత పేరురాజ్, రిత్విక్ ముఖర్జీతో పాటు నలుగురు దర్శకులు కూడా నటించడం విశేషం. ఇది కొత్త ప్రక్రియ అని, కొత్త కథలకు 'కాలా' స్ఫూర్తి అని హాట్‌స్టార్ ప్రతినిధులు అన్నారు.వీరి గురించి దర్శకుడు బెజోయ్ నంబియార్ మాట్లాడుతూ, 'డానిష్ అస్లాం, క్యూ అని పిలవబడే కౌషిక్ ముఖర్జీ, వినీల్ మాథ్యూ, శివ ఆనంద్ వీరంతా దర్శకులే. ఇది కావాలని తీసుకున్న నిర్ణయం కాదు. కాస్టింగ్ చేస్తున్నప్పుడు నా మనస్సులోకి వచ్చిన పేర్లు ఇవి. వీరిని ఉద్దేశ్యపూర్వకంగా తీసుకున్నారా! అని హాట్ స్టార్ బృందం అడిగింది. వారు మాత్రమే పాత్రలకు న్యాయం చేస్తారని భావించాను. సిరీస్‌కు కొత్తదనం వస్తుందని ఆలోచించానని అనగానే వారు అంగీకరించారు. సెట్‌లో నలుగురు దర్శకులుంటే స్క్రిప్ట్ మరింత మెరుగ్గా వస్తుందన్న పాయింట్ నచ్చి స్టార్ బృందం అభినందించారు. నేను క్రియేట్ చేసి రన్ చేస్తున్న షో ఇది. దాన్ని బేస్ చేసుకుని కొన్ని సిరీస్ కూడా రావచ్చు అనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈనెల 15నుంచి డిస్నీలో ప్రసారం అవుతున్న ఈ మిస్టరీ సిరీస్ ఆదరణ మరింత పెరిగింది' అని అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886